మంగళవారం
8•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 194
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



అగ్రవర్ణ పేదలకు..

ఆర్థికంగా వెనుకబడినవారికి

పదిశాతం కోటా

విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

- జనరల్ క్యాటగిరీలోని 50 శాతంలోనే 10 శాతం కేటాయింపు
- ప్రధాని నేతృత్వంలో జరిగిన భేటీలో కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర
- తాజా పెంపుతో 60 శాతానికి చేరుకోనున్న రిజర్వేషన్లు
- నేడు లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్న కేంద్రం
- బిల్లు కోసం రాజ్యసభ ఒక రోజు పొడిగింపు
- 100 రోజుల ముందే ఎన్నికల నగారా మోగించిన ప్రధాని నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, జనవరి 7:

సార్వత్రిక ఎన్నికలకు 100 రోజుల ముందే ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల నగారా మోగించారు. విపక్షాలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లకు ఆమోదముద్ర వేశారు. జనరల్ క్యాటగిరీలోనే 10 శాతాన్ని ఆర్థికంగా వెనుకబడిన పేదలకు కేటాయించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వార్షికాదాయం రూ.8లక్షలలోపు ఉన్నవారు ఈ కోటా పరిధిలోకి వస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన సోమవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో అగ్రవర్ణ కోటాకు పచ్చజెండా ఊపారు. ఇటీవలి ఉత్తరాది రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల్లో దారుణ పరాభవం నేపథ్యంలో మోదీ ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇప్పటివరకు ఆర్థికంగా వెనుకబడినప్పటికీ జనరల్ క్యాటగిరీ అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తించేవి కావు. కేంద్రం తాజా నిర్ణయంతో వారికి కోటా ఫలాలు దక్కనున్నాయి. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉండగా తాజా ప్రతిపాదనతో ఇది 60 శాతానికి చేరుకోనున్నది. 10 శాతం రిజర్వేషన్ల పెంపును అమలు చేయాలంటే ముందుగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఆర్థికపరమైన రిజర్వేషన్లను ప్రత్యేకంగా రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనలేదు. ఈ నేపథ్యంలో కేంద్రం ఆగమేఘాలపై సవరణ బిల్లును మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమైంది. కేంద్ర క్యాబినెట్ తాజా నిర్ణయంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16లకు సవరణ చేయాల్సి ఉంటుంది. కుల ఆధారిత రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని 1992లో సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది. ఈ నేపథ్యంలో కోటాను కేంద్రం

మిగతా 5వ పేజీలో

ఎవరు అర్హులు

- రూ. 8 లక్షలలోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలు
- ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్నవారు
- వెయ్యి చదరపు అడుగులలోపు ఇల్లు ఉన్నవారు
- నోటిఫైడ్ మున్సిపాలిటీల్లో 100 గజాలలోపు.. నాన్ నోటిఫైడ్ మున్సిపాలిటీల్లో 200 గజాలలోపు ఇంటి స్థలం ఉన్నవారు

కులమతాలతో నిమిత్తం లేకుండా..

అగ్రవర్ణాల్లోని పేదలతోపాటు కులమతాలతో నిమిత్తం లేకుండా అందరికీ రిజర్వేషన్ ఫలాలు అందుతాయి. తెలుగురాష్ర్టాల్లోని రెడ్డి, వెలమ, కమ్మ, బ్రాహ్మణ తదితర అగ్రవర్ణాల్లోని పేదలు, ఉత్తరాదిలోని రాజ్‌పుత్, భూమిహార్, జాట్, గుజ్జర్ తదితర కులాల్లోని పేదలకు కోటా వర్తిస్తుంది.

ఎన్నికల జిమ్మిక్కు

- సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే రిజర్వేషన్లు తెరపైకి తెచ్చారని విపక్షాల ధ్వజం
- రిజర్వేషన్లు చరిత్రాత్మకం, విపక్షాలకు మాస్టర్‌స్ట్రోక్: ఎన్డీఏ పక్షాలు



ఆర్థిక ప్రాతిపదికన కోటా
రాజ్యాంగ విరుద్ధం
రిజర్వేషన్లు కల్పించాల్సింది సామాజిక వెనుకబాటుతనానికే: ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

5



కోటా పెంపు అధికారం
రాష్ర్టాలకే ఇవ్వాలి
సుప్రీం తీర్పుతో ముస్లిం రిజర్వేషన్లు పెంచనప్పుడు.. ఇప్పుడు ఈ కోటా ఎలా ఇస్తారు: ఎంపీ బూర నర్సయ్య



సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతో భారత జట్టు ఆనంద హేల

కోహ్లీసేన సంచలనం

కోహ్లీసేన కొత్తచరిత్ర లిఖించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఇన్నాళ్లు కలగానే మిగిలిపోయిన టెస్ట్ సిరీస్ విజయాన్ని అద్భుతంగా ఒడిసిపట్టుకుంది. దిగ్గజాలకు సాధ్యంకాని రికార్డును యువ రక్తంతో తొణికిసలాడుతున్న టీమ్‌ఇండియా చేతల్లో చేసిచూపెట్టింది. ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1తో సగర్వంగా ముద్దాడింది. కోహ్లీ నాయకత్వ శైలి, చతేశ్వర్ పుజార సెంచరీల మోత, రిషబ్ పంత్ హార్డ్‌హిట్టింగ్, బుమ్రా బౌలింగ్‌తో కంగారూలను కసిగా వేటాడింది. బాల్ ట్యాంపరింగ్‌తో మసకబారిన దేశ క్రికెట్ చరిత్రను సరిదిద్దుకునే ప్రయత్నంలో భారత్‌ను తక్కువ అంచనా వేసిన ఆస్ట్రేలియా భారీ మూల్యం చెల్లించుకుంది. గతానికి భిన్నంగా బుమ్రా, షమీ, ఇషాంత్ లాంటి ప్రపంచస్థాయి పేసర్లతో కళకళలాడుతున్న టీమ్ ఇండియా..ఆసీస్‌ను ఓ ఆటాడుకుంది.అడిలైడ్‌లో అదిరిపోయే బోణీతో టెస్ట్ సిరీస్‌ను ఆరంభించిన టీమ్‌ఇండియాకు పెర్త్‌లో పరాజయమెదురైనా వెరువకుండా మెల్‌బోర్న్‌లో రికార్డు విజయంతో ముందంజ వేసింది. ఆఖరిదైన సిడ్నీ టెస్ట్‌లో ఆసీస్‌పై అన్నింటా ఆధిపత్యం చెలాయించినా వరుణుడి రంగప్రవేశంతో డ్రాతో సరిపెట్టుకుంది. మొత్తంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నాళ్లకు ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ విజయాన్ని కోహ్లీసేన సాకారం చేసి చూపింది. కోట్ల మంది అభిమానులు కలకాలం గుర్తుండిపోయే చిరస్మరణీయ సందర్భాన్ని లిఖించి దేశ రాష్ట్రపతి, ప్రధాని లాంటి ప్రముఖుల అభినందనలు చూరగొన్నది. ఆసీస్ టెస్ట్ సిరీస్ విజయమిచ్చిన ఆత్మవిశ్వాసంతో ప్రపంచంలో ఏ జట్టునైనా మట్టికరిపించగలమన్న ధీమాను కూడగట్టుకుంది.

ఆస్ట్రేలియాలో తొలి టెస్ట్ సిరీస్ కైవసం

71 ఏండ్ల సుదీర్ఘ కల సాకారం

వర్షంతో డ్రాగా ముగిసిన సిడ్నీ టెస్ట్

వివరాలు ఆటలో

నామినేటెడ్ సభ్యుడిగా
మళ్లీ స్టీఫెన్‌సన్



తీర్మానించిన రాష్ట్ర క్యాబినెట్

- ఆమోదం తెలిపిన గవర్నర్ నరసింహన్
- ఇతర సభ్యులతోపాటే ప్రమాణస్వీకారం చేయనున్న స్టీఫెన్‌సన్
- ఎన్నికల సంఘాన్ని అభినందించిన మంత్రివర్గం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆంగ్లో ఇండియన్ల తరఫున అసెంబ్లీ నామినేటెడ్ సభ్యుడిగా ఎల్విస్ స్టీఫెన్‌సన్ మరోసారి నియమితులయ్యారు. సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన మొట్టమెదటి క్యాబినెట్ సమావేశంలో స్టీఫెన్‌సన్‌ను మరోసారి నామినేటెడ్ ఎమ్మెల్యేగా నియమించాలని నిర్ణయించారు. క్యాబినెట్ తీర్మానాన్ని గవర్నర్ నరసింహన్‌కు పంపగా, ఆయన వెంటనే ఆమోదం తెలిపారు. దీంతో ఎల్విస్ స్టీఫెన్‌సన్‌ను నామినేటెడ్ ఎమ్మెల్యేగా నియమిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదలచేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి సమాచారం ఇచ్చింది. ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి రజత్‌కుమార్ స్టీఫెన్‌సన్‌ను నామినేటెడ్ ఎమ్మెల్యేగా నియమిస్తూ సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ జారీచేశారు. దీంతో స్టీఫెన్‌సన్ నామినేషన్ ప్రక్రియ

మిగతా 4వ పేజీలో

ఈ టర్మ్‌లోనే ప్రాజెక్టుల పూర్తి

కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

మన నీటివాటాను పూర్తిగా వినియోగించుకోవాలి

- వేసవికల్లా కాళేశ్వరం ప్రాజెక్టు సిద్ధంకావాలి
- వానకాలం నుంచే రోజుకు 2 టీఎంసీల పంపింగ్
- పాలమూరు-రంగారెడ్డిని వేగంగా పూర్తిచేయాలి
- దేవాదులపై కొత్త ప్రతిపాదనలు రూపొందించాలి
- ఉమ్మడి వరంగల్‌కు దేవాదుల ద్వారా నీరు
- ప్రాజెక్టుల నీటితో చెరువులు నింపేందుకు ప్రాధాన్యం
- రాజకీయ సుస్థిరత ఉంది.. నిధులకు కొరతలేదు
- సాగునీటి ప్రాజెక్టులపై అధికారులు, ఇంజినీర్లతో సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- పక్కా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశం



సోమవారం సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

కలప స్మగ్లర్లపై పీడీ
అడవుల రక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలి: సీఎం కేసీఆర్

2

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో చేపట్టిన అన్ని సాగునీటి ప్రాజెక్టులను ఈ టర్మ్‌లోనే పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎండాకాలంలో పూర్తికావాలని, వానాకాలంనుంచి రోజుకు రెండు టీఎంసీల నీటిని పంపింగ్ చేయాలని స్పష్టంచేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తిచేయాలన్నారు. ఈ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని చెప్పారు. తుపాలకులగూడెం వద్ద ఏడాదికి 75 టీఎంసీలకు పైగా నీటిని తీసుకునే అవకాశం ఉందని, ఈ మేరకు దేవాదుల ప్రాజెక్టుపై పూర్తిస్థాయి సమీక్ష చేసి, కొత్త ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా గోదావరి, కృష్ణా బేసిన్లలో రాష్ర్టానికున్న నీటివాటాను

మిగతా 2వ పేజీలో

ఎన్నిసార్లు కోరినా మోదీ డబ్బులివ్వలేదు

'తెలంగాణ ప్రాంతం వెనుకబడింది. సాగునీటిరంగంలో వివక్షకు గురైంది. అందుకోసమే ఇక్కడి ప్రజలు పోరాటం చేశారు. కాబట్టి తెలంగాణలో ఓ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించండి అని ప్రధాని నరేంద్ర మోదీకి అనేకసార్లు చెప్పాను. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.20-30 వేల కోట్లిచ్చి సాయపడండి అని వేడుకున్నా. అయినా సరే మోదీ డబ్బులు ఇవ్వలేదు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరిస్తున్న తీరును చూసి దేశమంతా మెచ్చుకున్నది. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్‌సింగ్ వరంగల్ జిల్లా నెక్కొండలో చెరువుగట్టుపై పుట్టినరోజు చేసుకుని మిషన్

మిగతా 2వ పేజీలో

నేడు, రేపు
కార్మిక సంఘాల సమ్మె
కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఏకపక్ష సంస్కరణలకు నిరసన

20 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని అంచనా

సమ్మెలోకి ఆర్టీసీ కార్మిక సంఘాలు

పనిచేయనున్న బ్యాంకులు?

11

కరంటే సర్కారుకు పవర్



సోమవారం హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ 12వ ఆవిర్భావ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీఈఈఏ అధ్యక్షుడు శివాజీ కూడా ఉన్నారు.

- సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు
- టీఆర్‌ఎస్ విజయంలో నిరంతర కరంటు సరఫరాది కీలకపాత్ర
- వ్యవసాయానికి 24గంటల విద్యుత్ దేశంలోనే ప్రథమం
- కాలానుగుణంగా మారుతూ సవాళ్లను ఎదుర్కొందాం
- విద్యుత్ ఉద్యోగులతో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయని టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ రెండోసారి అధికారంలోకి రావడంలో తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల పాత్ర ఎంత ఉన్నదో.. నిరంతర కరంటు సరఫరా పాత్రకూడా అంతే ఉన్నదని తెలిపారు. ఉమ్మడి పాలనలో పవర్ హాలిడేలు, విద్యుత్ కోతలతో అల్లాడిన పరిస్థితి ఉంటే.. స్వరాష్ట్రంలో అన్ని రంగాలకు నిరంతరాయంగా

మిగతా 2వ పేజీలో

• మొదటి విడుత పంచాయతీ
నామినేషన్లు మొదలు



సోమవారం సిద్దిపేట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్ద అభ్యర్థులు

మొదటిరోజు సర్పంచ్ స్థానాలకు **3,030**

- అత్యధికం నిజామాబాద్: **284**
  అత్యల్పం భద్రాద్రి కొత్తగూడెం: **23**
- వార్డులకు: **3,827**
- రేపటివరకు నామినేషన్ల స్వీకరణ
- అభ్యర్థులతో ఏకగ్రీవంపై గ్రామస్థుల చర్చలు
- ప్రధాన బాధ్యత తీసుకుంటున్న యువత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లపర్వం ప్రారంభమైంది. మొదటివిడుత పంచాయతీ ఎన్నికలకు సోమవారం నుంచి నిర్దేశించిన ప్రాంతాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరిస్తున్నారు. బుధవారం వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మొదటిరోజు 4, 479 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 3030 నామినేషన్లు దాఖలయ్యాయి. 39,822 వార్డుల్లో 3,827 నామినేషన్లు వచ్చాయి. మరోవైపు గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టాలంటే ఏకగ్రీవంగా నిలుద్దామంటూ పలు పంచాయతీల్లో చర్చలు జోరందుకున్నాయి. నామినేషన్లు దాఖలుచేసిన అభ్యర్థులతో గ్రామాభివృద్ధే ప్రధాన ఎజెండాగా గ్రామస్థులు చర్చలు సాగిస్తున్నారు. ప్రధానంగా కులాలవారీగా అందరినీ కలిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమైతే ఓ కులానికి ఇప్పుడు ప్రాధాన్యం ఇస్తే.. వచ్చే విడుత మరో వర్గానికి ప్రాధాన్యం ఇస్తామంటూ తీర్మానం చేసుకుంటున్నారు. ప్రధానంగా ఏకగ్రీవ బాధ్యతలను గ్రామాల్లో యువత భుజాలపై వేసుకున్నది. ఈ ఎన్నికలకు రాజకీయరంగు లేదని, అంతా కలిసి గ్రామాభివృద్ధి చేసుకుందామంటూ వారు గ్రామస్థుల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. పంచాయతీ

మిగతా 9వ పేజీలో

పౌరసత్వ సవరణ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ అమోదం

- నేడు లోక్‌సభకు ప్రతిపాదన
- బిల్లును వ్యతిరేకించిన ఏజీపీ
- బీజేపీ సర్కార్‌కు గుడ్‌బై
- నేడు బంద్‌కు పిలుపునిచ్చిన అసోం విద్యార్థి, సామాజిక, సాంస్కృతిక సంఘాలు

4

వికారాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన
ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లకు జాతీయ అవార్డు

3

17 నుంచి అసెంబ్లీ, 19 నుంచి కౌన్సిల్..

ఉభయసభల సమావేశాలు

నోటిఫికేషన్ జారీచేసిన గవర్నర్ నరసింహన్ ■ 17న కొత్త ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం

సభాపతి ఎన్నికకు షెడ్యూల్.. 18న ఎన్నిక ■ 19న ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఉభయ సభల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నెల 17 నుంచి శాసనసభ సమావేశాలు, 19 నుంచి శాసనమండలి సమావేశాలు జరుగుతాయని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఉత్తరాయనం ఏకాదశి రోజైన 17వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలను ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. 17న ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహమ్మద్‌ఖాన్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. సభను ప్రారంభించిన వెంటనే కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ కార్యక్రమం సుమారు రెండు గంటలపాటు కొనసాగుతుంది. అదేరోజున స్పీకర్ ఎన్నికకు షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. నామినేషన్ కార్యక్రమం కూడా ఉంటుంది. 18న కొత్త సభాపతి ఎన్నిక నిర్వహిస్తారు. సభానాయకులు, ముఖ్యమంత్రితోపాటు ప్రతిపక్ష నాయకుడు కలిసి స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా తీసుకెళ్లి కుర్చీపై ఆసీనులను చేస్తారు. తర్వాత కొత్త స్పీకర్ అధ్యక్షతన సమాశం ప్రారంభమవుతుంది. అదే రోజు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బీఏసీ)లో సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటారు. 19న శాసనసభ సమావేశ మందిరంలో అసెంబ్లీ, మండలి సమావేశం సంయుక్తంగా జరుగుతుంది. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు.



సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు దివంగత చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు వేసిన పెయింటింగ్‌ను అందజేస్తున్న ఆయన కుమారుడు కొండపల్లి వేణుగోపాల్‌రావు. చిత్రంలో ట్రీ ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.



సోమవారం ప్రగతిభవన్‌లో అడవుల పెంపకంపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ, సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, హరితహారం ఓఎస్డీ ప్రియాంకవర్గిస్, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు అనురాగ్‌శర్మ, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, అటవీశాఖ పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా కూడా ఉన్నారు.

స్మగ్లర్లపై పీడీ యాక్ట్

- అడవుల రక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలి
- అటవీ నేరగాళ్లు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు
- పర్యావరణ పరిరక్షణకు నాలుగంచెల వ్యూహం
- అడవుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు
- వచ్చే వర్షాకాలం నుంచి ఏడాదికి వందకోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం
- అటవీశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

'అడవులలో చెట్లు సహజంగా పెరుగుతాయి. వాటి వల్లనే స్వచ్ఛమైన వాతావరణం లభిస్తుంది. ఒకవైపు అడవుల విధ్వంసం జరుగుతుంటే.. తెలంగాణకు హరితహారం వంటి కార్యక్రమాల ద్వారా ఎన్నిచెట్లు పెంచినా ఫలితముండదు. అడవులను కాపాడటమంటే భూమి ధర్మాన్ని కాపాడినట్లే' అని సీఎం కే చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. రాష్ట్రంలో పర్యావరణ రక్షణకు నాలుగంచెల వ్యూహాన్ని అనుసరించాలని, క్షీణించిన అడవుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అడవులను ధ్వంసంచేసి, కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నవారిపై ఉక్కుపాదం మోపాలని, ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పదేపదే అటవీనేరాలకు పాల్పడే వారిపై ప్రివెంటివ్ అండ్ డిటెన్షన్ (పీడీ)యాక్ట్‌ను ప్రయోగించాలని ఆదేశించారు. ఈ వర్షాకాలం నుంచి 'తెలంగాణకు హరితహారం' కింద ఏడాదికి వందకోట్ల మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంపై సీఎం కేసీఆర్ సోమవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కోట్ల మొక్కల పెంపకంతోపాటు, అడవుల పునరుద్ధరణ, హైదరాబాద్ లోపల, వెలుపల అర్బన్‌పార్క్‌ల అభివృద్ధి, కలప అక్రమరవాణాను నిరోధించడం తదితర అంశాలపై అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు.

'కలప అక్రమ రవాణాతో అడవుల మనుగడకు ముప్పువాటిల్లుతున్నది. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో కలప స్మగ్లింగ్ జోరుగా సాగుతున్నది. కొందరు దీనినే వృత్తిగా మార్చుకున్నారు. ఇలాంటి ప్రాంతాలను గుర్తించి.. స్మగ్లర్లపై నిఘా వేయాలి. సున్నిత ప్రాంతాల్లో నిబద్ధత, అంకితభావం కలిగిన అధికారులను నియమించాలి. స్థానిక పోలీసులతో కలిసి అటవీశాఖ అధికారులు ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించుకోవాలి. స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతూనే వారికి సహకరించే అధికారులు, ఇతరులను గుర్తించి.. వారు ఎంతటివారైనా, ఏ పార్టీకి చెందినవారైనా ఉపేక్షించొద్దు' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. పలుకుబడి కలిగిన వ్యక్తులు ఇండ్లు నిర్మించుకునే సమయంలో ఎంత కావాలంటే అంత కలప అందిస్తామంటూ కొందరు అధికారులు చెబుతుంటారని.. ఇది వాంఛనీయం కాదని సీఎం అన్నారు. గతంలో నక్సలైట్ల సమస్య సాకుతో అధికారులు అడవుల లోపలికి వెళ్లేవారు కాదని, ఇప్పుడు ఆ సమస్య లేదని.. పోలీసులు, అటవీశాఖ అధికారులు ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించుకొని అడవులను కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటికే కొనసాగుతున్న సామిల్స్‌పై నిఘా పెట్టాలని, కొత్త మిల్లులకు అనుమతివ్వకుండా నియంత్రించాలని సూచించారు. చెట్ల నరికివేత వల్ల ఒట్టిపోయిన అడవులకు తిరిగి జీవం పోయడానికి అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. రూట్ స్టాక్‌ను ఉపయోగించుకుని అడవుల పునరుద్ధరణ చేపట్టాలన్నారు. వచ్చే వర్షాకాలం నుంచి హరితహారం కార్యక్రమం కింద ఏడాదికి వందకోట్ల మొక్కలు నాటాలని ఆదేశించారు.

కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్

హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా మార్చేందుకు అవసరమైన పచ్చదనాన్ని పెంపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 'హైదరాబాద్ పరిధిలో 1,50,000 ఎకరాల విస్తీర్ణంలో అటవీబ్లాక్‌లున్నాయి. కానీ అందులో చెట్లులేవు. దేశ రాజధాని ఢిల్లీలో తగినన్ని చెట్లు లేకపోవడం వల్లే ప్రస్తుతం అక్కడ విపరీతమైన వాయు కాలుష్యం సమస్య ఉన్నది. హైదరాబాద్‌లోనూ వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్నది. కాలుష్యం కూడా అదేస్థాయిలో పెరుగుతున్నది. ఈ క్రమంలో పర్యావరణాన్ని రక్షించుకోవడానికి చెట్లను పెంచడం ఒక్కటే మార్గం. అన్ని పార్క్‌లు, అటవీ బ్లాక్‌లలో పెద్దసంఖ్యలో మొక్కలు నాటాలి. వాటిలో వాకింగ్ పాత్‌లను ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలి. నగరం బాగ్‌నగర్‌గా మారాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. సమీక్షలో హోంమంత్రి మహమూద్ అలీ, సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు అనురాగ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ మహేందర్‌రెడ్డి, అటవీశాఖ పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

కరంటే సర్కారుకు పవర్

మొదటిపేజీ తరువాయి...

కరంటు సరఫరా చేస్తున్నామని కాలర్ ఎగరేసుకొని చెప్పుకొంటున్నామని గుర్తుచేశారు. దేశంలోనే మొదటిసారిగా వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టామన్నారు. సీఎం కేసీఆర్ దార్శనికత, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు కార్యదక్షత, విద్యుత్ ఉద్యోగుల సమర్థత.. ఈ మూడింటి కలబోతే రాష్ట్రంలో విద్యుత్ వెలుగులకు కారణమన్నారు. విద్యుత్ రంగం పెను సవాళ్లను ఎదుర్కొనబోతున్నదని, ఎప్పటికప్పుడు కాలానుగుణంగా పోటీపడుతూ ముందుకు సాగాలని సిబ్బందికి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ 12వ ఆవిర్భావ ఉత్సవాలు, 2019 ఇంజినీర్స్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరంటు సరఫరా విషయంలో అసాధ్యాన్ని సుసాధ్యంచేసిన దార్శనికుడు సీఎం కేసీఆర్ అని, అధికారంలోకి వచ్చిన ఐదున్నర నెలల్లోనే విద్యుత్ కోతలు లేని స్థితిని చేర్చిన కార్యశీలి సీఎండీ ప్రభాకర్‌రావు అని పేర్కొన్నారు. ఇందులో భాగమైన విద్యుత్ ఇంజినీర్లకు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

ధర్నాలు చేసిన రోజులు గుర్తున్నాయి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు వారంలో మూడు రోజులు పవర్ హాలిడే ఇచ్చేవారని, ఉత్పత్తి పడిపోయి పరిశ్రమలు నడుపుకోలేక, కార్మికులకు జీతభత్యాలు ఇవ్వలేక పారిశ్రామికవేత్తలు కూడా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ముందు ధర్నాచేసిన పరిస్థితి ఉండేదని కేటీఆర్ గుర్తుచేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లెక్కలేనన్నిసార్లు సబ్ స్టేషన్ల ముందు ధర్నాలుచేశామని చెప్పారు. అధికారులను, సిబ్బందిని గదుల్లో బంధించిన రోజులు తమకన్నా విద్యుత్ ఉద్యోగులకే ఎక్కువగా తెలుసన్నారు. చివరికి ఊర్లో ఎవరైనా చనిపోతే బాయికాడ, బోర్ల దగ్గర స్నానాలు చేసేందుకు అరగంట కరంటు ఇయ్యండి సారూ.. అని బతిమాలాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. కరంటు కోసం ఆందోళనలు జరిగేవని, సబ్ స్టేషన్లలో కుర్చీలు పలిగేవని ఇప్పుడు అవన్నీ లేవని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సమర్థత, సీఎండీ కార్యదక్షత, సీఎం కేసీఆర్ దార్శనికత ఫలితంగా తెలంగాణలో గృహాలు, పరిశ్రమలు.. ఇలా అన్ని రంగాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే స్థితికి ఎదిగామని పేర్కొన్నారు. దేశంలో సాగుకు 24 గంటల కరంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని కాలర్ ఎగరేసుకొని చెప్పే పరిస్థితిలో నిలిచామన్నారు.



సోమవారం మింట్‌కాంపౌండ్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, టీఈఈఏ అధ్యక్షుడు శివాజీ తదితరులు

దేశానికే దిక్సూచిగా సౌర విద్యుత్ ఉత్పత్తి

ఉమ్మడి రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి 34 మెగావాట్లు ఉంటే ఇప్పుడు 3,600 మెగావాట్లు ఉత్పత్తి అవుతున్నదని, దేశంలో రెండోస్థానంలో ఉన్నామని కేటీఆర్ వెల్లడించారు. డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి విధానంతో తెలంగాణ దేశానికే దిక్సూచిలా నిలిచిందన్నారు. వినూత్నమైన విధానాల ద్వారా ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలు తగ్గి, ఉత్పాదకత పెరిగిందని, ఫలితంగా రాష్ట్ర వనరులను, డబ్బును ఆదా చేయగలిగామన్నారు. రాబోయే కాలంలో పెనుసవాళ్లు ఎదురుకానున్నాయని, మనం సాధించిన విజయాలు గుర్తుచేసుకుంటూనే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని ముందుకు పోవాల్సిన అవసరం ఉన్నదని దిశానిర్దేశం చేశారు. తలసరి విద్యుత్ వినియోగంలో 13% వృద్ధిరేటుతో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామని గుర్తుచేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో విద్యుత్ పాత్ర ఎంతో కీలకమని చెప్పారు.

ప్రైవేటీకరణ ఆలోచనే లేదు

మిగులు విద్యుత్‌తోపాటు వినియోగదారులను సంతృప్తి పరిచినప్పుడే విద్యుత్ సంస్థలకు వ్యాపారం జరిగి పురోభివృద్ధి సాధ్యమవుతుందని కేటీఆర్ సూచించారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా కరంటు సరఫరా అందించినప్పుడే ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరుగుతుందని, మనం విజయం సాధించినట్టని చెప్పారు. గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించారని, తెలంగాణ ప్రభుత్వానికి అటువంటి ఆలోచనే లేదని స్పష్టం చేశారు. మన విద్యుత్ సంస్థలు చాలా సమర్థంగా నడుస్తున్నపుడు ప్రైవేటీకరణవైపు ఎందుకు ఆలోచించాలని సీఎం కేసీఆర్ చెప్తుంటారన్నారు. ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థలు ప్రైవేట్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలతో పోటీపడి నాణ్యమైన సేవలు అందిస్తే అద్భుతమైన ఫలితాలు సాధిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యూహాలను మార్చుకోవాలని సూచించారు. త్వరలో భారతదేశంలో స్మార్ట్ మీటర్ల విధానం అమల్లోకి వస్తుందని దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. త్వరలోనే సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యి కోటి ఎకరాల మాగాణి సాకారం అవుతుందని, అందుకనుగుణంగా విద్యుత్‌ను అందించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఇందుకోసం అన్ని విభాగాలు శ్రమించాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకోసం పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల మీద సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉన్నదన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కేసీఆర్‌వల్లే సాధ్యమైంది: సీఎండీ ప్రభాకర్‌రావు

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. తన మీద నమ్మకంతో సీఎం కేసీఆర్ అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నెరవేర్చానని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఒకప్పుడు ఆంధ్రలో కరంటు బల్బు కూడా లేనప్పుడు, ట్యాంక్‌బండ్‌పై ఇక్కడే కరంటు ఉత్పత్తి అయ్యేదని చెప్పారు. అలాంటిది మన బతుకులను చీకట్లలో ముంచారని, స్వరాష్ట్రం వచ్చాక ఆంధ్ర పాలకులకు బుద్ధి చెప్పామన్నారు. టీఈఈఏ అధ్యక్షుడు శివాజీ మాట్లాడుతూ తెలంగాణ వచ్చినంక సాధించిన మొదటి విజయం కరంటేనని చెప్పారు. అంతకుముందు కేటీఆర్ ప్రొఫెసర్ జయశంకర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.52 గంటలకు



సూర్యాస్తమయం: 5.53 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం విదియ ఉదయం 11.56 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: శ్రవణం రాత్రి 11.41 వరకు, అమృతఘడియలు: ఉదయం 11.57 నుంచి మధ్యాహ్నం 1.33 వరకు, రాహుకాలం మధ్యాహ్నం 3.08 నుంచి సాయంత్రం 4.31 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.04 నుంచి 9.48 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.13 నుంచి 2.57 వరకు, వర్జ్యం: తె. 1.07 నుంచి 2.43 వరకు.

లోకం పోకడ



ఆయన నిర్మిస్తానన్న స్మార్ట్ సిటీ స్మార్ట్ ఫోన్‌లో చూపిస్తాడట!

ఈ టర్మ్‌లోనే ప్రాజెక్టుల పూర్తి

మొదటిపేజీ తరువాయి...

వినియోగించుకునే వ్యూహం అమలుచేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణపై విధివిధానాలు రూపొందించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం వస్తేనే ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి, సాగునీళ్లు అందిస్తారనే విశ్వాసంతో ప్రజలు తమకు మరోసారి అవకాశం ఇచ్చారని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఈ టర్మ్‌లోనే అన్ని ప్రాజెక్టులు నూటికి నూరుశాతం పూర్తిచేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. దీనికి అధికారులు, వర్క్ ఏజెన్సీలు సహకరించాలని కోరారు. ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో మొదట చెరువులు నింపేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా ప్రాజెక్టు పనులు పూర్తికావడానికి ఆలస్యమైతే చెరువులు నింపటానికి కావాల్సిన ఏర్పాట్లు మాత్రం యుద్ధ ప్రాతిపదికన జరుగాలని సీఎం అధికారులకు స్పష్టంచేశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఇటీవలే అన్ని ప్రాజెక్టుల పనులను స్వయంగా సందర్శించి వచ్చిన రిటైర్డు ఇంజినీర్లు, వివిధ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిపై రిటైర్డు ఇంజినీర్ల బృందం సీఎంకు వివరించింది. ఈ సందర్భంగా ఎక్కడ ఏ లోపం ఉందో చర్చించిన సీఎం.. లోపాన్ని సవరించటానికి అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేశారు. పనుల్లో జాప్యం జరుగుతున్న చోట కారణాలు తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే వర్క్ ఏజెన్సీలను మార్చాలని ఆదేశించారు.



సోమవారం ప్రగతిభవన్‌లో నీటిపారుదలశాఖపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, , ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, నీటి పారుదలశాఖ ఈఎన్సీలు మురళీధర్‌రావు, అనిల్ కుమార్, హరిరాం, ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సలహాదారు పెంటారెడ్డి తదితరులు ఉన్నారు.

రాజకీయ సుస్థిరత ఉంది.. నిధులకు కొరతలేదు

'తెలంగాణ కోసం ప్రజలు దశాబ్దాల తరబడి పోరాడారు. ప్రాణాలు కూడా అర్పించారు. తెలంగాణ సాధించుకున్నారు. తెలంగాణ వస్తే సాగునీరు వస్తుందని ఆశపడ్డారు. మొదటి టర్మ్‌లో సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించాం. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరించాం. అన్నీ పురోగతిలో ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై టీఆర్ఎస్ ప్రభుత్వానికున్న విశ్వసనీయతను ప్రజలు గుర్తించారు. ఈ ప్రభుత్వమే ప్రాజెక్టులు పూర్తిచేస్తుందని నమ్మారు. 75% ఇదే కారణంతో టీఆర్ఎస్‌కు మళ్లీ ఓటేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి, సాగునీరు అందించాం. వలసలు వాపస్ వచ్చాయి. ఈ పరిస్థితి చూసే అక్కడి ప్రజలు 13 సీట్లలో టీఆర్ఎస్‌ను గెలిపించారు. ఈ టర్మ్‌లో ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి, తెలంగాణలో కోటి ఎకరాల్లో నీరు పారించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఐదేండ్ల సమయం, రాజకీయ సుస్థిరత ఉన్నాయి. నిధుల కొరతలేదు. రైతులకు సాగునీరు అందివ్వడమే ధ్యేయంగా పనిచేయడానికి పునరంకితమవుదాం' అని సీఎం పిలుపునిచ్చారు.

ఎండకాలంనాటికి పనులన్నీ పూర్తికావాలి

'గోదావరిలో తెలంగాణకు 950 టీఎంసీల నీటివాటా ఉంది. సమైక్య రాష్ట్రంలోనే ఇది ఖరారైంది. దీని ప్రకారమే మనం గోదావరిపై కాళేశ్వరం, తుపాకులగూడెం, సీతారామ ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. కాళేశ్వరం ద్వారా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్, నల్లగొండ జిల్లాలకు సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీరు అందించాలి. ఇదే లక్ష్యంతో ఆ ప్రాజెక్టు నిర్మిస్తున్నాం. ఈ ఎండకాలంలోనే పనులన్నీ పూర్తిచేసి, వర్షాకాలంలో ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు చెరువుల ద్వారా పొలాలకు చేరాలి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తికావాలి. ఎల్లంపల్లి, మిడ్‌మానేరు దాకా నీళ్లు రావాలి. మేడిగడ్డ నుంచి రోజూ రెండు టీఎంసీల చొప్పున నీరు తీసుకోవాలి. మూడు బరాజ్‌లద్వారా 36 టీఎంసీలు, ఎల్లంపల్లిలో 20 టీఎంసీల నీళ్లు నదిలోనే అందుబాటులో ఉంటాయి. వచ్చిన నీటిని వచ్చినట్టు పంపుచేసి చెరువులకు మళ్లించాలి. ఎల్లంపల్లి దాకా వచ్చిన నీటిలో ఒక టీఎంసీని మిడ్‌మానేరు ద్వారా శ్రీరాంసాగర్ కాల్వలకు మళ్లించాలి. మరో టీఎంసీని మల్లన్నసాగర్‌వైపు మళ్లించాలి. మల్లన్నసాగర్ ద్వారా ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో నిర్మించే బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్‌కు తరలించాలి. మల్లన్నసాగర్ ద్వారానే హైదరాబాద్ మంచినీళ్ల కోసం నిర్మిస్తున్న 10 టీఎంసీల రిజర్వాయర్‌కు నీళ్లు పంపాలి. హల్దీవాగు ద్వారా నిజాంసాగర్, ఘనపురం ఆయకట్టుకు సాగునీరు అందించాలి. గండిపేట, హిమాయత్‌సాగర్ చెరువులు నింపాలి. వాటిద్వారా క్రమం తప్పకుండా నీటిని విడుదలచేస్తూ మూసీనది మురికిని వదిలించాలి. మూసీ రివర్ ఫ్రంట్‌ను అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్‌లా అభివృద్ధి చేస్తాం. దానికీ గోదావరి నీళ్లు అందాలి. చివరికి మూసీ నది ద్వారా పాత నల్లగొండ జిల్లా పొలాలకు నీరు చేరాలి' అని సీఎం కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించి, అమలుచేయాలన్నారు.

ఉమ్మడి వరంగల్‌కు దేవాదుల ద్వారా నీరు

'గోదావరి నదిపైనే నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత తుపాకులగూడెం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఆ నీటిని ఉపయోగించుకోవడానికి బరాజ్ కడుతున్నాం. ఏడాదికి 75 టీఎంసీలకు పైగా నీరు తీసుకునే అవకాశం ఉన్నది. ఇప్పుడున్న డిజైన్లు, కాల్వలు, ఇతర నిర్మాణాలు పెద్దగా ఉపయోగపడేలా లేవు. మొత్తం పాత వరంగల్ జిల్లాకు దేవాదుల ద్వారా నీరు అందించాలి. పాఖాల, రామప్ప, గణపురం, లక్నవరం చెరువులను నింపాలి. తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ నిర్మించి, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాలకు నీరివ్వాలి. దీనికోసం మొత్తం ప్రాజెక్టును రివ్యూ చేసి, కొత్త ప్రతిపాదనలు తయారుచేయాలి' అని అధికారులను సీఎం ఆదేశించారు.

సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం సస్యశ్యామలం కావాలి

'దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలి. మే నెలలో కూడా దుమ్ముగూడెం వద్ద ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటితో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీరివ్వాలి. బయ్యారం వరకు నీటిని తీసుకురావాలి. ఎస్సారెస్పీ ఆయకట్టుకూ నీరు అందాలి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన నిర్మాణాలు చేపట్టాలి' అని సీఎం చెప్పారు.

శరవేగంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం

'ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి (ప్రస్తుత వికారాబాద్) జిల్లాలకు సాగునీరు అందివ్వటానికి ఉద్దేశించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వేగం పెరుగాలి. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయడంద్వారా మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల్లో ప్రభుత్వంపై ఎంతో నమ్మకం వచ్చింది. పాలమూరు ప్రాజెక్టును పూర్తిచేసి, మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయాలి. శ్రీశైలం సోర్సు నుంచి 70 టీఎంసీల వరకు తీసుకునే అవకాశమున్నది. మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు ఎంతో మేలుచేసే ఈ ప్రాజెక్టును ఆ జిల్లాకు చెందిన రాజకీయ నాయకులే కోర్టుల్లో కేసులువేసి, అడ్డుకున్నారు. దానివల్లే కొంత జాప్యం జరిగింది. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నంత వేగంగా ఇక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం సాగాలి. అవసరమైన నిధులను ఈ బడ్జెట్లోనే కేటాయిస్తాం' అని ముఖ్యమంత్రి చెప్పారు.

ముందుగా చెరువులు నింపాలి

ప్రాజెక్టులద్వారా వచ్చే నీటితో ముందుగా చెరువులు నింపాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను ఉపయోగించుకుని చెరువులను నింపే చర్యలు చేపట్టాలన్నారు. సాగునీటితోపాటు, తాగునీటికి ఎంత నీరు అవసరమవుతుందో, భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని అంచనాలు తయారుచేసి, నీటి కేటాయింపు జరుపాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, నీటిపారుదలశాఖ ఈఎన్సీలు మురళీధర్‌రావు, అనిల్‌కుమార్, హరిరాం, ఓఎస్డీ శ్రీధర్‌రావుదేశ్‌పాండే, సలహాదారు పెంటారెడ్డి, సీఈలు వెంకటేశ్వర్లు, జీ శ్రీనివాసరెడ్డి, బీ శంకర్, కే బంగారయ్య, వీ సుధాకర్, వీ నర్సింహ, ఆర్ మధుసూదన్‌రావు, వీ రమేశ్, టీ ఖగేందర్, రిటైర్డు ఇంజినీర్లు శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకటరామారావు, వేణుగోపాలరావు, రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటేశం, సత్తిరెడ్డి, రమణానాయక్, ఎస్ ముత్యంరెడ్డి, జగదీశ్వర్, జియావుద్దీన్, ఇంద్రసేనారెడ్డి, కెప్టెన్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిసార్లు కోరినా మోదీ డబ్బులివ్వలేదు

మొదటిపేజీ తరువాయి...

కాకతీయను మెచ్చుకున్నారు. దేశమంతా ప్రశంసించింది. నీతి ఆయోగ్ కూడా మిషన్ కాకతీయ గొప్ప పథకమని చెప్పింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు రూ.24 వేల కోట్లివ్వాలని కేంద్రప్రభుత్వానికి నీతిఆయోగ్ సిఫారసుచేసింది. అయినా.. మోదీ ప్రభుత్వం 24 రూపాయలు కూడా ఇవ్వలేదు. ఈసారి కేంద్రంలో మనది క్రియాశీల పాత్ర ఉంటుంది. కావాల్సిన నిధులు రాబట్టుకునే అవకాశం ఉంటుంది. దీంతోపాటు మన రాష్ట్ర ఆదాయాభివృద్ధి రేటు కూడా బాగుంది. మొదటి నాలుగేండ్లలో 17.17% వృద్ధిరేటుంటే, ఈ సంవత్సరం ఇప్పటివరకు 29.17% వృద్ధిరేటు నమోదైంది. నిధులకు కొరతలేదు. ప్రాజెక్టులు కట్టుకోవడమే మన లక్ష్యం' అని సీఎం చెప్పారు.




సోమవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మేనకాగాంధీ నుంచి జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న వికారాబాద్ జిల్లా సిద్దులూర్ అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఖమ్మం జిల్లా ఏన్కూర్ అంగన్‌వాడీ టీచర్ బండ్ల సుశీల

అంగన్‌వాడీ టీచర్లకు జాతీయ అవార్డు

ఢిల్లీలో కేంద్రమంత్రి మేనకాగాంధీ చేతుల మీదుగా ప్రదానం

వికారాబాద్, నమస్తే తెలంగాణ/ఏన్కూరు: ఉత్తమ సేవలు అందించినందుకు గాను వికారాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి మేనకాగాంధీ చేతులమీదుగా 2017-18 సంవత్సరానికి గాను ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లుగా వికారాబాద్ జిల్లా సిద్దులూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-2 సెంటర్ టీచర్ బండ్ల సుశీల జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. గ్రామాల్లో మహిళాశిశు సంక్షేమానికి విశేష కృషి చేసినందుకుగాను వీరికి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి, సుశీల మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి జాతీయ స్థాయి అవార్డు అందజేయడం ఎంతో సంతోషంగా, సంతృప్తికరంగా ఉన్నదన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజల సంక్షేమానికి శక్తి వంతు కృషి చేస్తామన్నారు. ఈ అవార్డుతో తమపై మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా సేవ చేస్తామన్నారు.

పోలియో బాధిత బాలుడికి కేటీఆర్ అండ

- చికిత్సకయ్యే వ్యయం భరిస్తానని హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలియోతో బాధపడుతున్న ఓ బాలుడికి టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. చికిత్సకు అయ్యే వ్యయాన్ని భరిస్తానని హామీ ఇచ్చి మరోసారి మానవత్వం చాటుకున్నారు. రామగుండం నియోజకవర్గానికి చెందిన బాలుడు శివసాయికి పోలియో సోకి రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. సోమవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను కలిసిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆ బాలుడి పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన కేటీఆర్.. ఆ బాలుడికి ధైర్యం చెప్పారు. తక్షణమే ఆతడిని దవాఖానలో చేర్పించి చికిత్స అందించాలని పార్టీ జీహెచ్‌ఎంసీ నాయకుడు కట్టెల శ్రీనివాస్‌యాదవ్‌కు సూచించారు. శివసాయి చికిత్సకయ్యే ఖర్చును తానే భరిస్తానని, అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



రామగుండం నియోజకవర్గానికి చెందిన పోలియో బాధితుడు శివసాయితో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్




సోమవారం తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న రామగుండం ఎమ్మెల్యే చందర్, చిత్రంలో ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ తదితరులు, భారీగా తరలివచ్చిన చందర్ అభిమానులు, టీఆర్‌ఎస్ కార్యకర్తలు

మనమే నిర్ణయాత్మక శక్తి

తెలంగాణలో టీఆర్‌ఎస్‌ను 16 సీట్లలో గెలిపించండి

- ఢిల్లీ గద్దె ఎవరెక్కాలో శాసిద్దాం
- దేశానికి ఆదర్శంగా రైతుబంధు, రైతుబీమా
- టీఆర్‌ఎస్ సాధించింది సాధారణ విజయం కాదు
- సోమారపు సేవలను వినియోగించుకుంటాం
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు
- టీఆర్‌ఎస్‌లో చేరిన రామగుండం ఎమ్మెల్యే
- నాగార్జునసాగర్ కాంగ్రెస్ నాయకులు కూడా..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించి 16 సీట్లలో గెలిపిస్తే ఢిల్లీ గద్దెనెక్కేది ఎవరో నిర్ణయించేది తెలంగాణ ప్రజలేనని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. యాచించేస్థాయి నుంచి శాసించేస్థాయికి ఎదుగాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే శిరోధార్యమన్న కేటీఆర్.. రాజకీయాల్లో కుర్చీలు శాశ్వతం కాదని, ఏ కుర్చీపైనా ఎవరి పేరూ శిలాక్షరాలతో చెక్కి ఉండదని చెప్పారు. టీఆర్‌ఎస్‌ది పేదల ప్రభుత్వమన్నారు. ఎన్నికల్లో గెలిచినందుకు గర్వపడవద్దని పార్టీ శ్రేణులకు సూచించారు. వచ్చే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణభవన్‌లో వేర్వేరు కార్యక్రమాల్లో రామగుండం స్వతంత్ర ఎమ్మెల్యే కొరుకంటి చందర్, దాదాపు మూడువేల మంది ఆయన అనుచరులు, నాగార్జునసాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు భగవాన్ నాయక్, లక్ష్మారెడ్డి, అబ్బాస్‌లు కేటీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో కాంగ్రెస్ కనుచూపుమేరలో కోలుకునే పరిస్థితిలో లేదని, బీజేపీ, ప్రధాని మోదీల గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతున్నదని చెప్పా రు. ఈ రెండు పార్టీలకు కలిపినా 250 సీట్లు దాటే పరిస్థితి లేదన్నారు. సీఎం కేసీఆర్ మానస పుత్రికలైన రైతుబంధు, రైతుబీమా పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, వీటిని జార్ఖండ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ అమలుచేస్తున్నాయని చెప్పారు. త్వరలోనే కేంద్రం కూడా ఈ పథకాల పేర్లు మార్చి అమలుకు సిద్ధమవుతున్నదన్నారు.

ఇది సాధారణ విజయం కాదు

అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ సాధించింది సాధారణ విజయం కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఓటుతోనే కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు బుద్ధిచెప్పారన్నారు. బీజేపీకి 103 స్థానాల్లో డిపాజిట్లు దక్కలేదని, కాంగ్రెస్ 19 సీట్లతో సరిపెట్టుకుందని ఎద్దేవాచేశారు. నల్లగొండ జిల్లాలో ట్రక్కు అడ్డమెచ్చిందని, లేకుంటే మరో రెండు సీట్లు గెలిచేవాళ్లమని చెప్పారు. ఒక్క ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చావుతప్పి కన్ను లొట్టబోయినట్టు ట్రక్కు గుర్తు, టక్కుటమార విద్యలతో గెలిచారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, ఐదుగురు వివిధ రాష్ట్రాల సీఎంలు, 11 మంది కేంద్రమంత్రులు, కాంగ్రెస్‌నుంచి రాహుల్‌గాంధీ సహా రాజకీయ దురంధరులు ప్రచారదాడి చేసినా.. ప్రజలు కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని భావించారని కేటీఆర్ చెప్పారు. నాగార్జునసాగర్‌లో టీఆర్‌ఎస్‌ను గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఫ్లోరోసిస్‌ను పట్టించుకోని కాంగ్రెస్ నేతలు

కృష్ణానది ఒడ్డున నల్లగొండ జిల్లా ఉన్నా.. రెండు లక్షల మంది ఫ్లోరోసిస్ మహమ్మారి బారిన పడి జీవచ్ఛవాల్లా మారారని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఫ్లోరోసిస్ సమస్యను పరిష్కరించాల్సిన గత సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తన సొంత జిల్లా చిత్తూరుకు ఏడు వేల కోట్లు తరలించుకపోవడానికి క్యాబినెట్‌లో పెడితే నాటి జిల్లా మంత్రులు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ ఫ్లోరోసిస్ గురించి మాట్లాడకుండా నవ్వుతూ సంతకాలు చేశారని విమర్శించారు. పాలన వికేంద్రీకరణలో భాగంగా కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, పంచాయతీలు ఏర్పాటుచేశామని, ఈ క్రమంలోనే నందికొండ, హాలియాలను మున్సిపాలిటీలుగా మార్చామన్నారు.

ఏకగ్రీవాలకు కృషిచేయండి

పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలకు కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగురాలన్నారు. నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థులుగా ప్రచారం చేసుకున్న వారందరూ కేసీఆర్ సునామీలో ఓటమిపాలయ్యారని అన్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య మాట్లాడుతూ మరో 30 ఏండ్లు టీఆర్‌ఎస్ అధికారంలో ఉండేవిధంగా అందరం కృషి చేద్దామని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, జీవన్‌రెడ్డి, కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, రామగుండం మాజీ మేయర్ లక్ష్మీనారాయణ, టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్, రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, టీఎస్‌టీఎస్సీ చైర్మన్ రాకేశ్, జెడ్పీటీసీ సంధ్యారాణి, టెస్కాబ్ మాజీ చైర్మన్ విజేయందర్‌రెడ్డి, కోటిరెడ్డి, రాంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎదిగిన కొద్దీ ఒదగాలి

సోమారపు, చందర్ గురుశిష్యుల్లా పనిచేయాలి

రాజకీయాల్లో గెలుపుతో గర్వపడవద్దని, ఓటమితో కుంగిపోవద్దని పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. ఎదిగిన కొద్దీ ఒదగాలని చెప్పారు. రామగుండం నియోజకవర్గంలో సోమారపు సత్యనారాయణ, ఎమ్మెల్యే కొరుకంటి చందర్ గురుశిష్యులుగా ముందుకు సాగాలన్నారు. ఎన్నికల్లో ఘటనలను మర్చిపోయి అంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సోమారపు సేవలను పార్టీ వినియోగించుకుంటుందని చెప్పారు. రామగుండం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని కేటీఆర్ ప్రకటించారు. మెడికల్ కాలేజీ, మైనింగ్ కాలేజీ మంజూరు చేయిస్తామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గం నుంచి లక్ష ఓట్లు టీఆర్‌ఎస్ అభ్యర్థికి వచ్చేలా పనిచేయాలన్నారు. పంచాయతీ ఎన్నికల నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయఢంకా మ్రోగించాలని, అన్నింటా గులాబీ జెండా ఎగురాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ శిష్యుడిగా చందర్ పనిచేశారని, ఎన్నికల సమయంలో కొన్ని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వేరుగా పోటీచేసినా.. తిరిగి సొంతింటికి వచ్చారని చెప్తూ.. టీఆర్‌ఎస్‌లో పుట్టిన మొక్క వృక్షమైనందుకు సంతోషంగా ఉందని చందర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. యువకుడైన చందర్‌కు మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యే కొరుకంటి చందర్ మాట్లాడుతూ గతంలో ఉద్యమ నాయకుడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేశామని, రాబోయే రోజుల్లో గ్రామ గ్రామాన గులాబీజెండా ఎగురవేస్తామని చెప్పారు. తిరిగి మాతృసంస్థలోకి వచ్చానంటూ భావోద్వేగానికి గురయ్యారు. మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రమంతటా కేసీఆర్ ప్రభంజనం ఉన్నా.. స్థానికంగా ఉన్న పరిస్థితుల్లో చందర్ గెలిచారని, అయినా.. కాంగ్రెస్ అభ్యర్థికాకుండా ఉద్యమకారుడు గెలువడం సంతోషంగా ఉందని చెప్పారు. తన సహాయ సహకారాలు చందర్‌కు ఉంటాయన్నారు.

90కి పెరిగిన బలం: అసెంబ్లీలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 90కి పెరిగింది. శాసనసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ 88 స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన రాములునాయక్ ఇప్పటికే టీఆర్‌ఎస్‌లో చేరారు. సోమవారం పెద్దపల్లి జిల్లా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చేరికతో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 90కి చేరుకుంది.




సోమవారం తెలంగాణభవన్‌లో నాగార్జునసాగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు భగవాన్ నాయక్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, నల్లగొండ ఎంపీ గుత్తాసుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్.. ఉత్సాహంగా నృత్యం చేస్తున్న నేతలు, కార్యకర్తలు

తెలంగాణకు పొరుగురాష్ట్రాల నుంచి

పోటెత్తిన ఉల్లి

- మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీల్లో దక్కని కనీస మద్దతు ధర
- ఆయారాష్ట్రాల్లో క్వింటాల్ రూ.700 మాత్రమే
- ఆదుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం
- మలక్‌పేట గంజ్‌కు తరలివస్తున్న ఉల్లి
- రోజుకు సగటున 20 వేల బస్తాలు
- క్వింటాల్‌కు రూ.1,400 నుంచి రూ.1,500 ధర




సోమవారం మలక్‌పేట గంజ్‌కు పొరుగు రాష్ట్రాల నుంచి పోటెత్తిన ఉల్లి బస్తాలు

హైదరాబాద్ సిటీబ్యూరో/మలక్‌పేట, నమస్తే తెలంగాణ: పొరుగు రాష్ట్రాల్లో నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఉల్లి రైతులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంటున్నది. కిలో ఉల్లిగడ్డ రూ.50 పైసల నుంచి రూ.2 మించక రైతులు అరిగోస పడుతుంటే.. తెలంగాణ ప్రభుత్వం వారిని అక్కున చేర్చుకుంటున్నది. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న సీఎం కేసీఆర్ పొరుగు రాష్ట్రాలనుంచి వచ్చే రైతులకు న్యాయం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట గంజ్‌కు పొరుగు రాష్ట్రాలనుంచి ఉల్లిగడ్డ పోటెత్తుతున్నది. ఇతర రాష్ట్రాల్లో ఉల్లికి కనీస మద్దతు ధర లేకపోవడంతో 'రేటు లేనికాడ.. మనమెందుకు బ్రదర్ చలో తెలంగాణ' అంటూ అక్కడి రైతులు హైదరాబాద్ బాట పడుతున్నారు. ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీలోని కర్నూల్, మన రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి మలక్‌పేట గంజ్‌కు నిత్యం 20 వేల నుంచి 25 వేల బస్తాల ఉల్లిగడ్డ వస్తున్నది.

మహారాష్ట్రలో ఉల్లి రైతు బేజారు..

మహారాష్ట్ర నేలలు ఉల్లి పంటకు అనుకూలం కావడంతో అక్కడి రైతులు ఎక్కువగా సాగుచేస్తారు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉల్లి ధరలు దారుణంగా పడిపోయాయి. సగటున కిలో ఉల్లిగడ్డ రూ.50 పైసలనుంచి రూ.2 మించడం లేదు. కనీసం పెట్టుబడులు కూడా రాక అక్కడి రైతులు ఆత్మహత్యచేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. మార్కెట్‌లో గిట్టుబాటుధర రాక ఉల్లిని రోడ్లపైనే పారబోసిపోయిన దృశ్యాలు అక్కడ నిత్యకృత్యం. తెలంగాణ మాదిరిగా రైతు సంక్షేమంకోసం ప్రత్యామ్నాయ మార్గాలను అక్కడి ప్రభుత్వాలు చూపకపోవడంతో అన్నదాతలు దుర్భర పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నారు.

రోజుకు సగటున 10 వేల క్వింటాళ్లు..

మలక్‌పేట గంజ్‌కు ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలనుంచి ఉల్లి ఎక్కువగా దిగుమతి అవుతున్నది. తెలంగాణలో ఉల్లికి డిమాండ్ ఉన్న నేపథ్యంలో అక్కడి రైతులు ఇటువైపుగా వస్తున్నారు. ఈ నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ గంజ్‌లో పొరుగు రాష్ట్రాల రైతులకు తగిన న్యాయం జరిగేలా చూస్తున్నది. సోమవారం గంజ్‌కు మహారాష్ట్రనుంచి 67 లారీలు, కర్ణాటకనుంచి పది, మహబూబ్‌నగర్ నుంచి ఆరు, కర్నూల్ నుంచి ఒకటి చొప్పున లారీలు వచ్చాయి. ఒక్కో లారీలో 250 బస్తాలనుంచి 300 వరకు ఉంటాయి. ఒక్కో బస్తా బరువు 50 కిలోలు ఉంటే.. ఒక్కో లారీలో 125 నుంచి 150 క్వింటాళ్ల ఉల్లిగడ్డ వస్తున్నది.

గంజ్‌లో క్వింటాల్‌కు రూ.1,400 ధర

మలక్‌పేట గంజ్‌లో ఉల్లి క్వింటాల్‌కు రూ.1,400 నుంచి రూ.1,500 ధర పలుకుతుండగా, మహారాష్ట్ర, కర్ణాటక, కర్నూల్‌లో గరిష్ఠంగా రూ.300 నుంచి రూ.400 వరకు మాత్రమే పలుకుతున్నది. ఆయా రాష్ట్రాల్లోని ధరలతో పోల్చితే మలక్‌పేట మార్కెట్‌లో మూడు రెట్లు అధిక ధర పొందుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో అరెకరం, ఎకరంలో ఉల్లి సాగుచేసే రైతులు ఐదారుగురు కలిసి తమ పంటను ఒకే లారీలో ఇక్కడికి తీసుకొస్తున్నారు. ఒక్కో లారీలో 150 క్వింటాళ్ల ఉల్లిగడ్డను తరలిస్తూ రవాణా చార్జీలను తగ్గించుకుంటున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక గంజ్ మార్కెట్‌కు దాదాపు ఒకే దూరంలో ఉంటాయి. అక్కడినుంచి గంజ్‌కు ఉల్లిని తీసుకొచ్చేందుకు సగటున ఒక్కో లారీకి రూ.25 వేలు కిరాయి అవుతుంది. అయితే గంజ్‌లో 150 క్వింటాళ్ల ఉల్లిని అమ్మితే దాదాపు రూ.2.10 లక్షలు వస్తాయి. అదే మహారాష్ట్ర, కర్ణాటక, కర్నూలులో 150 క్వింటాళ్ల ఉల్లిని గరిష్ఠ ధర రూ.400 చొప్పున అమ్మినా.. రూ.60 వేలకు మించి రావడంలేదు. ఈ లెక్కన గంజ్‌కు ఉల్లిగడ్డను తరలించేందుకు అవుతున్న రవాణా చార్జీలు రైతులకు ఏమాత్రం భారం కావడంలేదు. గంజ్‌కు వచ్చిన సరుకును వెంటనే కొనుగోలు చేస్తుండటంతో రైతులకు ఎక్కడా ఇబ్బందులు ఎదురుకావడంలేదు. కాగా, రెండు నెలల కిందట ఎండిన ఉల్లి (నాణ్యమైన గడ్డ) క్వింటాల్‌కు రూ.2 వేలు రికార్డు ధర పలికింది.

సకాలంలో వర్షాలు లేక తగ్గిన నాణ్యత..

మహారాష్ట్ర, కర్ణాటక, కర్నూల్‌తోపాటు తెలంగాణలో ఉల్లిని పండించే మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు సకాలంలో కురువకపోవడంతో సమృద్ధిగా నీరు అందక.. గడ్డ ఆశించిన స్థాయిలో ఊరలేదు. దీంతో మార్కెట్‌లో ధర పడిపోయింది. చిన్నసైజు గడ్డ తొందరగా కుళ్లిపోయే ప్రమాదం ఉన్నది. దీంతో హోటల్స్ మినహా నిత్యం ఉపయోగించే వినియోగదారులు నాణ్యమైన ఉల్లిని కొనేందుకే ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ మార్కెట్‌కు తరలివస్తున్న నాణ్యమైన ఉల్లిగడ్డలకు మంచి ధర వస్తున్నది. మధ్యస్థంగా ఉన్న ఉల్లిగడ్డలకు సైతం క్వింటాల్‌కు రూ.700 వరకు పలుకుతుండటం విశేషం.

200 క్వింటాళ్లు తీసుకొచ్చా..



200 క్వింటాళ్ల ఉల్లి తీసుకొచ్చా. మా రాష్ట్రంలో క్వింటాల్‌కు రూ.300 మించి రావట్లేదు. ఇక్కడ మాత్రం రూ.వెయ్యి ధర వచ్చింది. ఉల్లిగడ్డను అమ్మేందుకు సీజన్‌లో ఏటా నాలుగైదుసార్లు ఇక్కడికి వస్తా. మా ఊరు నుంచి మలక్‌పేటకు 300 కిలోమీటర్లు. సరుకు వెంటనే అమ్ముడుపోతున్నది. ఇక్కడి తీసుకొచ్చినందుకు రూ.1.40 లక్షలు అధికంగా ఆదాయం వచ్చింది. రవాణా చార్జీలు రూ.20 వేలు తీసేసినా రూ.లక్ష మిగిలినట్టే.

- రాజేందర్, సోలాపూర్, మహారాష్ట్ర

ఐదారుగురం కలిసి వచ్చినం..



గంజ్‌కు 40 బస్తాల ఉల్లి తెచ్చిన. మాదగ్గర కిలో రూ.2కు కూడా కొంటలేరు. మహారాష్ట్రలో మార్కెట్‌కు ఉల్లి తీస్కపోతే.. బేరం అయ్యేసరికి మూడునాలుగు రోజులు పట్టేది. ఈలోపు గడ్డ చెడిపోయి రోడ్డు మీదనే పారబోసినం. తెలంగాణ ప్రభుత్వం మార్కెటింగ్ విధానం తెలిసి ఇక్కడికొచ్చినం. ఐదారుగురం కలిసి లారీలో ఉల్లిగడ్డను తీసుకొచ్చినం. మామూలుగా ఎండిన ఉల్లిగడ్డ కూడా రూ.700 మించి వచ్చింది.

- ప్రకాశ్ షిండే, మహారాష్ట్ర

మెరిట్‌లిస్ట్‌లో పదేపదే మార్పులు నిజం కాదు

- స్పష్టంచేసిన టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 మెరిట్‌లిస్ట్‌లో పదేపదే మార్పులు జరిగినట్టు వస్తున్న ఆరోపణలు అబద్ధమని టీఎస్‌పీఎస్సీ స్పష్టంచేసింది. గత ఏడాది డిసెంబర్ 31న మెరిట్ జాబితా విడుదలచేశామని, అయితే కొందరు అభ్యర్థుల అనుభవం మార్కులు / సర్వీస్ వెయిటేజీ మార్కుల నేపథ్యంలో సవరణ జాబితాను 3వ తేదీన విడుదల చేశామే తప్ప పదేపదే కాదని కమిషన్ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. వెయిటేజీ విషయంలో ప్రభుత్వపరమైన పత్రాలనే పరిగణనలోకి తీసుకొన్నామని, ప్రతిపాదనలు పొందుపర్చాలని భావించే అభ్యర్థులు ఈ నెల 11లోగా టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన స్థలం మార్పు

మండల ప్లానింగ్ అధికారులు, స్టాటిస్టికల్ అధికారులు, సహాయ స్టాటిస్టికల్ అధికారి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన స్థలంలో మార్పు చేసినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఎల్లుండి నుంచి మూడురోజులపాటు ఈ పరిశీలన ప్రక్రియ సాంకేతిక విద్యాభవన్‌లో నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని కోరింది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు ఎన్‌ఐసీ గ్రీన్ సిగ్నల్

- టీఏఎఫ్‌ఆర్‌సీ తరపున ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏతోపాటు మెడికల్ వంటి వృత్తి విద్యా కాలేజీలలో ట్యూషన్ ఫీజుల సమీక్ష ప్రక్రియకు ఆన్‌లైన్ సేవలు అందించేందుకు నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్‌ఐసీ) సోమవారం గ్రీన్ సిగ్నల్ తెలిపింది. దీంతో ట్యూషన్ ఫీజుల సమీక్ష కోసం దరఖాస్తుల స్వీకరణకు ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేషన్ కమిటీ (టీఏఎఫ్‌ఆర్‌సీ) తరుపున ఒకటి రెండు రోజులలో నోటిఫికేషన్ ఇవ్వడానికి రాష్ట్రఉన్నతవిద్యామండలి చర్యలు ప్రారంభించింది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభతేదీ, గడువు తేదీతోపాటు మొత్తం ప్రక్రియ పూర్తికావటానికి ఎంత సమయం పడుతుంది అనే వివరాలు నోటిఫికేషన్‌లో తెలియజేస్తామని రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు వృత్తివిద్యాకాలేజీల్లో 2019-20 నుంచి మూడేండ్లపాటు ఉండబోయే ట్యూషన్ ఫీజులపై సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో కనీసం 20 శాతం వరకైనా ఫీజుల పెంపు ఉంటుందని యాజమాన్యాలు అంచనా వేస్తున్నాయి.

ఫిబ్రవరి రెండోవారంలో సహకార ఎన్నికలు!

- నిర్వహణకు 12 వేల పోలింగ్ బూత్‌లు
- 40 వేల మంది సిబ్బంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలకు ఫిబ్రవరి రెండోవారంలో నోటిఫికేషన్ విడుదల కానున్నది. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్రంలో 12 వేల పోలింగ్ కేంద్రాలు, 40 వేల సిబ్బందితో అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు జరుగుతాయి. పంచాయతీ ఎన్నికలు ముగియగానే ఫిబ్రవరి రెండోవారంలో ఒకేరోజున 906 ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సహకారశాఖ నిర్ణయించింది. ఆ తర్వాత 9 డీసీసీబీలు, 9 జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలతోపాటు టెస్కాబ్‌లకు ఎన్నిక పూర్తిచేయనున్నారు. ఈ ప్రక్రియంతా ఫిబ్రవరి 25 తేదీకల్లా ముగించాలని నిర్ణయించినట్టు సహకారశాఖ అధికారవర్గాలు తెలిపాయి. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ముమ్మరం చేసింది. ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణపై సభ్యుల ఓటర్ల జాబితాను కూడా పూర్తిచేశారు. రెండు జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాల నుంచి ఓటర్ల జాబితా ఎన్నికల అథారిటీకి అందినట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు వచ్చిన ఓటర్ల జాబితా ప్రకారం 18 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, మిగతా రెండు జిల్లాల జాబితాలు వస్తే ఓటర్ల సంఖ్య 20 లక్షలకు చేరుకునే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. సహకార సంఘంలో ఏడాది, అంతకంటే ఎక్కువకాలం సభ్యులుగా కొనసాగినవారినే ఓటరుగా గుర్తించనున్నారు. పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల నుంచి ఓటర్ల జాబితా రాష్ట్ర సహకారశాఖ రిజిస్ట్రార్ ఆమోదానికి పంపాల్సి ఉంటుంది.

బీజేపీకి అప్నాదళ్ హెచ్చరిక

- వైఖరి మార్చుకోకుంటే దేనికైనా తెగిస్తామంటూ హూంకరింపు


ఆశిష్ పటేల్

లక్నో: కేంద్రంలోని అధికార ఎన్డీఏ కూటమి నుంచి ఒక్కో భాగస్వామ్య పక్షాన్ని దూరం చేసుకుంటున్న బీజేపీకి మరో షాక్ ఎదురయింది. ఎన్డీఏలోని చిన్న పార్టీల పట్ల బీజేపీ అనుసరిస్తున్న తీరు మారాలని, లేదంటే దేనికైనా తెగిస్తామని అప్నాదళ్ (సోనేలాల్) సోమవారం హెచ్చరించింది. 'బీజేపీ విషయంలో మన పార్టీ ఎటువంటి నిర్ణయాన్నయినా తీసుకోగలదు' అని అప్నాదళ్ (ఎస్) అధ్యక్షుడు ఆశిష్ పటేల్ లక్నోలో తమ పార్టీ సభ్యులకు నర్మగర్భంగా తెలిపారు. '2014 నుంచి బీజేపీతో పొత్తును కొనసాగిస్తున్న మన పార్టీ పూర్తి నిజాయితీతో పొత్తు ధర్మాన్ని పాటిస్తున్నది. కానీ ఉత్తరప్రదేశ్‌లో మన పార్టీకి లభించాల్సినంత గౌరవం లభించడం లేదు. ఈ విషయంలో బీజేపీ తన ధోరణిని మార్చుకోవాలి. లేదంటే మా నాయకురాలు అనుప్రియా పటేల్ (కేంద్ర మంత్రి) ఎంత దూరమైనా వెళ్లగలరు. ఏ నిర్ణయమైనా తీసుకోగలరు. ఆ నిర్ణయం ఎటువంటిదైనా మా పార్టీ మొత్తం మద్దతు తెలుపుతుంది' అని ఆశిష్ పటేల్ ఓ సమావేశంలో స్పష్టం చేశారు. తాను ఎవరినీ బెదిరించడంలేదని, కేవలం విజ్ఞప్తులు మాత్ర మే చేస్తున్నానని చెప్పారు. కేంద్రంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రిగా ఉన్న తమ నేత అనుప్రియా పటేల్‌ను ఆ శాఖ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలకు ఆహ్వానించడంలేదని, అంతేకాకుండా రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లను, అధికారులను నియమించే ప్రక్రియలో యోగి ఆదిత్యనాథ్ సర్కారు అప్నాదళ్ (ఎస్)ను పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ మళ్లీ ప్రధానిగా ఎన్నికవడం బీజేపీలోని ఓ వర్గం వారికి ఇష్టం లేదని, ఆ వర్గమే తమను వేధిస్తున్నదని ఆశిష్ పటేల్ ధ్వజమెత్తారు.

తమిళనాడు మంత్రి బాలకృష్ణారెడ్డికి మూడేండ్ల జైలు

- బస్సుపై రాళ్లు రువ్విన కేసులో ప్రత్యేక కోర్టు తీర్పు
- మంత్రి పదవికి రాజీనామా



చెన్నై: తమిళనాడులో అధికార అన్నాడీఎంకే పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. 1998 నాటి కేసులో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి బాలకృష్ణారెడ్డికి మూడేండ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. అయితే తీర్పుపై మద్రాస్ హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు మంత్రికి కోర్టు అనుమతిచ్చింది. కోర్టు తీర్పు నేపథ్యంలో బాలకృష్ణారెడ్డి మంత్రి పదవితోపాటు శాసన సభ్యత్వాన్ని కోల్పోనున్నారు. 1998లో హోసూర్‌లో అక్రమ మద్యానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి బస్సులపై రాళ్లు రువ్వారనే ఆరోపణలపై ఆయన మీద కేసు నమోదైంది. ఆ సమయంలో ఆయన బీజేపీలో ఉన్నారు. కాగా, కోర్టు తీర్పు నేపథ్యంలో బాలకృష్ణారెడ్డి సోమవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

బాలికలతో అర్ధనగ్న నృత్యాలు చేయించి లైంగిక దాడులకు పాల్పడ్డారు

- ముజఫర్‌పూర్ షెల్టర్‌హోం కేసులో సీబీఐ చార్జిషీట్ దాఖలు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌పూర్ షెల్టర్‌హోంలో బాలికలపై లైంగిక దాడుల కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) 73 పేజీల అభియోగ పత్రాన్ని (చార్జిషీట్‌ను) ప్రత్యేక పోక్సో కోర్టులో దాఖలుచేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన బ్రజేష్ ఠాకూర్ (ఆ షెల్టర్‌హోం నిర్వాహకుడు) అతిథులు ఆ షెల్టర్‌హోంలోని బాలికలతో బలవంతంగా అర్ధనగ్న నృత్యాలు చేయించడంతోపాటు వారిపై అత్యాచారాలకు పాల్పడినట్టు సీబీఐ వెల్లడించింది. బ్రజేష్ ఠాకూర్ అతిథుల కోర్కెలను తోసిపుచ్చి నృత్యాలు చేసేందుకు నిరాకరించిన బాలికలకు ఆ రాత్రి కేవలం రొట్టెను, ఉప్పును ఆహారంగా ఇచ్చారని, అర్ధనగ్నంగా నృత్యాలు చేసిన బాలికలకు మాత్రం మంచి ఆహారాన్ని అందజేశారని సీబీఐ పేర్కొన్నది. శిశు రక్షణాధికారులు సైతం ఆ షెల్టర్‌హోంలోని బాలికలపై అత్యాచారాలకు పాల్పడ్డారని, ఆ బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు రప్పించిన డాక్టర్ కూడా వారికి అబార్షన్ మాత్రలు ఇచ్చి ఈ లైంగిక దోపిడీని దాచిపెట్టాడని సీబీఐ వివరించింది.

సీబీఐ - సీబీఐ కేసులో నేడు తీర్పు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తనను బాధ్యతల నుంచి తప్పించి, బలవంతంగా సెలవుపై పంపడాన్ని సవాల్ చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్ అలోక్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. సీబీఐ డైరెక్టర్‌అలోక్ కుమార్, ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్తానా ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకోవడంతో ఉన్నతాధికారుల మధ్య వివాదం బయటపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీవీసీ సిఫార్సు మేరకు అలోక్‌కుమార్‌ను కేంద్రం సెలవుపై పంపింది. జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న కే నాగేశ్వరరావును సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించింది. దీన్ని సవాల్ చేస్తూ అలోక్ కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో అలోక్ వర్మ, కేంద్ర ప్రభుత్వం, సీవీసీ వాదనలు విన్న సుప్రీంకోర్టు డిసెంబర్ 6న తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం తీర్పు వెలువరించనుంది.

పౌరసత్వ సవరణ బిల్లుకు సై

- నేడు లోక్‌సభకు ప్రతిపాదన
- బిల్లును వ్యతిరేకిస్తున్న ఏజీపీ ; బీజేపీ సర్కార్‌కు గుడ్‌బై
- నేడు బంద్‌కు పిలుపునిచ్చిన అసోం విద్యార్థి, సామాజిక, సాంస్కృతిక సంఘాలు


బిల్లును వ్యతిరేకిస్తూ గువాహటిలో ఆందోళన చేస్తున్న మాజీ సీఎం తరుణ్‌గొగోయ్

న్యూఢిల్లీ, జనవరి 7: పౌరసత్వ (సవరణ) బిల్లు-2016 ఈశాన్య భారతంలో మరో వివాదాన్ని రేపుతున్నది. ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తుండగా, పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, సామాజిక, సాంస్కృతి సంఘాలు బిల్లును వ్యతిరేకిస్తూ బంద్‌కు పిలుపునిచ్చాయి. బిల్లును వ్యతిరేకిస్తూ అసోంలోని బీజేపీ సర్కార్ నుంచి అసోం గణపరిషద్ వైదొలిగింది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించే పౌరసత్వ సవరణ బిల్లు ముసాయిదాకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన సోమవారం సమావేశమైన మంత్రివర్గం ఈ బిల్లుకు ఆమోదం తెలుపగా, దానిని మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లుపై 2016లో ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఇచ్చిన నివేదికను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మరోవైపు ఈ బిల్లును అసోంతోపాటు ఈశాన్య రాష్ట్రాలలోని అత్యధికమంది ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. 1985 నాటి అసోం ఒప్పందాన్ని ఈ బిల్లు రద్దు చేస్తుందని వారు పేర్కొంటున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ ఈ బిల్లు తెస్తామని వాగ్దానం చేసింది. అయితే ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఈశాన్య భారతానికి చెందిన ఎనిమిది ప్రధాన విద్యార్థి సంఘాలు, అసోంకు చెందిన 40 సామాజిక-సాంస్కృతిక సంఘాలు మంగళవారం 11 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బిల్లును మేఘాలయ, మిజోరం ప్రభుత్వాలు వ్యతిరేకిస్తూ ఇప్పటికే తీర్మానం ఆమోదించాయి.

అసోంలో బీజేపీ సర్కార్ నుంచి వైదొలిగిన ఏజీపీ

పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ అసోం గణపరిషత్ (ఏజీపీ) పార్టీ అసోంలోని బీజేపీ ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టవద్దని ఏజీపీ అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి అతుల్ బోరా కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలుసుకొని విజ్ఞప్తి చేశారు. కానీ వీరి విజ్ఞప్తిని బేఖాతరు చేసిన రాజ్‌నాథ్ బిల్లును లోక్‌సభలో ఆమోదం పొందేలా చూస్తామని స్పష్టం చేశారు. దీంతో ఇక తాము బీజేపీతో కలిసి సాగడంలో అర్థం లేదని బోరా పేర్కొన్నారు. అసోం ఒప్పందంతో పాటు ఇతర అంశాలపై అవగాహన ఆధారంగానే తాము బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని మాజీ సీఎం, ఏజీపీ నాయకుడు ప్రఫుల్ల కుమార్ మహంత పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పౌరసత్వ సవరణ బిల్లు తమ అవగాహనను ఉల్లంఘిస్తున్నదని చెప్పారు. అసోం అసెంబ్లీలో 126 మంది సభ్యులుండగా, బీజేపీ కూటమికి (బీజేపీ-60, ఏజీపీ-14, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్-12) 86 మంది ఎమ్మెల్యేలున్నారు.

హిందువులు మైనారిటీలో పడిపోతారు: హిమంత

పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదం పొందకపోతే మరో ఐదేండ్లలో అసోంలోని హిందువులు మైనారిటీలుగా మారిపోతారని ఆ రాష్ట్ర మంత్రి హిమాంత బిశ్వశర్మ వ్యాఖ్యానించారు. అప్పుడు అసోం మరో కశ్మీర్‌గా మారాలని కోరుకుంటున్న వారి పన్నాగాలు సఫలమవుతాయని పేర్కొన్నారు. అసోం చరిత్ర గురించి తెలియనివారే తనను వ్యతిరేకిస్తున్నారన్నారు.

లోక్‌సభకు జేపీసీ నివేదిక

వివాదాస్పద పౌరసత్వ (సవరణ) బిల్లు 2016పై జేపీసీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై మంగళవారం చర్చ జరిగే అవకాశముంది. బిల్లులోని పలు నిబంధనలను జేపీసీలోని ప్రతిపక్ష పార్టీల సభ్యులు వ్యతిరేకించినప్పటికీ కమిటీలోని మెజారిటీ సభ్యుల ఆమోదంతో నివేదికను రూపొందించారు. మూడు ముస్లిం దేశాల నుంచి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని జేపీసీ తన నివేదికలో పేర్కొంది.

అనిల్ అంబానీ కోసం.. హాల్ బలిపశువు

- కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ధ్వజం
- రాఫెల్ ఒప్పందంపై 15 నిమిషాల చర్చకు సిద్ధమా అని ప్రధానికి సవాల్


ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, జనవరి 7: రాఫెల్ ఒప్పందం విషయంలో మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. అనిల్ అంబానీకి లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్)ను బలహీనపరుస్తున్నారని మండిపడ్డారు. హెచ్‌ఏఎల్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో రూ.1000 కోట్లు రుణం తీసుకుందని వార్తా కథనాలు వెలువడడంతో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో సోమవారం పార్లమెంట్ వెలుపల రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. ఒక్క విమానాన్ని కూడా పంపిణీ చేయని దసాల్ట్ ఏవియేషన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్లు అందజేసిందని, మరి హెచ్‌ఏఎల్‌కు రూ.15,700 కోట్ల బకాయిలను ఎందుకు ఇవ్వడం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాఫెల్ ఒప్పందంపై కేవలం 15 నిమిషాలు చర్చించేందుకు సిద్ధమా అని ప్రధానికి రాహుల్ సవాల్ విసిరారు. హెచ్‌ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టులు ఇచ్చామని రక్షణమంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంటులోఅబద్ధాలు చెప్పారని విమర్శించారు.

కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తున్నది: రక్షణమంత్రి

హెచ్‌ఏఎల్ కాంట్రాక్టులపై కాంగ్రెస్ పార్టీ తప్పుదోవపట్టిస్తున్నదని రక్షణ మంత్రి విమర్శించారు. సోమవారం ఈ విషయమై ఆమె లోక్‌సభలో మాట్లాడారు. హెచ్‌ఏఎల్‌కు ఇప్పటికే రూ.26వేల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చామని, మరో రూ.73వేలకోట్ల ప్రాజెక్టులపై కసరత్తు జరుగుతున్నదని తెలిపారు.

లోక్‌సభ, రాజ్యసభలో గందరగోళం

రాఫెల్‌పై కాంగ్రెస్, సీబీఐ వ్యవహారంపై ఎస్పీ, కావేరీ వివాదంపై అన్నాడీఎంకే సభ్యుల ఆందోళనల నేపథ్యంలో లోక్‌సభ మంగళవారానికి వాయిదాపడింది. ముగ్గురు అన్నాడీఎంకే సభ్యులను, ఓ టీడీపీ సభ్యుడిని స్పీకర్ రెండు రోజులపాటు సస్పెండ్ చేశారు. సభ్యుల ఆందోళనతో రాజ్యసభ కూడా మంగళవారానికి వాయిదా పడింది.

రద్దయిన సెక్షన్ కింద అరెస్టులు చేస్తే అధికారులను జైలుకు పంపుతాం

న్యూఢిల్లీ: ఇతరులను విమర్శిస్తూ వెబ్‌సైట్లలో పోస్టు చేసేవారిని అరెస్టు చేసేందుకు వీలుకల్పించే ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) చట్టంలోని 66-ఏ సెక్షన్‌ను రద్దుచేసినప్పటికీ ఆ చట్టం కింద కేసులను నమోదు చేస్తున్నారని పిటిషన్ దాఖలవడంతో సుప్రీంకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై సమాధానం ఇవ్వాలని సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. ఆ సెక్షన్‌ను రద్దుచేస్తూ 2015 మార్చి 24న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులను అరెస్టుచేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించింది.

మేఘాలయలో మరో విషాదం

- బొగ్గు గనిలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు గుర్తింపు

షిల్లాంగ్: మేఘాలయలో అక్రమ మైనింగ్ మరో ఇద్దరు చిన్నారులను బలిగొంది. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని జలియా అనే ఓ మారుమూరు గ్రామంలో అక్రమ బొగ్గు గని వద్ద ఇద్దరు మైనర్ బాలుర మృతదేహాలను పోలీసులు గుర్తించారు. అక్రమంగా బొగ్గు తవ్వుతుండగా గని కూలి చిన్నారులు మృతిచెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు.

నామినేటెడ్ సభ్యుడిగా మళ్లీ స్టీఫెన్‌సన్


సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్

మొదటిపేజీ తరువాయి...

పూర్తయింది. రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా సాధారణ సభ్యులందరితోపాటే నామినేటెడ్ ఎమ్మెల్యే కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నామినేటెడ్ ఎమ్మెల్యే నియామకంలో జాప్యం జరుగుతుండటంతో ఇతర సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేయడం లేదని, దీంతో విలువైన పదవీ కాలాన్ని కోల్పోతున్నారని క్యాబినెట్ భావించింది. ఈ సమస్యను అధిగమించేందుకు తొలి సమావేశంలోనే నామినేటెడ్ సభ్యుడిని ఎంపికచేసింది. స్టీఫెన్‌సన్ ఈ నెల 17న మిగతా సభ్యులతోపాటే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అసెంబ్లీలో గంగా జమునా తెహజీబ్ సంస్కృతి

రాష్ట్రంలో గంగా జమునా తెహజీబ్ సంస్కృతిని కొనసాగించడానికి తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ వ్యవహారాల్లో అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేస్తున్నది. ఇందులోభాగంగా అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను నియమించింది. క్రైస్తవ మతానికి చెందిన ఆంగ్లో ఇండియన్ స్టీఫెన్‌సన్‌ను నామినేటెడ్ ఎమ్మెల్యేగా నియమించింది.

శాసనసభ్యులకు రాజ్యాంగ ప్రతులు

ఇటీవల జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికలను అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించినందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని మంత్రివర్గ సమావేశం అభినందించింది. ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి రజత్‌కుమార్‌ను, రాష్ట్ర అధికార యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించింది. అదేవిధంగా అసెంబ్లీకి ఎన్నికైన శాసనసభ్యులకు భారత రాజ్యాంగం ప్రతులను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో, అసెంబ్లీ నిబంధనలకు సంబంధించిన వివిధ పుస్తకాలను, బుక్‌లెట్లను, ఇతర సమాచారాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రతులను అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులు సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు చూపించారు.


ఢిల్లీలో టీఆర్‌ఎస్ కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ రాసిన లేఖను పార్లమెంట్‌లో ప్రధాని మోదీకి అందజేస్తున్న లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి, ఎంపీలు వినోద్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, నగేశ్, సీతారాంనాయక్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి, ప్రధాని మోదీతో కరచాలనం చేస్తున్న ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్

పార్టీ ఆఫీస్‌కు స్థలం కేటాయించండి

- సీఎం కేసీఆర్ రాసిన లేఖను ప్రధానికి అందజేసిన టీఆర్‌ఎస్ ఎంపీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ కార్యాలయం నిర్మాణానికి ఢిల్లీలో స్థలం కేటాయించాలని కోరుతూ పార్టీ అధ్యక్షుడు, సీఎం కే చంద్రశేఖర్‌రావు రాసిన లేఖను పార్టీ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీకి అందించారు. సోమవారం ఢిల్లీలో ప్రధానిని కలిసి రాజేంద్రప్రసాద్ రోడ్డులో స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరారు. అనంతరం లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. జాతీయస్థాయిలో టీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు ఢిల్లీలో కార్యాలయాన్ని నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని తెలిపారు. స్థలం కేటాయింపు కోరుతూ ప్రధానికి లేఖ ఇచ్చామన్నారు. తెలంగాణలో అమలుచేసిన పథకాలను దేశవ్యాప్తంగా అమలుచేయడానికి సీఎం కేసీఆర్ వ్యూహరచన చేస్తున్నారని చెప్పారు. 70 ఏండ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ, ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. కేసీఆర్ లక్ష్యం ప్రధాని పదవి కాదని, దేశంలోని ప్రజలకు మేలు చేయడమని స్పష్టం చేశారు. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో తెలంగాణ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయం అందించారని గుర్తుచేశారు. ఫెడరల్ ఫ్రంట్ స్థాపనకు ఢిల్లీలోని టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ఎంతో కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. కేంద్రం స్థలాన్ని అధికారికంగా కేటాయించగానే శంకుస్థాపన చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, నగేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, సీతారాంనాయక్, జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

గెలిచారు.. స్వీట్లేవి?- టీఆర్‌ఎస్ ఎంపీలతో మోదీ

మీ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది.. మరి స్వీట్లేవి అంటూ ప్రధాని మోదీ టీఆర్‌ఎస్ ఎంపీలతో సరదాగా వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలంటూ మోదీని కలిసిన సందర్భంలో ఈ సరదా సంభాషణ జరిగింది. అనంతరం జితేందర్‌రెడ్డి రాజ్యసభసభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను ప్రధానికి పరిచయం చేశారు.

సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపండి: మాజీ ప్రధాని మన్మోహన్

తెలంగాణ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించిన మీ సీఎం కేసీఆర్‌కు తన తరఫున శుభాకాంక్షలు తెలుపాలని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ టీఆర్‌ఎస్ ఎంపీ బండ ప్రకాశ్‌తో అన్నారు. సోమవారం రాజ్యసభ రిజిస్టర్‌లో సంతకం చేసే సందర్భంలో వారిద్దరూ కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ బండ ప్రకాశ్ తనను మన్మోహన్‌సింగ్‌కు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంలో సీఎంకే శుభాకాంక్షలు తెలుపాలని చెప్పినట్టు సమాచారం.

కంటివెలుగు @ 1.23 కోట్లు

- 7,230 గ్రామాల్లో వైద్యశిబిరాలు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది చేపట్టిన శిబిరాల్లో ఇప్పటివరకు 86 రోజుల్లో 1,23,13,490 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 7,230 గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలోని 596 వార్డుల్లో వైద్యశిబిరాల నిర్వహణ పూర్తయ్యింది. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి సోమవారం వరకు నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,23,13,490 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 1,06,658 మందికి కంటి పరీక్షలు చేశారు.



కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందిన వారి సంఖ్య

క్యాటగిరీ	సోమవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	1,06,658	1,23,13,490
రీడింగ్ అద్దాలు పొందినవారు	8,589	19,43,521
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	6,636	14,96,662
కంటి సమస్యలపై రెఫరల్	5,588	7,83,914

కంటి సమస్య పరిష్కారమైంది



నేను కంటి సమస్యతో బాధపడుతున్నా. ప్రైవేటు దవాఖానల్లో వైద్యం చేయించేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడ్డా. ప్రభుత్వమే ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిసి ఇక్కడికి వచ్చా. కండ్లద్దాలు ఇచ్చారు. కంటి సమస్యకు పరిష్కారం దొరికింది.

-వినోద, గొల్లగూడెం, భద్రాద్రి కొత్తగూడెం

ఉమ్మడి జాబితా తొలగించండి

- కేంద్రం విదేశీ వ్యవహారాలు, రక్షణకే పరిమితం కావాలి
- జీరో అవర్‌లో టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి


లోక్‌సభలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, బీ వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి జాబితా వల్ల కేంద్రం, రాష్ట్రాల మధ్య సంబంధాలు దెబ్బ తింటున్నాయని, రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌లో ఉన్న లోపాలను సవరించాలని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఆయన సోమవారం లోక్‌సభ జీరోఅవర్‌లో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ కలలుగనే సహకార సమాఖ్య స్ఫూర్తికి ఏడో షెడ్యూల్ విఘాతం కలిగిస్తున్నదని గుర్తుచేశారు. ఈ విషయాన్ని కూలంకషంగా అర్థం చేసుకున్నాకే తమ నాయకుడు సీఎం కేసీఆర్ ఉమ్మడి జాబితాను తొలగించాలని, ఈ జాబితాలోని పలు అంశాలను రాష్ట్ర జాబితాలోకి బదలాయించాలని కోరుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించేందుకే జాతీయ పార్టీలు ఉమ్మడి జాబితాను మరింత బలోపేతం చేస్తున్నాయని విమర్శించారు. దీంతో రాష్ట్రాన్ని సమర్థంగా పరిపాలించాలన్న తమ లక్ష్యం నీరుగారుతున్నదని వివరించారు. పక్కా ప్రణాళికలతో ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలుచేయడంలో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని కోరారు. కేంద్రం కేవలం విదేశీ వ్యవహారాలు, రక్షణ వంటి అంశాలకే పరిమితం కావాలని సూచించారు. కేంద్రం తక్షణం స్పందించి ఈ విషయంపై అందరితో చర్చించాలని కోరారు.

కుష్ఠు వస్తే విడాకులు వద్దు: ఎంపీ బీ వినోద్‌కుమార్

కుష్ఠు రోగం పేరిట విడాకులిచ్చే విధానానికి స్వస్తి పలకాలని టీఆర్‌ఎస్ ఎంపీ బీ వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన సోమవారం లోకసభలో మాట్లాడుతూ.. కుష్ఠు రోగానికి ప్రస్తుతం చికిత్స లభిస్తున్నదని, కాబట్టి ఈ కారణంతో విడాకులిచ్చే విధానానికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఇందుకోసం లోక్‌సభ మొత్తం ఏకగ్రీవంగా పర్సనల్ లాస్ (సవరణ) బిల్లును ఆమోదించాలని కోరారు. ఇలాంటి తీర్మానం చేయాలని 2008లో భారత మానవ హక్కుల కమిషన్ సూచించిందని, ఐక్యరాజ్యసమితి 2010లో ఇలాంటి తీర్మానమే చేసిందని గుర్తుచేశారు. నిరుపేద వర్గాల్లో సాధారణంగా వచ్చే జబ్బుగా మారిన కుష్ఠురోగాన్ని సంపూర్ణంగా తరిమివేయడానికి కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షలు

- ఐదురోజులపాటు కొనసాగనున్న పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ప్రవేశాల కోసం మంగళవారం నుంచి జేఈఈ మెయిన్-1 ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఐదురోజులపాటు ఉదయం, మధ్యాహ్నం విడుతల్లో జరుగుతాయి. దేశవ్యాప్తంగా 9.65 లక్షల మంది విద్యార్థులు హాజరవుతుండగా.. మన రాష్ట్రం నుంచి 80 వేల పైచిలుకు పరీక్షలు రాయనున్నారు. హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్ కేంద్రాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. మరింత సమాచారం కోసం విద్యార్థులు jeemain.nic.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

వివిధ పోటీ పరీక్షల ఫలితాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్త్రీ, శిశు సంక్షేమశాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-2 ఫలితాలను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. సివిల్ అసిస్టెంట్ సర్జన్ నియామకాలకు ఎంపికై, వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న అభ్యర్థుల మెరిట్‌జాబితాను కూడా టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది.

హిందీ ఎస్‌ఏ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉద్యోగాల కోసం అర్హత సాధించిన అభ్యర్థుల మూడో విడత ధ్రువపత్రాల పరిశీలనకు 164 మందిని టీఎస్‌పీఎస్సీ ఎంపిక చేసింది. అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు పేర్కొన్నది. ఈ నెల 11న ఉదయం 10 గంటలకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థులు హాజరుకావాలని కోరింది.

రాజ్యాంగ సవరణకు ఎదురయ్యే సవాళ్లు!



కులం ఆధారిత రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని సుప్రీంకోర్టు పరిమితి విధించింది. 1992 నాటి ఇందిరా సాహ్నీ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం మధ్య కేసులో కోర్టు తీర్పునిస్తూ, రిజర్వేషన్ సదుపాయం అనేది సమానత్వ భావనను ధ్వంసం చేసేదిగా ఉండరాదు అని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం వెనుకబడిన తరగతులు (బీసీ)లకు 27 శాతం, షెడ్యూల్డు కులాలు, తరగతులకు 16 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఓబీసీలు తదితరులకు కలిపి మొత్తంగా 49 శాతం వరకు రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. ఇప్పుడు అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే అది 59 శాతానికి పెరుగుతుంది. ఇది సాకారం కావడానికి ప్రభుత్వం అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది. అవి..

- రాజ్యాంగం ప్రకారం లక్ష రూపాయలకన్నా తక్కువ వార్షిక ఆదాయం ఉన్న పౌరులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వంటి సామాజిక వర్గాలకు చెందని వారు ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈబీసీ)లుగా పరిగణింపబడతారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల గురించి రాజ్యాంగంలో ఎటువంటి నిర్వచనం లేదు. ప్రభుత్వం ప్రతిపాదించబోయే బిల్లులో ఇది కీలకం కానుంది.
- ఈ రిజర్వేషన్లను అమలు చేయాలంటే.. ప్రభుత్వం తన రాజ్యాంగ సవరణ ప్రతిపాదనకు సర్వే గణాంకాలను జోడించాల్సి ఉంటుంది.
- బిల్లు ఆమోదం పొందినా.. అది న్యాయ పరిశీలనకు వెళ్లకుండా ఉండాలంటే.. బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో చేర్చాల్సి ఉంటుంది.
- న్యాయ పరిశీలనకు అందకుండా రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం 'ఆర్థిక వెనుకబాటుతనాన్ని' ప్రాతిపదికగా ప్రవేశపెట్టాలని యోచిస్తున్నది. ఈ రిజర్వేషన్లను అగ్రవర్ణాలకు ఉద్దేశించిన నేపథ్యంలో ప్రభుత్వం ఆర్థిక వెనుకబాటుతనాన్ని ఎలా వివరిస్తుందో స్పష్టతలేదు.
- ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని ఉల్లంఘిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రాజ్యాంగం పేదరికం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం లేదు. రిజర్వేషన్ల కల్పనకు ఆర్థిక కారణాలను పరిగణించడం లేదు. అంతమాత్రాన ప్రభుత్వం పేదలకు సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు, రుణాలు, ఆర్థిక సాయం రూపంలో సహాయపడుతున్నా రాజ్యాంగం అడ్డుపడటం లేదు.
- ఒకవేళ రాజ్యాంగాన్ని సవరించినా.. అది రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి వ్యతిరేకంగా ఉంటుంది గనుక దానిని కోర్టులో సవాలు చేసే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.
- ఇప్పటికే కులాల ఆధారిత రిజర్వేషన్లు 49శాతం ఉన్నాయి. దీని జోలికి వెళ్లకుండా 10శాతం రిజర్వేషన్ కల్పించాలంటే మిగిలిన 51 శాతం నుంచి కేటాయించాలి. అప్పుడు బహిరంగ పోటీ 41 శాతానికి తగ్గిపోతుంది. ఇది సాధ్యమేనా?
- ఇందిరా సాహ్నీ కేసులో.. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించేందుకు పీవీ నరసింహారావు ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆర్టికల్ 16(1) లేదా 16(4) ప్రకారం ఇటువంటి రిజర్వేషన్లు సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఆదాయం లేదా ఆస్తి కలిగి ఉన్నారన్న నెపంతో ఓ పౌరుడి నియామకాన్ని తిరస్కరించడం అందరికీ సమాన అవకాశాలు అన్న భావనను ధ్వంసం చేసేదిగా భావించాల్సి ఉంటుందని పేర్కొంది.

రిజర్వేషన్లు లేకుండానే ఆమె రాణించారు

- మాజీ ప్రధాని ఇందిరపై గడ్కరీ ప్రశంసలు
- మహిళా రిజర్వేషన్లకు తాను వ్యతిరేకం కాదని స్పష్టీకరణ




నాగ్‌పూర్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసల వర్షం కురిపించారు. రిజర్వేషన్ల అవసరం లేకుండానే ఇందిరా గాంధీ తన ప్రతిభను నిరూపించుకున్నారని, పురుష నాయకుల కంటే ఆమె ఎంతో గొప్పగా పనిచేశారని కొనియాడారు. మహిళా రిజర్వేషన్లను తాను వ్యతిరేకించడం లేదని, కుల, మతాల ఆధారంగా రాజకీయాలు చేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నానని గడ్కరీ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన నాగ్‌పూర్‌లో మహిళా స్వయంశక్తి సంఘాల ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఎమర్జెన్సీని విధించినందుకు ఇందిరా గాంధీని బీజేపీ విమర్శిస్తుంటే.. మరో వైపు గడ్కరీ ఆమెను ప్రశంసించడం చర్చనీయాంశమయింది. 'కాంగ్రెస్ పార్టీలో ఇందిరా గాంధీ తన ప్రతిభను నిరూపించుకుని అంకితభావం కలిగిన పురుషుల కంటే ఎంతో గొప్పగా పనిచేశారు. ఇందుకు రిజర్వేషన్లు కారణమా? కేంద్ర మంత్రి సుష్మ స్వరాజ్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ లాంటి బీజేపీ నాయకులు కూడా రిజర్వేషన్ల అవసరం లేకుండానే చక్కగా రాణిస్తున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే. దాన్ని నేను వ్యతిరేకించడం లేదు' అని గడ్కరీ పేర్కొన్నారు. ఎవరైనా తెలివితేటలతోనే రాణించగలుగుతారని, కులం, మతం, భాష, ప్రాంతం ఆధారంగా ఎవరూ రాణించలేరని అన్నారు.

రాజకీయ డ్రామా

4 ఏండ్ల 8 నెలలు ఏం చేశారు?



ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం ఎన్నికల జిమ్మిక్కు మాత్రమే. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 4 ఏండ్ల 8 నెలల తర్వాత కోటా ఇప్పుడు గుర్తుకువచ్చిందా? ఇది కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయం మాత్రమే. కోటా 50 శాతం దాటొద్దని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు చెప్పింది. తాజా పెంపు ప్రతిపాదనతో ఇది 60 శాతానికి చేరుకుంటుంది. ఈ అడ్డంకుల్ని కేంద్రం ఎలా అధిగమిస్తుంది?

- కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వి

మోదీ చివరి అస్త్రం ఇది



మూడు రాష్ర్టాల ఎన్నికల్లో దారుణ పరాభవాన్ని చవిచూసిన ప్రధాని మోదీ చివరి అస్త్రంగా అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రకటన చేశారు. ఈ నిర్ణయాన్ని మేం స్వాగతిస్తున్నాం. ఓట్ల కోసమే మోదీ ప్రజలకు 'లాలీపాప్'లను అందజేస్తున్నారు. రిజర్వేషన్ల అమలు కోసం రాజ్యాంగ సవరణ తక్షణ అవసరం. మోదీ సర్కారు ఈ నిర్ణయాన్ని అమలు చేయడంలో విఫలమైతే సార్వత్రిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

- పాటిదార్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్

రాజ్యాంగ విరుద్ధం



అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర మంత్రివర్గం నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం. సామాజికంగా అణగారిన దళిత, వెనుకబడిన, ఇతర వర్గాల ప్రయోజనాలను కాపాడటానికే రిజర్వేషన్లున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధం. అనాదిగా దళితులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి, పేదరికాన్ని నిర్మూలించడానికి రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని మరువకూడదు. బాధ్యతాయుతమైన లోక్‌సభ సభ్యుడిగా ఎంఐఎం తరపున మూడుబిల్లులను లోక్‌సభలో ప్రతిపాదించబోతున్నా. సామూహిక హింస, సీమాంచల్‌కు న్యాయం, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వయోపరిమితిని తగ్గించడం వంటి అంశాలపై బిల్లులను ప్రతిపాదిస్తా.

-ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

పచ్చి బూటకం



అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించే ప్రకటన పచ్చి బూటకం. ఈ అంశంపై న్యాయ పరమైన సంక్లిష్టతలు ముడిపడి ఉన్నాయి. పార్లమెంటులో ఈ బిల్లును ఆమోదించడానికి సమయమే లేదు. ఇది కేవలం నాటకం.

- యశ్వంత్‌సిన్హా

మోదీ సర్కార్ సెల్ఫ్‌గోల్



పీవీ నరసింహారావు ప్రభుత్వం కూడా అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టింది.. కానీ కోర్టు దానిని తోసిపుచ్చింది. ఇప్పుడు మోదీ సర్కార్ చేసిన నిర్ణయం సెల్ఫ్‌గోల్‌గా పరిణమిస్తుంది. మరో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల జనరల్ క్యాటగిరీలో ఉన్న వారికి ఇక 40 శాతం అవకాశాలే ఉంటాయి. జనరల్ క్యాటగిరీలో ఉన్నవారే ప్రస్తుత ప్రభుత్వానికి మద్దతుదారులుగా ఉన్నారు. వారితోపాటు ఆరెస్సెస్ కూడా ప్రభుత్వ నిర్ణయం వల్ల మోసపోతుంది.

- ప్రకాశ్ అంబేద్కర్, భరీపా బహుజన్ మహాసంఘ్ నాయకుడు

ఎన్నికల డ్రామా



అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ల పేరుతో కేంద్రం కొత్త డ్రామాకు తెరలేపింది. రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలి. అన్ని రాష్ర్టాల ఆమోదం అవసరం. మూడు నెలల్లో పార్లమెంటు ఎన్నికలు జరుగడానికి ముందు వీటన్నింటిని ఎలా పూర్తిచేస్తారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందడానికే ఈ ప్రకటన చేశారు. అగ్రవర్ణ పేదల పట్ల ఇది కంటితుడుపు చర్య. కేంద్రం మోసపూరిత వైఖరికి ఇదినిదర్శనం.

- సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

మౌలిక సూత్రానికి వ్యతిరేకం



అగ్రవర్ణాలకు పదిశాతం రిజర్వేషన్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకం. కుల వివక్ష, అభివృద్ధికి నోచుకోని వర్గాలకు చేయూతనిచ్చేందుకు రిజర్వేషన్లు ఇవ్వాలనే రాజ్యాంగ సూత్రాలను కేంద్రం ఉల్లంఘించింది. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడినవారికి అవసరమైతే ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి.

-బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

ఎన్నికల జిమ్మిక్కే

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కోటాపై విపక్షాల ఆగ్రహం

- సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే రిజర్వేషన్లు తెరపైకి తెచ్చారని ధ్వజం
- రిజర్వేషన్లు చరిత్రాత్మకం, విపక్షాలపై మాస్టర్‌స్ట్రోక్ అంటున్న బీజేపీ, ఎన్డీఏ పక్షాలు
- కోటాను స్వాగతించిన కేరళ, ఢిల్లీ ముఖ్యమంత్రులు

న్యూఢిల్లీ, జనవరి 7:

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడాన్ని ఎన్నికల జిమ్మిక్కుగా కాంగ్రెస్ అభివర్ణించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నరేంద్ర మోదీ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నదని ఎద్దేవా చేసింది. దేశ ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకే ఈ ఎత్తుగడ వేశారని విమర్శించింది. ఇది కేవలం ఎన్నికల స్టంట్ అని మండిపడింది. రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందాలంటే నిర్ణీత మెజార్టీ కావాలని, రాజ్యసభలో బీజేపీకి బలమే లేదని ధ్వజమెత్తింది. నాలుగేండ్ల ఎనిమిది నెలల పాటు కేంద్రం ఏం చేసిందని ప్రశ్నించింది. ఎన్నికలకు మూడు నెలల ముందే అగ్రవర్ణ పేదలు గుర్తుకు వచ్చారా? అని మండిపడింది. రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి ఇప్పటికే పలు రాష్ర్టాల్లో కోర్టు కేసులు కొనసాగుతున్నాయని, ఈ అడ్డంకుల్ని ఎలా అధిగమిస్తారో చెప్పాలని డిమాండ్ చేసింది. 'ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఎలా సాధ్యం. ప్రజలేమన్నా పిచ్చివాళ్లు అనుకుంటున్నారా? దేశ ప్రజలు గడ్డి తింటున్నారని మోదీ, బీజేపీ భావిస్తున్నదా? సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే కోటా అంశాన్ని తెరపైకి తెచ్చారు' అని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. మరోవైపు అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకమని, విపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ అని బీజేపీ, ఎన్డీఏ పక్షాలు పేర్కొన్నాయి. కేరళ సీఎం పినరాయి విజయన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్రం నిర్ణయాన్ని సమర్థించారు. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు సభలో ఆమోదం పొందేలా కృషి చేయాలని హితవు పలికారు. లేదంటే దీనిని కేవలం ఎన్నికల ఎత్తుగడ గానే భావించాల్సి వస్తుందన్నారు.



అగ్రకులాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఆందోళనకారుల ర్యాలీ(ఫైల్)

ప్రభుత్వ చర్చ తరువాత నిర్ణయం



ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు అందించేందుకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాక నిర్ణయం తీసుకోవాలని టీఆర్‌ఎస్ నిర్ణయించింది. రాజ్యంగ సవరణ చేస్తారా? బిల్లు రూపంలో తీసుకొస్తారా? ఏ విధంగా అమలు చేస్తారనే తదితర అంశాలను పరిశీలించిన తర్వాత టీఆర్‌ఎస్ నిర్ణయం తీసుకుంటుంది.

-టీఆర్‌ఎస్ ఎంపీ వినోద్ కుమార్

రిజర్వేషన్ల పెంపు అధికారం రాష్ర్టాలకే ఇవ్వాలి



ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన సరైనదే. అయినా రిజర్వేషన్లు పెంచుకునే అధికారాన్ని రాష్ర్టాలకే అప్పగించాలి. ముస్లిం రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేస్తే సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపిన కేంద్రం ఇప్పుడెలా కోటా పెంచుతుంది. రిజర్వేషన్లు అట్టడుగు వర్గాల అభివృద్ధికి కట్టుబడేలా ఉండాలి. జనాభా సంఖ్యకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించి బీసీల్లో క్రిమీ లేయర్‌ను ఎత్తివేయాలి.

- బూర నర్సయ్యగౌడ్, టీఆర్‌ఎస్ ఎంపీ

స్వాగతిస్తున్నాం..



రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం. ఈ డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. సీపీఎం కూడా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని చాలాకాలంగా కోరుతున్నది. ఇది స్వాగతించదగ్గ పరిణామం. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి కోసమే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారు.

- పినరాయి విజయన్, కేరళ సీఎం


సవరణ బిల్లు తెండి.. మద్దతిస్తాం



రిజర్వేషన్లు కల్పిస్తామని కేంద్రం ప్రకటిస్తే చాలదు. రాజ్యాంగ సవరణ బిల్లును వెంటనే తీసుకువచ్చి కేంద్రం తన నిజాయితీని నిరూపించుకోవాలి. బిల్లుకు మేం సభలో మద్దతిస్తాం. లేదంటే ఇది కేవలం ఎన్నికల స్టంటేనని భావించాల్సి ఉంటుంది

- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

కులాలు, మతాలకతీతంగా ఈబీసీ రిజర్వేషన్లు



ఈబీసీ రిజర్వేషన్లు అన్ని కులాలకు, అన్ని మతాలకు వర్తిస్తాయి. కులం సర్టిఫికెట్ లేని వారికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అనే తేడా లేకుండా నూతన అవకాశాలు లభిస్తాయి. బీసీలందరికీ ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా క్రిమీలేయర్ పరిమితిలో అవకాశాలు పెరుగుతాయి. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు పెంచాల్సి ఉన్నది. బీసీ ఈ గ్రూపునకు పెంచిన రిజర్వేషన్లను కూడా కేంద్రం ఆమోదించడం ద్వారా సామాజిక సామరస్యం వెల్లివిరుస్తుంది.

-బీఎస్ రాములు, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్

ఓటమి భయంతోనే..

ఉపాధి అవకాశాలే లేవు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం నినాదంగానే మిగిలిపోతుంది. మోదీజీ ఉద్యోగాలెక్కడున్నాయని ఈ దేశ యువత ప్రశ్నిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన మోదీ ప్రభుత్వానికి అగ్రవర్ణ పేదలపై ఒక్కసారిగా ప్రేమ పుట్టుకొచ్చింది.

-రణ్‌దీప్ సూర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి

ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల రద్దు దిశగా తొలి అడుగా: ఎన్సీపీ

అగ్రవర్ణ పేదలకు జనరల్ క్యాటగిరీలో 10% రిజర్వేషన్లు కల్పించడం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల రద్దుకు చేస్తున్న తొలి ప్రయత్నం. ఈ రిజర్వేషన్లతో మధ్యతరగతి వారికే లబ్ధి చేకూరుతుంది. రూ.8 లక్షల వార్షిక ఆదాయం పరిమితిని తగ్గించకపోతే పేదలకు లబ్ధి చేకూరదు. **-నవాబ్ మాలిక్, ఎన్సీపీ జాతీయ ప్రతినిధి**

రిజర్వేషన్లపై మోదీ సర్కార్ నిర్ణయం ఎన్నికల స్టంట్. నేను ప్రభుత్వంలో ఉన్నప్పుడు కోటా పెంచాలంటే రాజ్యాంగ సవరణ చేయాలనేవారు. రాజ్యాంగ సవరణ చేయకుండా ఇప్పుడు మోదీ సర్కారు నిర్ణయాన్ని ఎలా అమలు చేస్తారు? బూటకపు వాగ్దానానికి ఇది మరో ఉదాహరణ.

-ఉపేంద్ర కుశ్వాహా, కేంద్ర మాజీ మంత్రి

పార్టీలన్నీ మద్దతివ్వాలి: జేడీయూ

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడినవారు ఈ రిజర్వేషన్లతో ప్రధాన అభివృద్ధి స్రవంతిలోకి వస్తారు. దీనిపై పార్లమెంట్‌లో ప్రతిపాదించే రాజ్యాంగ సవరణ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతివ్వాలి.

-కేసీ త్యాగి, జేడీయూ ప్రతినిధి

చరిత్రాత్మక నిర్ణయం

విపక్షాలపై మాస్టర్‌స్ట్రోక్



కేంద్రం నిర్ణయంతో అగ్రకులాలు, నిమ్న కులాల మధ్య అంతరాలు, సంఘర్షణలు ఇక సమసిపోతాయి. ప్రధాని నిర్ణయం విపక్షాలపై మాస్టర్‌స్ట్రోక్ లాంటింది. మోదీ విధ్వంసక ఆటగాడని మరోసారి రుజువైంది. అగ్రవర్ణ పేదలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నేను చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాను. ప్రస్తుతం 10 శాతం కల్పించాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా

- ఆర్‌పీఐ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అథావలే

గొప్ప నిర్ణయం



రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం. ఇది చాలా గొప్ప నిర్ణయం. అగ్రవర్ణ నిరుపేదలకు మంచి భవిష్యత్ ఉంటుంది.

- ఎల్జేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్

సరికొత్త అధ్యాయం



సామాజిక మార్పులో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. కేంద్రం సాహసోపేత నిర్ణయం తీసుకున్నది.

- బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయ్‌వర్గీయ

సబ్‌కా సాత్- సబ్‌కా వికాస్



ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. సబ్‌కా సాత్– సబ్‌కా వికాస్ నినాదంలో భాగంగానే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించారు. కేంద్ర నిర్ణయంతో ఉత్తరాఖండ్‌లో లక్షలాది మంది విద్య, ఉద్యోగాల్లో లబ్ధి పొందుతారు.

- ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్రసింగ్ రావత్

మోదీ ఎన్నికల నగారా మోగించారు



రిజర్వేషన్లను నేషనల్ కాన్ఫరెన్స్ స్వాగతిస్తున్నది. ఈ నిర్ణయంతో మోదీ ఎన్నికల నగారాను మోగించారు. ఆ ఢంకా కూడా భారీగానే మోగింది.

- జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా

మోదీ ఒక్కరే ధైర్యం చేశారు



రిజర్వేషన్ డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. కానీ, ప్రధాని మోదీ ఒక్కరే ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారు. అన్ని మతాల్లోని అగ్రవర్ణాలకు మేలు జరుగుతుంది.

- కేంద్ర మంత్రి విజయ్ సంప్లా

అగ్రకులాల ఆకాంక్షల్ని అర్థం చేసుకున్నారు



దశాబ్దాలుగా అగ్రకుల పేదల్ని అన్ని పార్టీలు వంచించాయి. కానీ, ప్రధాని మోదీ వారి ఆకాంక్షల్ని అర్థం చేసుకుని రిజర్వేషన్లు కల్పించారు.

- కేంద్ర మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా

ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలి



ఈబీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తున్నది. అలాగే రిజర్వేషన్ల అమలుకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. అగ్రవర్ణాలలోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని, కర్పూరీ ఠాకూర్ ఫార్ములాను అమలు చేయాలని ఎప్పటి నుంచో మా పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల ముందు ఈ నిర్ణయాన్ని ప్రకటించడం ఎన్నికల జిమ్మిక్కని స్పష్టమవుతున్నది. అలాగే ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్ల అమలుకు పూనుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం కోరుతున్నది.

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సాహసోపేత నిర్ణయం



ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతం. ఈ నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల శాతాల్లో కోత విధించలేదు. వారి రిజర్వేషన్లు తగ్గే అవకాశాలు లేవు.

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే లక్ష్మణ్

వరుసగా మూడోసారి

- బంగ్లాదేశ్ ప్రధానిగా హసీనా ప్రమాణం


ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాన మంత్రిగా షేక్ హసీనా (71) నాలుగోసారి ప్రమాణంచేసి రికార్డు సృష్టించారు. బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హమీద్ ఢాకాలోని బంగభవన్‌లో సోమవారం ఆమెతో ప్రధానిగా ప్రమాణం చేయించారు. ప్రధానిగా హసీనా ప్రమాణం చేయడం వరుసగా మూడోసారి కాగా, మొత్తం మీద నాలుగోసారి. ప్రస్తుతం హసీనాతోపాటు కొత్త మంత్రులు, సహాయ మంత్రులు, ఉప మంత్రులు ప్రమాణం చేశారు.

అల్ ఖైదా అగ్రనేత బదావీ హతం

వాషింగ్టన్: అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థకు చెందిన అగ్రనేత జమాల్ అల్ బదావీ హతమయ్యాడు. 2000 సంవత్సరంలో యూఎస్‌ఎస్ కోల్ యుద్ధనౌకపై జరిగిన ఉగ్రదాడిలో 17 మంది అమెరికా నావికుల హత్యకు కారణమైన బదావీ.. యెమెన్‌లో అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఖతమైనట్టు 'పెంటగాన్' (అమెరికా రక్షణశాఖ ప్రధాన కార్యాలయం) వెల్లడించింది.

బెదిరింపులకు భయపడొద్దు

- సీబీఐ విచారణ వార్తల నేపథ్యంలో అఖిలేశ్‌కు మాయవతి బాసట



లక్నో, జనవరి 7: అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పాత్రపై సీబీఐ దర్యాప్తు చేయనుందనే వార్తలు వెలువడిన నేపథ్యంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి.. ఆయనకు బాసటగా నిలిచారు. కేంద్రం చేసే అలాంటి జిమ్మిక్కులకు భయపడొద్దని ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ మాదిరిగానే బీజేపీ కూడా ప్రతిపక్ష నేతలను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని ఆరోపించారు. ఈ మేరకు సీబీఐ విచారణ విషయమై అఖిలేశ్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు బీఎస్పీ అధ్యక్షురాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఒక్క రోజులో 13 మైనింగ్ ప్రాజెక్టులకు అనుమతిచ్చారు: సీబీఐ

న్యూఢిల్లీ: అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ దాడులు నిర్వహించడంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీబీఐ సోమవారం స్పందించింది. అప్పటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ ఒక్క రోజులో 13 మైనింగ్ ప్రాజెక్టులకు అనుమతిచ్చారని తెలిపింది. 14 మైనింగ్ లీజులకు అనుమతివ్వగా, ఈ–టెండర్ నిబంధనలు ఉల్లంఘించి అందులో పదమూడింటికి 2013 ఫిబ్రవరి 17న అనుమతి మంజూరు చేశారని ఆరోపించింది.

16 విమానాశ్రయాల్లో ప్లాస్టిక్‌పై నిషేధం

న్యూఢిల్లీ: ఒక్కసారి వినియోగించి పారవేసే(సింగిల్ యూజ్) ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై 16 విమానాశ్రయాల్లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిషేధం విధించింది. దీని ప్రకారం స్ట్రాలు, ప్లాస్టిక్ ప్లేట్ల వంటి ప్లాస్టిక్ ఉత్పత్తులను విమానాశ్రయాల్లోకి ఇకపై అనుమతించరు. ఇండోర్, భోపాల్, అహ్మదాబాద్, భువనేశ్వర్, తిరుపతి, తిరుచ్చి, విజయవాడ, డెహ్రాడూన్, ఛత్తీస్‌గఢ్, వడోదర, మదురై, రాయ్‌పూర్, వైజాగ్, పుణే, కోల్‌కతా, వారణాసి విమానాశ్రయాల్లో ఈ నిషేధం వర్తిస్తుంది. ఏడాదికి 10 లక్షల ప్రయాణికులు రాకపోకలు సాగించే 34 విమానాశ్రయాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధం అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించే బాధ్యతను క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఏఏఐ అప్పగించింది. ఈ నెల 31 నాటికి ఇది పూర్తికానుంది.

పదిశాతం కోటా

మొదటిపేజీ తరువాయి...

ఎలా అమలు చేస్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

అగ్రవర్ణాల్లో పట్టు సాధించేందుకే..!

అగ్ర కులాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. కొంతకాలంగా గుజరాత్‌కు చెందిన పాటిదార్ ఉద్యమ నేత హార్దిక్‌పటేల్ అగ్రవర్ణాలకు చెందిన తమ సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆందోళనల్ని తీవ్రతరం చేశారు. ఇటీవల కీలకమైన మూడు రాష్ర్టాల్లో బీజేపీ ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ అంశాన్ని కమలనాథులు గేమ్ ఛేంజర్‌గా భావిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరాదిలో అగ్రకులాల్లో గట్టి పట్టున్న బీజేపీ తాజా నిర్ణయంతో తన ఓటు బ్యాంకును మరింత బలోపేతం చేసుకునేందుకే రిజర్వేషన్లను తెరపైకి తెచ్చిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో భారీగా లబ్ధి పొందేందుకు కమలనాథులు కసరత్తు చేస్తున్నారని వారు చెబుతున్నారు.

రాజ్యసభ ఒక రోజు పొడిగింపు

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టేందుకు వీలుగా రాజ్యసభ సమావేశాలను ఓ రోజు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ వినతికి రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. డిసెంబర్ 11న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మంగళవారంతో ముగియనున్నాయి. సంబంధిత రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. అనంతరం బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనుంది. ఇందుకు వీలుగా బుధవారం కూడా రాజ్యసభ సమావేశం కానుంది.



ఉత్తరప్రదేశ్‌లో గరిష్టస్థాయిలో ఎంపీ సీట్లను గెలిచేందుకు సమాజ్‌వాదీ పార్టీ ప్రయత్నిస్తున్నది. మా గెలుపును అడ్డుకోవటం కోసం బీజేపీ సీబీఐతో దాడులు చేయిస్తున్నది. గతంలో కాంగ్రెస్ ఇదే చేసింది. వారికి తగినవిధంగా బదులిచ్చాం. ఇప్పుడు అదే రీతిగా బీజేపీకి యూపీ ప్రజలు సమాధానం చెబుతారు.

అఖిలేశ్ యాదవ్, యూపీ మాజీ ముఖ్యమంత్రి

ఎస్పీ, బీఎస్పీ ఐక్యతను దెబ్బతీసేందుకు బీజేపీ అనేక కుయుక్తులు పన్నుతున్నది. ఇసుక తవ్వకాల్లో అక్రమాలు పేరుతో సీబీఐతో దాడులు చేయిస్తున్నది. దీనివెనుక రాజకీయ కుట్ర ఉన్నది. సీబీఐ తరపున బీజేపీ నేతలే అధికార ప్రతినిధులుగా సీబీఐ కార్యక్రమాలను చెప్పటం బీజేపీ కుటిల నీతికి నిదర్శనం.



మాయావతి, బీఎస్పీ అధినేత్రి

చరిత్రలో నేడు



1816

ప్యారిస్ సైన్స్ అకాడమీ నుంచి పురస్కారం పొందిన మొదటి మహిళా శాస్త్రవేత్త సోఫీ జర్మేన్.

1877



అమెరికా భూమిపుత్రుల పక్షాన వుల్ఫ్ పర్వత శ్రేణుల్లో అమెరికన్ సేనలతో పోరాడిన క్రేజీ హార్స్.



1958

ఫిడెల్ క్యాస్ట్రో నేతృత్వంలోని విప్లవకారుల వశమైన క్యూబా రాజధాని హవానా.

ఆవుల సంరక్షణ కోసం 'గో కళ్యాణ్ సెస్' పేరిట పన్ను వసూలు చేయాలని యూపీ ప్రభుత్వం నిర్ణయించటం చర్చనీయాంశమవుతున్నది. గో సంరక్షణ కోసం 0.5 శాతం పన్నును ప్రత్యేకంగా అన్నిరకాల పన్నులకు అదనంగా వసూలు చేయాలని యూపీ ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో ఇలాంటి ఆవులు 50 లక్షల దాకా ఉంటాయని అంచనా. పోషణ కరువైన ఆవులతో ఇప్పటికే పట్టణాలు, గ్రామాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దకుండా, గో సంరక్షణ పేరిట ప్రజలపై పన్ను భారం పెంచటం విస్మయం కలిగిస్తున్నది.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

విద్యలో నైపుణ్యాలు పెంచటం లక్ష్యంగా 'విద్యాహక్కు చట్టం'లో సవరణలు చేయాలని విద్యావిధానంలో మార్పులకు కేంద్రం శ్రీకారం చుట్టింది.అమల్లో ఉన్న 'నాన్-డిటెన్షన్' విధానంతో కనీస విద్యనైపుణ్యాలు లేకుండానే పై తరగతులకు అర్హులై పోతుండటంతో నైపుణ్యాలు అడుగంటుతు న్నాయని కేంద్రప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా తగిన విద్యా నైపుణ్యాలు పెంపొందించటం కోసం కృషిచేయాలని సూచిస్తూ, ఇది విద్యార్థుల పాలిట శాపంగా మారకూడదని పేర్కొనటం గమనార్హం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

కంగారూలకు కంగారు!

క్రికెట్ చరిత్రను భారత జట్టు తిరగరాసింది. ఆస్ట్రేలియా గడ్డ మీదే ఆ దేశ క్రికెట్ జట్టును మట్టి కరిపించి సిరీస్ గెలుచుకొని చరిత్ర సృష్టించింది. ఏడు దశాబ్దాల కిందట భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించిన నాటినుంచి ఇప్పటివరకు ఏనాడూ ఇటువంటి గెలుపును చవిచూడ లేదు. ఆస్ట్రేలియా గడ్డ మీదే ఆ దేశ జట్టును ఓడించాలనే కలను కోహ్లీ జట్టు ఇంతకాలానికి నెరవేర్చింది. ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ గెలిచిన ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ దేశాల సరసన తొలి ఆసియా జట్టుగా భారత్ సగర్వంగా నిలిచింది. ఆస్ట్రేలియాకు మరీ అవమానకరమైన రీతిలో ఓటమిని అందించడం విశేషం. ఆస్ట్రేలియాపై 2-1 ఆధిక్యంతో ఉన్న కోహ్లీసేన మైదానంలోకి దిగగానే వీర విహారం చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లోనే 322 పరుగుల ఆధిక్యం సాధించి ఫాలో ఆన్ గతి పట్టించింది. వాతావరణ అనుకూలించక నాలుగో టెస్ట్ మ్యాచ్ డ్రా అయింది. కానీ ఆట యథావిధిగా సాగినా ఆస్ట్రేలియాకు ఘోర పరాజయం తప్పకపోయేది. కొమ్ములు తిరిగిన ఆస్ట్రేలియా ఆటగాళ్ళకు ఇది దిగమింగుకోలేని అవమానంగా చెప్పవచ్చు. ఆస్ట్రేలియా గడ్డ మీదే ఆ దేశ జట్టు ఘనవిజయం సాధించడం మన దేశంలోని క్రీడాభిమానులలో సంబురాన్ని నింపింది. ఆటలాడినప్పుడు గెలుపోటములను ఎవరికైనా దక్కవచ్చు. సాధారణ పరిస్థితుల్లోనైతే ఇంతగా సంబురపడవలసినదేమీ ఉండదు. ఇదే గెలుపు బంగ్లాదేశ్ మీదనో లేక శ్రీలంక మీదనో అయితే భారత క్రీడాభిమానులను ఇంత ఉద్వేగం ఆవరించేది కాదు. కానీ ఆస్ట్రేలియా ఆటగాళ్ల తలబిరుసుతనం, శ్వేతజాతి దురహంకారం జగద్విదితం. భారత ఆటగాళ్లకు కూడా ఎన్నోసార్లు ఇటువంటి చేదు అనుభవం ఎదురైంది. ఎంతోమంది వారి ప్రవర్తనకు ఆవేదన చెందారు.

> **కోహ్లీ జట్టు విజయాన్ని సంతోషంగా ఆస్వాదించవలసిందే. కానీ విజయం సాధించిన ఆనందంలో మన బలాలు, పరిమితులను మరిచిపోకూడదు. భారత జట్టు చేపట్టిన విదేశీ క్రీడాయాత్రలో మొదట దక్షిణాఫ్రికాతో ఆడిన టెస్ట్ సిరీస్‌లో గెలువలేకపోయింది. ఇంగ్లండ్‌తో ఆడి ఓడిపోయింది. మూడవ అడుగు ఆస్ట్రేలియాలో పెట్టి అద్భుత విజయాన్ని సాధించింది. మిగతా రెండు దేశాలతో ఓడిపోయినా డీలా పడకూడదు. ఒక దేశంతో గెలిచినా పొంగిపోకూడదు. ఆస్ట్రేలియాపై తాజా విజయాన్ని సాధించిన అనంతరం భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ మాట్లాడిన తీరు ఎంతో పరిణతితో ఉన్నాయి.**

పుజార అద్భుత ఫామ్, కోహ్లీ కెప్టెన్సీ ఇన్నింగ్స్, యంగ్‌తరంగ్ రిషబ్ పంత్ దూకుడైన ఆట- మొత్తంగా ఆసీస్ గడ్డపై భారత్‌కు అపురూప విజయాన్ని కట్టబెట్టాయి. ఆస్ట్రేలియాలో అడుగుపెట్టిన వెంటనే అడిలైడ్‌లో బోణీ కొట్టిన భారత్‌కు పెర్త్‌లో ఊహించిన పరాజయం ఎదురైంది. అయినా మెల్‌బోర్న్‌లో మళ్లీ పుంజుకొని కంగారూలను చావుదెబ్బ కొట్టింది. పేస్ బౌలర్లు బుమ్రా, షమీ, ఇషాంత్ నిప్పులు చెరిగే బంతులతో ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను గడగడలాడించారు. కోహ్లీని నిలువరిస్తే సిరీస్ మనదే అనుకున్న ఆస్ట్రేలియాకు చెతేశ్వర్ పుజార రూపంలో అనుకోని ముప్పు వచ్చిపడింది. నయావాల్ పేరుకు సార్థకతను చేకూరుస్తూ పుజార మూడు సెంచరీలతో పరుగుల వరద పారించాడు. ఈ సౌరాష్ట్ర సొగసరి అలసటెరుగని వీర బాదుడుకు కంగారూలు కుదేలైపోయారు. మెరుపు వేగానికి స్వింగ్ జోడిస్తూ జస్‌ప్రీత్ బుమ్రా గంటకు 140.కి.మీల వేగంతో వేసిన బంతులు ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ వెన్నులో వణుకు పుట్టించాయి. బుమ్రాకు తోడు స్వింగ్ సుల్తాన్ మహ్మద్ షమీ, సీనియర్ పేసర్ ఇషాంత్‌శర్మ సాగించిన పేస్ విధ్వంసం ఆస్ట్రేలియా జట్టుకు అవమానకర ఓటమిని మిగిలించింది. గతంలో మూడుసార్లు ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ సిరీస్‌ను డ్రా చేసుకున్నది. దిగ్గజాలకు సాధ్యం కాని ఘనతను కోహ్లీ సేన సాకారం చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ముద్దాడిన భారత జట్టుకు మరో మూడు నెలల్లో ఇంగ్లండ్ వేదికగా మొదలయ్యే క్రికెట్ ప్రపంచకప్ పోటీల్లో ఆడటానికి కావలసినంత ఉత్సాహాన్ని ఈ విజయం అందించింది.

కోహ్లీ జట్టు విజయాన్ని సంతోషంగా ఆస్వాదించవలసిందే. కానీ విజయం సాధించిన ఆనందంలో మన బలాలు, పరిమితులను మరిచిపోకూడదు. భారత జట్టు చేపట్టిన విదేశీ క్రీడాయాత్రలో మొదట దక్షిణాఫ్రికాతో ఆడిన టెస్ట్ సిరీస్‌లో గెలువలేకపోయింది. ఇంగ్లండ్‌తో ఆడి ఓడిపోయింది. మూడవ అడుగు ఆస్ట్రేలియాలో పెట్టి అద్భుత విజయాన్ని సాధించింది. మిగతా రెండు దేశాలతో ఓడిపోయినా డీలా పడకూడదు. ఒక దేశంతో గెలిచినా పొంగిపోకూడదు. ఆస్ట్రేలియాపై తాజా విజయాన్ని సాధించిన అనంతరం భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ మాట్లాడిన తీరు ఎంతో పరిణతితో ఉన్నాయి. 'ఈ (ఆస్ట్రేలియాపై) విజయం మనకు మొదటి అడుగు వంటిది.. భారత జట్టుకు మనం అత్యుత్తమ సేవ అందించదలుచుకున్నాం.. అది అత్యంత విశిష్టమైందిగా నిలిచింది.. కానీ ఇదొక మొదటి అడుగు మాత్రమే. ఆస్ట్రేలియన్లు ఎప్పుడు అత్యంత పోటీతత్వం కలిగి ఉంటారు. ప్రతి జట్టు కొంత పరిణామానికి లోనవుతూ ఉంటుంది. వారి ఆధిపత్యం ప్రపంచకప్‌ను ఎన్నో ఏండ్లు ఉద్విగ్నంగా నిలిపింది. వాళ్లు మళ్ళా కూడదీసుకొని భవిష్యత్తులో మరింత ఉద్విగ్నభరిత క్రీడను ప్రదర్శిస్తారని ఆశిస్తున్నాం. మనందరం ఆ ఆటను చూడవలసినవారం' అంటూ ఎంతో వినమ్రంగా పరాజితులను ప్రశంసిస్తూ మాట్లాడారు. ఆస్ట్రేలియా బాల్ టాంపరింగ్ వివాదం మూలంగా తామెంత జాత్యహంకారంతో ఉంటారో ప్రపంచానికే కాదు వారికీ తెలిసివచ్చింది. జయాపజయాలకు అతీతంగా ఆటను ఆస్వాదించాలని, ఓటమిని కూడా క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని ఆస్ట్రేలియన్లు నేర్చుకోవలసి ఉన్నది. కోహ్లీ సుతిమెత్తగా ఇచ్చిన సందేశం మన దేశ సంస్కారాన్ని వెల్లడిస్తున్నది.

జనగళం

అభినందనీయం

ముఖ్యమంత్రి కేసీఆర్ వినూత్న ఆలోచనా ధోరణి నుంచి పుట్టిందే 'కంటివెలుగు' పథకం. ఈ పథకం విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా పేద ప్రజలందరో ఈ పథకం సాయంతో కంటిచికిత్సలు చేయించుకున్నారు. ఇదిలా ఉంటే గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ 'కంటి వెలుగు' పూర్తవగానే, ఈఎన్టీ, దంత చికిత్సకు సంబంధించి వైద్యులు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు చికిత్స అందిస్తారని తెలిపారు. ఇది హర్షణీయం. హైదరాబాద్‌లోని కోఠి ఈఎన్టీ దవాఖానలో రోజుకు వెయ్యి నుంచి పదిహేను వందల దాకా ఈఎన్టీ బాధితులు డాక్టర్లను సంప్రదిస్తున్నారు. ఇంటింటి చికిత్స ద్వారా చాలా మంది పేదలకు వైద్య సేవలు అందనున్నాయి. ఈ దిశగా కేసీఆర్ ఆలోచించడం అభినందనీయం. ఈ పథకాలతో ఆరోగ్య తెలంగాణ ఆవిష్కృతమవుతుందనటంలో సందేహం లేదు.

- నారదాసు రాజేందర్, తార్నాక, హైదరాబాద్

అర్హులకు న్యాయం జరుగాలె

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఆసరా పింఛన్లను అందిస్తున్నది. ఈ పింఛన్ల పట్ల వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళలు, వికలాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీఆర్ఎస్ రెండోసారి సాధించిన విజయంలో ఆసరా పింఛన్ల ప్రభావం ఉన్నదనడంలో సందేహం లేదు. ఇలాంటి పథకాల అమలును నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలు చేయాలి. అర్హులందరికీ న్యాయం జరుగాలి.

- బేగరి ప్రవీణ్ కుమార్, అంతారం, చేవెళ్ల, రంగారెడ్డి జిల్లా

నల్లధనాన్ని వెనక్కి తీసుకురావాలె

2014 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో నల్లధనం వెనక్కి తెచ్చి ప్రతి పౌరుని ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని మోదీ డాంబికాలు పలికాడు. కానీ ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం. నల్లధనాన్ని పేద, మధ్య తరగతి ప్రజలకు పంచితే పేదరికంలేని భారత్‌ను ఆవిష్కరించుకోగలం.

- బోనాల కృష్ణ, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

తెలంగాణం



మాధవరం నాగేందర్

మోదీ, బాబు చీకటిదోస్తులు

బీజేపీలో ఉన్నతవర్గాల సమాచారం ప్రకారం చివరి మూడుసార్లు చంద్రబాబు మోదీని ప్రాధేయపడింది నియోజకవర్గాల పెంపు, పునర్విభజన గురించి మాత్రమే. మిత్రపక్షానికి సహాయపడాల్సిన దర్మం బీజేపీకి ఉన్నదని గుర్తుచేసినా మోదీ బాధ్యత అంతా అమిత్ షాదే అని చెప్పాడు. అమిత్ షా తన పార్టీకి ఏదీ మేలు జరుగుతుందని ఆలోచిస్తాడు కానీ మిత్రపక్ష ప్రయోజనం గురించి ఎందుకు పట్టించుకుంటాడు.

1983 మేలో స్త్రీ వేషంలో వచ్చిన గుండాలు ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ ముందు పుంగనూరు శాసనసభ్యుడు బగ్గిడి గోపాల్ పై దాడి చేశారు. మీడియా మాత్రం కొజ్జాల చేతిలో దెబ్బలు తిన్న గోపాల్ అని ప్రచారం చేశాయి. ఆ తర్వాత గోపాల్ భార్యపై దాడి జరిగింది, తమ్ముడు కిడ్నాప్‌నకు గురయ్యాడు. ఇంతవరకు అతని శవం కూడా లభించలేదు. ఈ ఘటనల సందర్భంగా మొదటిసారిగా చంద్రబాబు పేరు వార్తల్లోకి వచ్చింది. అక్కడినుంచే తెలుగు రాష్ట్రంలో కుట్ర పూరిత రాజకీయాలు ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ ప్రభుత్వం కూల్చివేతతో భ్రష్ట రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయి. కోవర్టులు, క్యాష్ కరప్షన్లనే పునాదులపై మాయ సామ్రాజ్యం నిర్మించుకొని రాజకీయాల్లో కొనసాగుతున్నాడు. ఒకసారి ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలదోసి, రెండుసార్లు బీజేపీ సహాయంతో అధికారంలోకి వచ్చాడు. కానీ, స్వతహాగా ఎప్పుడూ అధికారంలోకి రాలేదు.

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు ప్రధాన లక్ష్యాలను సాధించాలనుకున్నాడు. తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వ సహాయంతో అష్ట దిగ్బంధనం చేసి విఫల రాష్ట్రంగా చూపించి తిరిగి సమైక్యాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం. జగన్ ఆస్తులను, మీడియాను ఆర్థిక నేరాల కింద కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేయించి దివాలాదారుగా చేయడం. జగన్‌ను వివిధ కోర్టు కేసుల ద్వారా శాశ్వతంగా జైలు పాలు చేయడం. నోటుకు ఓటు కేసు తర్వాత హైదరాబాద్ నగరంలో సెక్షన్ 8 ను అమలుచేయడానికి కేంద్రానికి సిఫార్సు చేయనందుకు గవర్నర్ నరసింహన్‌ను శత్రు జాబితాలో చేర్చాడు. నరసింహన్ తొలిగింపు అనేది బాబు ఎజెండాలో నాలుగవ అంశంగా చేరింది. ప్రధాని మోదీని ప్రత్యేకంగా ఐదుసార్లు కలిసి గవర్నర్‌ను తొలిగించమని విజ్ఞప్తి చేశాడు. ఆంధ్రప్రదేశ్‌కు కావల్సిన అంశాలకంటే ఈ నాలుగు అంశాలపైనే చంద్రబాబు ప్రధాని మోదీని 26 సార్లు కలిశాడు.

ఆంధ్రప్రదేశ్‌కు 2016 సెప్టెంబర్‌లో ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీని బాబుతో అరుణ్ జైట్లీ రోజుల తరబడి చర్చించిన తర్వాతనే విడుదల చేయడం జరిగింది. ప్యాకేజీలో ఉన్న అంశాలన్నింటికీ చంద్రబాబు అమోదం తెలిపారు. అందుకే టీడీపీ కేంద్రమంత్రి సుజనా చౌదరి 2016 సెప్టెంబర్ 11న ప్యాకేజీ వల్లనే ఆంధ్రప్రదేశ్‌కు స్పెషల్ స్టేటస్ కంటే ఎక్కువగా లాభపడుతుందని, ఎందుకంటే శివరాజ్‌సింగ్ చౌహాన్ కమిటీ గ్రాంట్లపై విధించిన 60:40 నిబంధన వల్ల 40 శాతం గ్రాంట్లను తిరిగి కేంద్రానికి చెల్లించాల్సి ఉంటుందనీ, కానీ ప్రత్యేక ప్యాకేజీ వల్ల వచ్చిన సహాయాన్ని తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని అన్నాడు. టీడీపీ ఎంపీ జయదేవ్ 2017 మార్చ్ 10న మాట్లాడుతూ ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి రూ.2,500 కోట్లు మాత్రమే వస్తాయి. కానీ, ప్రత్యేక ప్యాకేజీ వల్ల రూ.16,000 కోట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నాడు. ఆరు నెలల తర్వాత మార్చిలో కేంద్ర క్యాబినెట్ ప్రత్యేక ప్యాకేజీకి అమోదం తెలిపింది. టీడీపీ సభ్యుడు అశోక గజపతిరాజు కేంద్ర క్యాబినెట్‌లో ఉండి సంపూర్ణ మద్దతు ఇచ్చాడు. కేంద్రం ఉదారంగా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్మానించింది. చంద్రబాబు, నరేంద్ర మోదీల హనీమూన్ చెడటానికి కారణం ప్రత్యేక ప్యాకేజీ రాకపోవడమే కారణమా లేక వేరే కారణం ఏమైనా ఉన్నాదా అనేది ప్రధాన ప్రశ్న.

అమిత్ షా బీజేపీ అధ్యక్షుడైన తర్వాత పార్టీని కొత్త పంథాలో నడిపిస్తున్నాడు. చిరకాల మిత్రపక్షమైన శివసేనను కాదని ఒంటరిగా పోటీచేసి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని పార్టీకి దక్కించుకున్నాడు. తెలంగాణలో బీజేపీ ప్రధాన పక్షంగా అవతరిస్తుందని ఊహించి విభజన చట్టం లో పేర్కొన్న నియోజకవర్గాల సంఖ్య పెంపును అడ్డుకున్నాడు. చంద్ర బాబుకు మాత్రం నియోజకవర్గాల పెంపు, పునర్విభజన లేకుండా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు అసాధ్యమని తెలుసు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ ప్రభంజనం, పవన్‌కళ్యాణ్ కలిసినా వచ్చిన మెజార్టీ 6,01,539 ఓట్లు మాత్రమే. బీజేపీలో ఉన్నతవర్గాల సమాచారం ప్రకారం చివరి మూడుసార్లు చంద్రబాబు మోదీని ప్రాధేయపడింది నియోజకవర్గాల పెంపు, పునర్విభజన గురించి మాత్రమే. మిత్రపక్షానికి సహాయపడాల్సిన ధర్మం బీజేపీకి ఉన్నదని గుర్తుచేసినా మోదీ బాధ్యత అంతా అమిత్ షాదే అని చెప్పాడు. అమిత్ షా తన పార్టీకి ఏది మేలు జరుగుతుందని ఆలోచిస్తాడు కానీ మిత్ర పక్ష ప్రయోజనం గురించి ఎం దుకు పట్టించుకుంటాడు. అందుకే మోదీని వాజపేయిలాగా బెదిరించి పని చేసుకోవాలంటే కుదరదు మీ ప్రయోజనం కోసం మేము తెలంగాణలో పార్టీ ప్రయోజనాలను త్యజించలేమని నిక్కచ్చిగా చెప్పాడు. తెలు గు రాష్ట్రాల్లో బీజేపీ అత్యున్నతస్థాయి నాయకుడు పార్టీ ప్రయోజనాలను టీడీపీకి తాకట్టు పెడుతున్నాడని భావించి కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించి పంజరంలో పెట్టిన విషయం గమనార్హం. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో రిజర్వేషన్లు, సరిహద్దులను నిర్ణయించడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నిస్తే సఫలం కాలేదు. మారిన బీజేపీ తత్వం గురించి అంచనా వేయడంలో బాబు విఫలమయ్యాడు. చంద్రబాబు పదేపదే చెప్పే 'నమ్మిమోసపోయామనే' విషయం సీట్ల పెం పు అమోదించకపోవడం గురించే కానీ బయటకు చెప్తున్నట్లు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోవడం గురించి కాదు.

ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రలో నియోజకవర్గాల సంఖ్యను పెంచితే చంద్రబాబు ఇంకా ఎన్డీయేలో భాగస్వామిగా ఉండేవాడు. ఇంత గొడవ జరుగుతున్నప్పటికీ చంద్రబాబు, నరేంద్ర మోదీల సఖ్యత చెడిందంటే పొరపాటు పడ్డట్టే. చివరి సమావేశాల్లో వీరిద్దరు ఏం చర్చించుకున్నారు? తీవ్ర విబేధాలు ఎందుకొచ్చాయనే విషయంపై నరేంద్ర మోదీ పెదవి విప్పడు. చంద్రబాబు నిజం చెప్పడు. నీవు వస్తానంటే నేను వద్దంటానా అని నరేంద్ర మోదీ, నీవు రమ్మంటే ఎక్కడికైనా రానంటానా అని చంద్రబాబు చాటుమాట ప్రేమాయణం ఇంకా సాగిస్తున్నారు. కేసీఆర్, జగన్, పవన్ కళ్యాణ్ ఏకమై మోదీతో కలిసి రాష్ట్రానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని నిందించినా మోదీ అసలు విషయం చెప్పడు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరంను అనేక ఆరోపణల మధ్య అదుపులేకుండా పెరుగుతున్న అం చనాలతో రాష్ట్ర ప్రభుత్వం కట్టడానికి అనుమతించడం, ప్రపంచానికి సేవలను అందిస్తున్న మన నిపుణులను కాదని సింగపూర్ కంపెనీలకు అమరావతి నిర్మాణం అప్పచెప్పడం వెనుక రహస్యమేమిటి? కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్నందున నరేంద్ర మోదీ మౌనంగా ఉండాల్సిన అవసరం ఏమొచ్చింది? చంద్రబాబు, నరేంద్ర మోదీ సంబంధాలపై అనేక అనుమానాలున్నాయి.

> **దేశంలో అన్ని పార్టీలకు కారెక్టర్ సర్టిఫికెట్, బ్యాడ్ కండక్ట్ సర్టిఫి కెట్ ఇచ్చే అధికారాన్ని చంద్రబాబు తనకుతానుగా పుచ్చుకున్నాడు. సమయానుకులంగా హీరో పార్టీలను, విలన్ పార్టీలను నిర్వచిస్తాడు. ఆ తర్వాత రాజకీయక్రీడ ఆడుతాడు. సొంత మీడియా, అపరిమితమైన ఆర్థిక వనరుల్లేని వారు రాజకీయాల్లో కొనసాగలేని దురదృష్టకర పరిస్థితిని సృష్టించాడు.**

దేశంలో రూమర్ మిల్లు (అబద్ధాలను, కుట్ర సిద్ధాంతాలను అనుమానాలను సృష్టించే) వ్యవస్థ కలిగిన ఏకైక పార్టీ టీడీపీ. లబ్ధి పొందిన మీడియా సహాయంతో అనేక అవాస్తవాలను దశాబ్దాలుగా ప్రచారం చేస్తూ వస్తున్నారు. ఒక పార్టీని విలన్‌గా చిత్రీకరించి, వ్యతిరేక పార్టీలన్నీంటిని సంబంధం లేకున్నా ఆ విలన్‌కు అంటగట్టి, రాష్ట్ర ప్రయోజనాల వ్యతిరేక గ్రూప్‌గా ప్రచారం చేస్తూ, ప్రజల్లో అనుమానాలను రేకెత్తిస్తూ లాభపడే విధానాన్ని చంద్రబాబు చాలా సమర్థవంతంగా అమలుపరుస్తూ వస్తున్నాడు. దేశంలో అన్ని పార్టీలకు కారెక్టర్ సర్టిఫికెట్, బ్యాడ్ కండక్ట్ సర్టిఫి కెట్ ఇచ్చే అధికారాన్ని చంద్రబాబు తనకుతానుగా పుచ్చుకున్నాడు. సమయానుకులంగా హీరో పార్టీలను, విలన్ పార్టీలను నిర్వచిస్తాడు. ఆ తర్వాత రాజకీయక్రీడ ఆడుతాడు. సొంత మీడియా, అపరిమితమైన ఆర్థిక వనరుల్లేని వారు రాజకీయాల్లో కొనసాగలేని దురదృష్టకర పరిస్థితిని సృష్టించాడు. 2014లో కాంగ్రెస్ విలన్, జగన్ పిల్ల కాంగ్రెస్ అని ప్రజలను నమ్మించాడు. 2019లో బీజేపీ విలన్ టీఆర్ఎస్, వైసీపీ, జన సేనలు పిల్ల బీజేపీలు అని ప్రచారం చేస్తున్నాడు. తెలంగాణ ప్రజలు ఈ వాదాన్ని తిరస్కరించారు. వచ్చే ఎన్నికల్లో ఆంధ్ర ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారో చూడాలి.

(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకులు, న్యూయార్క్)

విలక్షణ బాటలో కేటీఆర్

విశ్లేషణ



జూలూరు గౌరీశంకర్

రాజకీయాలు, రాజకీయ పార్టీలన్నవి ప్రస్తుతం ఉన్న సమాజాన్ని ఏ మేరకు మార్చగలుగుతున్నాయన్నదే సమాజం ముందున్న ప్రశ్న. గ్లోబల్ మార్కెట్ కాలంలో ప్రజలకు చేరువగా ప్రజల కోసం, ప్రజల యొక్క, ప్రజల కొరకు అన్న రీతిలో ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్ఠించే నేతల కోసం సమాజం ఎదురుచూస్తున్నది.

కొత్త ప్రవాహంలాగా కొత్త రాజకీయ విధానాలను కూడా ఒక్కసారిగా సమాజం జీర్ణం చేసుకోవటం కూడా కొంత కష్టమే, అదికూడా క్రమంగా జరుగాల్సిందే. నాయకుని డ్రెస్‌కోడ్ మారితే కూడా దాన్ని జీర్ణం చేసుకోవటం కష్టం. ఇప్పటివరకు అభివృద్ధి ఏమీ జరుగలేదనలేము కానీ, గత పాలకుల పని విధానాన్ని, ఆ పార్టీల పోకడలను, ప్రయాణాలను కాలం చూసింది. తెలంగాణ రాష్ట్రం కోసం 14 ఏండ్లు పనిచేసిన ఉద్యమపార్టీ టీఆర్ఎస్‌కే తొలి రాష్ట్ర పాలనాపగ్గాలను ప్రజలు అందించటం మామూలు విషయం కాదు. ఓట్లు వేయటం మాత్రమే కాకుండా కేసీఆర్ పాలనా పరంగా తీసుకునే నిర్ణయాలను కూడా ప్రజలు అర్థం చేసుకున్నారు. ఆకళింపు చేసుకుంటున్నారు. కొత్తగా రాష్ట్ర పునర్నిర్మాణం జరుగుతున్నప్పుడు సమాజం దృష్టంతా పునర్నిర్మాణం పైనే ఉంటుంది. ఉండాలి కూడా. ఈ సమయంలో పాలనారంగాన్ని నడిపేవారి కృషి, పట్టుదల, దీక్ష ఎంతో ముఖ్యమైనవిగా ప్రజలు పరిగణిస్తారు. సరిగ్గా ఉద్యమంలో, పాలనలో రెండుచోట్ల సీఎం కేసీఆర్ దీక్షతోనే పని చేస్తున్నారు. అందుకు మొత్తంగా పాలనారంగాన్ని, తన దీక్షవైపునకు లక్ష్యంవైపునకు మళ్లించే పనిలో కేసీఆర్ కృతకృత్యులయ్యారు. అట్లనే మంత్రివర్గాన్ని, ఎమ్మెల్యేలను, టీఆర్ఎస్ పార్టీని, కలసివచ్చే వారందరినీ నిర్మాణం పనుల్లో నిమగ్నం చేశారు. ఇది సందర్భం. దీన్నెవరూ కాదనలేరు. రెండోసారి కూడా కేసీఆర్‌కే ప్రజలు మద్దతు ప్రకటించి తిరుగులేని విజయాన్నందించారు.

ప్రజలకు అత్యవసరమైన పనులకు మొదటి ప్రాధాన్యంగా తీసుకొని కేసీఆర్ ప్రభుత్వం అడుగులువేసింది. భూమినే నమ్ముకున్న భూమి పుత్రులకు అండగా నిలబడింది. కేసీఆర్ సంక్షేమ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి దేశంలోనే నంబర్‌వన్‌గా తెలంగాణను నిలుపగలిగారు. ఈ పనులన్నీ జరుగుతున్నప్పుడు తెలంగాణ సమాజం హర్షించింది. రైతుబంధు వంటి పథకాల దగ్గరినుంచి ప్రతి ఇంటి తలుపును తట్టి ఏదో ఒక సహాయం చేయాలన్న మహత్తర సంకల్పంతో టీఆర్ఎస్ ముందుకుసాగుతున్నది.

ఇంతపెద్ద పనులు జరుగుతున్న సందర్భంలో రాష్ట్ర మంత్రివర్గంలో కేసీఆర్ తనయుడు కేటీఆర్ ఉన్నాడు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కేటీఆర్‌కు తన పేజీలు తనకున్నాయి. అయితే కేటీఆర్ విధానం వేరు. స్వతంత్రంగా ఆలోచిస్తాడు. ప్రతి పనిలో సృజనాత్మకతను వెతుక్కుంటాడు. మాటను సూటిగా బాణంలా వదులుతాడు. సంప్రదాయంగానే వెళ్లాలన్న పాతగేట్ల తాళాలు పగులగొట్టి, కొత్త సంస్కృతికి తలుపులు తెరుస్తాడు. పైరవీ రాజకీయాలను వ్యతిరేకిస్తాడు. ప్రతి విషయంపై వెంటనే స్పందించే తత్వం ఉన్నది. అలాంటి స్పందనల రక్తనాడులు ఉండబట్టే కేటీఆర్ ఈ రాజకీయ చట్రంపై కొత్తగా ఆవిష్కరించబడుతున్నాడు. ఆయనకు పొగడ్తలు పడవు. పొగిడించుకోవటాలు, మెడల్లో గజమాలలు వేసుకోవటాలు ఇష్టపడడు. కొత్త వ్యవస్థ నిర్మాణం కోసం రూపొందుతున్న నాయకుడిగా కేటీఆర్ కనిపిస్తాడు. తాను చేసే పనులతో, తన ఆలోచనలతో ముందుకుసాగటం వల్ల ఈ రాజకీయరంగంలో నూతన నాయకునిగా రూపుదిద్దబడుతున్నాడు.

నాయకుడు చేసే పనుల వల్ల వ్యవస్థకు వెలుగు రావాలని కోరుకుంటారు. ఆ దృష్టిలో కొత్త బాటలు వేసే వారికోసం సమాజం ఎదురుచూస్తుంది. ఈ లక్షణం కేటీఆర్‌లో కనిపిస్తుంది. ఇలాంటి వారు ప్రచార ఆర్భాటాలు పటాటోపాలు ప్రదర్శించరు. వ్యక్తిగత ప్రచారం చేసుకొని తమకు తాము ప్రమోషన్ వర్క్ చేసుకునే ఈ కాలంలో కేటీఆర్ విభిన్నంగా కనిపిస్తాడు. తన పుట్టినరోజు సందర్భంగా ఎవరూ హంగామాలు చేయవద్దని, రోడ్లమీద హోర్డింగులు పెట్టవద్దని, ఏ రకమైన ప్రచారాలు చేయవద్దని కేటీఆర్ ట్విట్టర్‌లో సందేశం పంపాడు. ఇది కేటీఆర్ పుట్టిన రోజుకు ముందునాడే అన్ని దినపత్రికల్లో వచ్చింది. నిజంగా ఆ రోజు దినపత్రికల్లో కేటీఆర్ ట్విట్టర్ సందేశం చదివి చాలామంది సంతోషించారు.

కేటీఆర్‌కు పుట్టినరోజు వేడుకలపై నమ్మకం ఎంతవరకు ఉందో తెలియదు. ప్రజల కోసం సేవచేసిన వారిని ప్రజలు గుండెల్లో దాచుకోవాలి కానీ ఈ హోర్డింగ్‌లో, కటౌట్లలో కాదన్న దాన్ని కేటీఆర్ విశ్వసిస్తాడనుకుంటా! సరిగ్గా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తను అధికారికంగా పర్యటన చేస్తూ వెళ్తున్నాడు. ఆయన పుట్టినరోజు సందర్భం గా ఒక పెద్ద హోర్డింగ్ రాజధానిలో కన్పించింది. వెంటనే కారు ఆపి ఆ హోర్డింగ్‌కున్న ప్లెక్సీని చించేసి కాల్చివేశాడు. ఈ హోర్డింగ్‌లు పర్యావరణానికి తీవ్ర నష్టం కల్గిస్తున్నాయి. అయినా నాకు ఇష్టం లేని ఈ పుట్టిన రోజు వేడుకలను రాష్ట్రంలో ఎవరూ జరుపవద్దని, దయచేసి ప్లెక్సీలు పెట్టవద్దని ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించారు. ప్లెక్సీలు, హోర్డింగ్‌ల ద్వారా నాయకులు వెలిగిపోరు. తాము చేసే పనుల ద్వారానే వాళ్లు ప్రజ ల్లో మాణిక్యాల్లా మెరిసిపోతారు. సరిగ్గా కేటీఆర్ కూడా అదే పని చేశాడు. ఎవరు ప్రజలకు ఏం సహాయం చేశారో, అసలు ఎవరు ప్రజల కోసం పనిచేశారో, చేస్తున్నారో ప్రజలు గమనిస్తారు. ప్రస్తుతం సమాజంలో వ్యక్తిగతంగా ప్రచార డాంబికాలు పెరిగిపోయాయి. వార్డ్ మెంబర్ల నుంచి చిన్నస్థాయి పోస్టులు గలవారి దగ్గర్నుంచి పెద్ద హోదాలు, మంత్రుల స్థాయివరకు పుట్టినరోజులు, పెండ్లిరోజులు, పండుగలకు, పబ్బాలకు, చివ రికి దైవకార్యాలన్నింటికీ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలతో కటౌట్లతో ప్రచారాలు చేసుకుంటున్నారు. ఇదేం సంస్కృతి? దీన్నెవరు ఆపాలి? ఈ కోణంలోనే కేటీఆర్ తన పుట్టినరోజున ఇచ్చిన ట్విట్టర్ సందేశం ఆహ్వానించదగింది. అదే విధంగా తన మంత్రిత్వ శాఖ పరిధిలోకొచ్చే అన్ని మున్సిపాల్టీల్లో అక్రమంగా అడ్డంగా పెట్టిన హోర్డింగ్‌లన్నింటిని తొలిగించమని ఉత్తర్వులు జారీచేశారు.

నాయకులకు కాకుండా ప్రజలకు చేసే సేవకు ప్రచారం జరుగాలని కేటీఆర్ కోరుకుంటున్నారనుకుంటా. ఆ దృక్పథం ప్రజల్లోకి విస్తృతంగా పోవాలని ఆయన తలంచుతున్నారు. ప్రజలందరిలో సేవా దృక్పథం పెంపొందించాలి. ప్రజల కోసం పని చేసే వారి కి మార్కెట్లోకి వచ్చిన కొత్త కార్లు లేదా కొత్త వస్తువు అడ్వర్టయిజ్‌మెంట్‌లాగా ప్రచారం ఎందుకని కేటీఆర్ ఆలోచన. ఇది మంచి ఆలోచన. ఈ ఆలోచనను ప్రతి ఒక్కరూ ఎవరికివారుగా ఒంటపట్టించుకొంటే తమ పుట్టిన రోజులను ప్రజలకు అంకితం చేసి ఏదో ఒక మంచి పనిచేస్తారు. ఈ దారిలో ఇప్పటికే కొందరు ముందుకు సాగుతున్నారు. మొత్తంగా ప్రజలందరిలో ఆ రకమైన ఆలోచనలు పెరుగాలనే కేటీఆర్ తన పుట్టినరోజు విషయంలో గతంలోనే ప్రకటన చేశారు.

అభిమానులకు అభిమాన సంఘాలుండటం అందరూ ఒప్పుకోవచ్చు. ఒప్పుకోకపోవచ్చును. కానీ, ఒక వ్యక్తిపై, ఒక నాయకునిపై అభిమానం ఉండటం అంటే ఆ నాయకుని ఆలోచనలను గౌరవించటం, ఆ దారిలో నడువటం చేయాలి. చాలావరకు ఒక నాయకునిపై ప్రేమ కలిగి ఉండటమంటే అతని భావజాలాన్ని ఆచరించటానికి లేదా ఆ భావజాలాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేయడానికి కృషి చేయాలి. కానీ, అభిమాన సంఘాలు కూడా చివరికి ఎటుపోతాయో కేటీఆర్‌కు స్పష్టంగా తెలుసు. అందుకే ఆయన టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనపేరుతో ఎలాంటి సంఘాలు ఏర్పాటు చేయవద్దని ఖరాఖండిగా చెప్పారు. అదేకాకుండా తనపేరుతో ఏర్పాటుచేస్తున్న పలు సంఘాలకు, అభిమాన సంఘాలకు తనవైపు నుంచి ఎటువంటి మద్దతు లేదని బహిరంగంగా ప్రకటించడంతో ఆలోచపరులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఇంకో అడుగు ముందుకేసి ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల్లో కూడా అభిమాన సంఘాల పేర్లతో ఎలాంటి కార్యకలాపాలు చేయవద్దని చెప్పాడు. తనపై అభిమానం ఉంటే కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ కోసం పనిచేయమని కోరారు. ప్రజల కోసం పనిచేయటం కంటే ఉన్నతమైనది మరొకటిలేదన్న సందేశాన్ని ఈ ప్రకటన ద్వారా కేటీఆర్ ప్రజలముందుంచారు. కేటీఆర్ రొటీన్ రొడ్డకొట్టుడు రాజకీయాన్ని, తెలంగాణలో పాకురు పట్టిన ఆధిపత్య రాజకీయాల్ని చెక్కివేయాలని చూస్తున్నాడు. అందుకే పాత మూసపద్ధతుల గోడలను పగులుగొడుతున్నాడు. పాత రోత రాజకీయాలు పోవాలి. నూతన రాజకీయాల ఆవిష్కరణలు జరుగాలి. తెలంగాణ సమాజం కోరుకునేది అదే. ఆ వైపుగానే కేటీఆర్ అడుగులు వేస్తున్నాడు. మంచికోసం వేసే ప్రతి అడుగుకు సమాజం దారిస్తుంది.

> **కేటీఆర్ రొటీన్ రొడ్డకొట్టుడు రాజకీయాన్ని, తెలంగాణలో పాకురు పట్టిన ఆధిపత్య రాజకీయాల్ని చెక్కివేయాలని చూస్తున్నాడు. అందుకే పాత మూసపద్ధతుల గోడలను పగులుగొడుతున్నాడు. పాత రోత రాజకీయాలు పోవాలి. నూతన రాజకీయాల ఆవిష్కరణలు జరుగాలి. తెలంగాణ సమాజం కోరుకునేది అదే.**

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

● భద్రాద్రి రామున్ని దర్శించుకున్న హైకోర్టు జస్టిస్



భద్రాద్రి ఆలయంలోని శ్రీసీతారాములను సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు, దేవస్థాన అధికారులు ఆయనకు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. గర్భ గుడిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టత గురించి వివరించారు.
- భద్రాచలం, నమస్తే తెలంగాణ

వేములగట్టు రైతులకు
పరిహారం చెక్కులు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: మల్లన్న సాగర్ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన వేములగట్టుకు చెందిన 69మంది నిర్వాసితులకు సోమవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ కృష్ణభాస్కర్ పరిహారం చెక్కులను అందజేశారు. 213.09 ఎకరాల భూమికి రూ.16.50 కోట్ల పరిహారాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ చట్ట పరిధిలో పరిహారాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పద్మాకర్, సిద్దిపేట ఆర్డీవో జయచంద్రారెడ్డి, గజ్వేల్ ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ చేనేత కార్మికులను ఆదుకోండి

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విన్నపం

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సిరిసిల్ల తరహాలోనే వరంగల్‌లోని చేనేత కార్మికులను ఆదుకోవాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విజ్ఞప్తిచేశారు. సోమవారం వరంగల్ తూర్పు నియోజకర్గానికి చెందిన 25 చేనేత సహకార సంఘాల అధ్యక్షులతో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. జరీ చేనేత కళాకారులు, చద్దర్లు, జంపఖానాలు తయారుచేస్తూ జీవనోపాధి సాగిస్తున్న వారిని ఆదుకోవాలని కోరారు. తూర్పు నియోజకర్గంలో దాదాపు నాలుగువేల మంది చేనేత కార్మికులున్నారని వారు నేసిన చద్దర్లు మొదలైన చేనేత వస్తువులను ప్రభుత్వమే టెస్కో ద్వారా కొనుగోలు చేస్తున్నా ఇంకా నిల్వలున్నాయని వాటిని కూడా కొనుగోలు చేసి నేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ విషయంలో కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే నరేందర్ చెప్పారు.



చేనేత సహకార సంఘాల అధ్యక్షులతో కలిసి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నేత కార్మికుల సమస్యలను విన్నవిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

గ్రామ స్వరాజ్యం

కదులుతున్న పల్లెలు

ఏకగ్రీవాలకే మొగ్గు • ప్రజల ఆశలన్నీ ప్రగతి కోసమే..



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం పద్మారం తండాలో ఏకగ్రీవం కోసం సమావేశమైన స్థానికులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అభివృద్ధి కోసం గ్రామాలన్నీ కదులుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో పాలక వర్గాలను ఏకగ్రీవం చేసుకొని ప్రభుత్వమిచ్చే రూ.10లక్షల ప్రోత్సాహకంతోపాటు ఎమ్మెల్యేలు తమ నిధుల నుంచి ఇచ్చే నజరానాలు దక్కించుకోవాలని పల్లె ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారు. అందుకోసం ఎక్కడికక్కడ గ్రామాల్లో సమావేశమై సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. క్రితంసారి కంటే ఈసారి ఏకగ్రీవాల పంచాయతీల సంఖ్య భారీగా పెరగనున్నది. ఒక గ్రామాన్ని చూసి మరో గ్రామం అన్నట్టుగా ఆయా గ్రామాల వారు ఏకగ్రీవాల కోసం పోటీపడుతున్నారు. సోమవారం కూడా అనేక గ్రామాల్లో పాలక వర్గాలను ఏకగ్రీవం చేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం అజ్మీరా, భూక్యతండాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తండావాసులు నిర్ణయించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో దేవునిగుట్ట తండా సర్పంచ్‌గా గుగులోత్ పెంటయ్య, ఉపసర్పంచ్‌గా



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవుని గుట్టతండాలో ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు



రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం పోలేపల్లి పంచాయతీలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

భూక్య ప్రకాశ్, వార్డుసభ్యులుగా భూక్యారమేశ్, భూక్య రజిత, భూక్య బుజ్జి, భూక్య సోనా, ధరావత్ రవి, వార్డు సభ్యులుగా అజ్మీరా ప్రమీల, భూక్య సుర్యకిరణ్, నునావత్ పద్మ, నునావత్‌రాజు, అజ్మీరా కవిత, నునావత్ రాజు, గుగులోత్ సునీత, భూక్య కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చందుర్తి మండలం దేవునితండా సర్పంచ్‌గా భూక్య పంతులు, ఉప సర్పంచ్‌గా గుగులోత్ సునీతను, కోనరావుపేట మండలం అజ్మీరా తండా సర్పంచ్‌గా ఇస్లావత్ దివ్య, ఉపసర్పంచ్‌గా భూక్య ప్రవీణ్, భూక్యరెడ్డి తండా సర్పంచ్‌గా లాకవత్ ప్రమీల, ఉపసర్పంచ్‌గా బానోతు సంధ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం లక్ష్మీపతిగూడెం సర్పంచ్‌గా నలగండ్ల లావణ్య, ఉప సర్పంచ్‌గా అశోక్, వట్‌పల్లి మం డలం దరఖాస్తుపల్లి సర్పంచ్‌గా దూదేకుల మహ్మద్, ఉపసర్పంచ్‌గా మహేశ్‌తోపాటు వార్డు సభ్యులుగా కొత్తగొల్ల శివరాములు, మల్లేశం, హస్నాబాద్ బుదెమ్మ, మక్కల ఈశ్వరమ్మ, కలాలి పల్లమ్మ, మంతూరి శంకర్, బిజిలీపూరం లక్ష్మయ్య, దౌల్తాబాద్ లక్ష్మీలను ఎన్నుకున్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఆశన్నపల్లి సర్పంచ్‌గా మంద రమను ఎన్నుకుంటున్నట్టు ప్రకటించారు. త్వరలోనే ఉపసర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులను ఎన్నుకోనున్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం గుర్రంగుట్ట తండా సర్పంచ్‌గా సోనీబాయి, ఉపసర్పంచ్‌గా పాండు నాయక్, బషీరాబాద్ మండలం కుప్పన్‌కోర్టు తండా సర్పంచ్‌గా పద్మ, ఉప సర్పంచ్‌గా రేణుకా బాయి, బాబునాయక్ తండా సర్పంచ్‌గా సూర్య, తాండూరు మండలం మిట్టబాసుపల్లి సర్పంచ్‌గా నరేందర్‌రెడ్డిని, వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం ఆముదంబండ తండా సర్పంచ్‌గా ఇస్లావత్ మణెమ్మను ఆయా గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొత్త సర్పంచ్‌కు ఎమ్మెల్యే సన్మానం..

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం కొత్తకుంట తండా సర్పంచ్‌గా కేతావత్ శోభ, ఉపసర్పంచ్‌గా కేతావత్ జాన్యానాయక్‌ను ఎన్నుకున్నారు. అనంతరం తండావాసులంతా ఆమనగల్లులో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలువగా ఆయన వారిని అభినందించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ శోభ, ఉపసర్పంచ్ జాన్యానాయక్‌ను సన్మానించారు.

అచ్చంపేట సెగ్మెంట్‌లో ఆరు పంచాయతీలు ఏకగ్రీవం

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో ఏకగ్రీవ సర్పంచుల పర్వం జోరందుకున్నది. సోమవారం ఆరు గ్రామ పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అచ్చంపేట మండలం పద్మారం తండా సర్పంచ్‌గా కొర్ర బుజ్జి, లింగాల మండలం చెన్నంపల్లి సర్పంచ్‌గా రవీందర్, ఎంసీతండా సర్పంచ్‌గా కేతావత్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్‌గా కేతావత్ నాను, పదర మండలం జ్యోతినాయక్ తండా సర్పంచ్‌గా రాత్లావత్ రాము, ఉప సర్పంచ్‌గా రాత్లావత్ సాయిబాబు, అమ్రాబాద్ మండలం తెలుగుపల్లి సర్పంచ్‌గా వలువాయి వెన్నెల, ఉప సర్పంచ్‌గా కొప్పెరి శ్రీనివాసులు, ఉప్పునుంతల మండలం తిప్పాపూర్ సర్పంచ్‌గా శాంతబాయిలను ఆయా గ్రామస్థులు ఎన్నుకున్నట్టు తీర్మానాలు చేశారు.

జగిత్యాల జిల్లాలో ఐదు పంచాయతీలు..

జగిత్యాల జిల్లాలో ఐదు పంచాయతీల పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెట్‌పల్లి మండలంలో కొత్తగా ఏర్పడ్డ కేసీఆర్ తండా సర్పంచ్‌గా గుగ్లావత్ శంకర్‌నాయక్, ఉప సర్పంచ్‌గా గుగ్లావత్ హన్మంత్‌నాయక్‌తోపాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ స్థానికులు తీర్మానించారు. ధర్మపురి మండలం బూరుగుపల్లిలో సర్పంచ్‌గా కంది తిరుపతి, ఉప సర్పంచ్‌గా ద్యాగేటి లక్ష్మి, వార్డు సభ్యులను, ఆక్సాయిపల్లి సర్పంచ్‌గా రామెల్ల రమేశ్‌తోపాటు వార్డు సభ్యులను, బీర్‌పూర్ మండలం కందెనకుంట సర్పంచ్‌గా బద్ది సత్తవ్వ, ఉప సర్పంచ్‌గా ఏదుల శంకర్‌తోపాటు వార్డు సభ్యులను, రాయికల్ మండలం కైరిగూడెం సర్పంచ్‌గా గుడిపెల్లి చంద్రకళ, ఉపసర్పంచ్‌గా కర్నం నరేశ్, వార్డు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏకగ్రీవానికి హన్మాపురంలో ర్యాలీ



భువనగిరి రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హన్మాపురం గ్రామ సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని కోరుతూ సోమవారం గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. నిస్వార్థంగా గ్రామానికి సేవ చేసేందుకు ముందుకొచ్చిన మాజీ సర్పంచ్ ఏనుగు సంజీవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పలువురు కోరారు. పంచాయతీని ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకంతో గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవచ్చని సూచించారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

■ జయశంకర్ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సూచన

హన్మకొండ, నమస్తే తెలంగాణ: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయవర్సిటీ ఏరువాక కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో వరంగల్ అర్బన్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల స్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నతపాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకుసాగాలని సూచించారు. ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ముఖ్యఅతిథి శ్రీనివాస్ తదితరులు

కేటీపీపీ షట్‌డౌన్

■ మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంటులో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

గణపురం (జయశంకర్ భూపాలపల్లి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం(కేటీపీపీ)లో సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. రెండో దశ 600 మెగావాట్ల ప్లాంటులో జనరేటర్‌లోని రోటార్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో 25 రోజులుగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిన విషయం తెలిసిందే. తాజాగా, సోమవారం మొదటిదశ 500 మెగావాట్ల ప్లాంటులో బాయిలర్ ట్యూబ్‌లీకేజీతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో కేటీపీపీ రెండు దశల్లోని 1100 మెగావాట్ల ఉత్పత్తికి బ్రేక్ పడింది.

గర్భిణిపై పైశాచిక దాడి

■ గర్భస్రావంతో తీవ్ర అస్వస్థత
■ భద్రాద్రికొత్తగూడెం జిల్లా మద్దిరాలతండా అంగన్‌వాడీ కేంద్రంలో ఘటన

ఇల్లెందు, నమస్తే తెలంగాణ: అంగన్‌వాడీ ఆయా భర్త ఓ గర్భిణిపై పైశాచిక దాడికి పాల్పడ్డాడు. దాడిలో మహిళకు గర్భస్రావమై పిండం బయటపడింది. ఆమె తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు దవాఖానలో చేర్పించారు. ఈ దారుణం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బుద్దుతండా పంచాయతీ పరిధిలోని మద్దిరాల తండాలో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాలతండాకు చెందిన బాదావత్ పద్మ ఆరు నెలల గర్భిణి. తన ఇద్దరు చిన్నారులను స్థానికంగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపుతున్నది. తాను కూడా గర్భిణి కావడంతో పౌష్టికాహారం, వైద్య పరీక్షల కోసం అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నది. కేంద్రంలో తన పిల్లలకు గుడ్లు ఇవ్వడం లేదని గర్భిణి పద్మ ఆయాగా పని చేస్తున్న నీలను ప్రశ్నించింది. దీంతో ఇరువురి మధ్య వివాదం చోటుచేసుకున్నది. అదే సమయంలో అంగన్‌వాడీ కేంద్రం ఆయా జరిగిన విషయాన్ని తన భర్త మాలోత్ వీరన్నకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న నీల భర్త వీరన్న ఆగ్రహంతో ఊగిపోతూ గర్భిణి పద్మ కడుపులో గట్టిగా తన్నాడు. దీంతో నేలమీద పడిపోయిన పద్మకు అక్కడికక్కడే గర్భస్రావమై పిండం బయట పడింది. వెంటనే స్పందించిన స్థానికులు 108 ద్వారా సులానగర్ పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు టేకులపల్లి ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితురాలు పద్మ




మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

■ మాజీమంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వెల్లడి

జడ్చర్ల టౌన్: రైతుల సంక్షేమం కోసం రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో పథకాలను అమలు చేశారనీ జడ్చర్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి సీ లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. రైతులకు సాగునీరందించేందుకు యుద్ధప్రాతిపాదికన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని రైతుబంధు పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయడానికి కేంద్రం అధ్యయనం చేయడం గొప్పవిషయమన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, వాటి ద్వారా రైతులు నష్టపోకుండా మద్దతు ధర కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా పోరండ్లలో మాట్లాడుతున్న బస్వరాజు సారయ్య

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుదాం

■ టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బస్వరాజు సారయ్య పిలుపు

జగిత్యాల, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుదామని రాష్ట్ర ప్రధానకార్యదర్శి బస్వరాజు సారయ్య పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా పోరండ్లలో నిర్వహించిన టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సందర్భంగా బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌ను 61 వేల మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేటినుంచి భద్రాద్రిలో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవం

■ 31 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాచలం పట్టణంలో మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు ఐటీడీఏ క్రీడోత్సవాలు జరుగనున్నాయి. రాష్ట్ర నలుమూలల 1,416 మంది గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల క్రీడాకారులు పాల్గొననున్నారు. ఇందుకోసం ప్రత్యేక కోర్టులను ఏర్పా టు చేశారు. భద్రాచలం ఐటీడీఏ పీవో పమేలా సత్పతి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని నిర్వాహకులు ముస్తాబు చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, విలువిద్య, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. మొత్తం 225 మంది పీడీ, పీఈటీలు విధులు నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవాలకు రాష్ట్ర, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

టీఆర్ఎస్‌లో చేరికల జోష్

నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సూర్యాపేట మండలానికి చెందిన 200 మంది, దాసాయిగూడేనికి చెందిన 200 మంది మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలో, కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన 300 మంది, హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో పలువురు టీఆర్ఎస్‌లో చేరారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం, వేములపల్లికి చెందిన 100మంది ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో, చింతపల్లి మండలం తిదేడు గ్రామానికి చెందిన 50 మంది దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వరంగల్‌రూరల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీలకు చెందిన 85 మంది ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో, జనగామ జిల్లా పసరమడ్ల గ్రామానికి చెందిన 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో, జనగామ జిల్లా గుండాల మండలంలోని మరిపడిగకు చెందిన 200 మంది టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం గ్రామానికి చెందిన టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో, మరికల్ మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు నారాయణపేట ఏమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



సూర్యాపేట జిల్లాకేంద్రంలో టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులకు కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



సూర్యాపేట జిల్లా కోదాడలో టీఆర్ఎస్‌లో చేరిన వారితో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు

నాగోబా జాతరకు అంకురార్పణ

■ నెలవంకకు మొక్కిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర నిర్వహణకు మెస్రం వంశీయులు సోమవారం రాత్రి అంకురార్పణ చేశారు. నెలవంక కనిపించడంతో ఉమ్మడి జిల్లాలోని మెస్రం వంశీయులు కేస్లాపూర్‌కు చేరుకొని పురాతన నాగోబా దేవస్థానంలో సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఫిబ్రవరి 4న నాగోబాకు నిర్వహించే మహాపూజలకు ఏర్పాట్లు చేశారు.



పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

నేటినుంచి శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవాలు

దామెర: వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలం ఊరుగొండలో వెలిసిన శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీనివాసచార్యులు తెలిపారు. ఈ మహోత్సవాలు ఈనెల 19వరకు జరుగుతాయన్నారు. 15న శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారు సమీపంలోని గుట్టపైకి వేదమంత్రాల మధ్య చేరుకుంటారని, 16న స్వామివారి జాతర వైభవంగా జరుగుతుందన్నారు. 17న శ్రీలక్ష్మీనర్సింహస్వామి తిరిగి గ్రామ ఆలయ ప్రవేశం చేస్తారని పేర్కొన్నారు. ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.



పిల్లల ప్రాణాలు కాపాడండి సారూ!

నిర్మల్ టౌన్: తలసేమియాతో బాధపడుతున్న తమ చిన్నారులను కాపాడాలని కోరుతూ బాధితుల తల్లిదండ్రులు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌కు తరలివచ్చారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ముథోల్ తదితర ప్రాంతాల్లో సుమారు 300 మంది తలసేమియా బాధితులు ఉన్నారని, వారికి సరైన వైద్యం అందించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, రాజారాం యాదవ్



తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, గాదరి కిశోర్



తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్



తెలంగాణభవన్‌లో కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహిళా శిశు సంక్షేమ ఆర్వోలు

మహిళలంతా టీఆర్‌ఎస్‌వైపే

- మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి
- ఆర్వోలతో సమావేశంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళాలోకం టీఆర్‌ఎస్‌కు అండగా నిలిచిందని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో టీఆర్‌ఎస్‌లో మహిళలకు మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మహిళాశిశుసంక్షేమశాఖ రీజినల్ ఆర్గనైజర్లతో(ఆర్వో) సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో మాతాశిశు మరణాలసంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. కేసీఆర్ కిట్స్‌తో ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరిగాయని, ఈ సంఖ్య మరింత పెరిగేలా చూడాలని చెప్పారు. కల్యాణలక్ష్మితో బాల్యవివాహాలు తగ్గాయన్నారు. చిన్నారులు, బాలికలు, మహిళల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని వారికి సూచించారు. మహిళలకు సంబంధించి ప్రభుత్వపరంగా పరిష్కరించాల్సిన అంశాలు ఏవైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీలు, స్కూళ్లు, హాస్టళ్లలో బాలికల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం

చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారిని కాపాడుకుంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన నాలుగు వేల మంది సభ్యులు ఉన్న 25 చేనేత సహకార సంఘాల ప్రతినిధులు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణభవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలపై ఎమ్మెల్యే వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించాలని కోరారు. వారు ఉత్పత్తిచేసిన బట్టలను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నా రు. బెడ్ షీట్స్, కార్పెట్లకు మార్కెటింగ్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎలగం లీలావతి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉద్యోగుల డాటాబేస్

- రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పూర్తి వివరాలు సేకరణ
- కొత్త జోనల్ వ్యవస్థకు అనుగుణంగా క్యాడర్‌ను వర్గీకరిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్త జోనల్ వ్యవస్థకు అనుగుణంగా ఉద్యోగుల క్యాడర్‌ను వర్గీకరించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు రాష్ట్రంలోని ఉద్యోగుల సంఖ్య ఎంత? క్యాడర్ పోస్టులు ఎన్ని? ఎన్ని ఖాళీలు ఉన్నాయి? అదనంగా ఎంతమంది ఉన్నారు? కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య ఎంత? వంటి వివరాలన్నింటినీ రాష్ట్రప్రభుత్వం సేకరిస్తున్నది. ఉద్యోగుల పేర్లు, వారి విద్యార్హతలతోపాటు పూర్తి సమాచారాన్ని సేకరించి, అంతా ఒకే చోట నిక్షిప్తంచేసి ఓ డాటాబేస్‌ను తయారుచేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీని ఆధారంగా ఎక్కడ ఎన్ని ఖాళీలు ఉన్నాయో తేలడంతోపాటు క్యాడర్ పోస్టుల కంటే ఎక్కువ ఉన్నవారి వివరాలు కూడా వెంటనే తెలిసిపోతాయి.



అదేవిధంగా ఏయే శాఖల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంతమంది ఉన్నారో తెలుస్తుంది. అంతేకాకుండా ఈ డేటాబేస్‌తో పదోన్నతుల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

అడ్డగోలుగా పదోన్నతులు: ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగుల పదోన్నతులు సైతం అడ్డగోలుగా జరిగాయని అధికారులు గుర్తించారు. 1999లో అప్పటి ఏపీపీఎస్సీ 175 ఏఎస్వో పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. మెరిట్ జాబితా విడుదల చేసిన తర్వాత.. అప్పటి ప్రభుత్వం ఆ ఏఎస్వో పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీచేసింది. దీంతో నియామకాల ప్రక్రియ ఆగిపోయింది. మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. వారందరినీ ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు 2017లో ఆదేశించింది. అక్రమ పదోన్నతుల వల్ల ఇలాంటి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే ప్రమాదం ఉంటుందని సర్కారు గుర్తించింది. వైద్యశాఖలోనూ ఇలాంటి అక్రమ పదోన్నతుల కేసులు బయటకు వచ్చాయని సమాచారం.

సులభంగా నియామకాలు

రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆలోచిస్తున్నది. ఈ ప్రక్రియకు ముందుగా.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల జాబితా, వారి హోదాలు, క్యాడర్‌వారీగా వివరాలు.. ఇలా అన్ని కోణాల్లో పూర్తి సమాచారం సేకరిస్తున్నది. ఈ వివరాలన్నింటితో డాటాబేస్ తయారుచేస్తే.. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో సులభంగా తెలిసిపోతుంది. ఈ ఖాళీల ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేపట్టడానికి వీలవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఎన్నారైలకు బీమాతో ధీమా

- అవగాహన లేకే ఆర్థిక ఇబ్బందులు
- కొన్ని జాగ్రత్తలు పాటిస్తే జీవితం సురక్షితమే
- తెలుగువారికి భరోసా.. తానా టీమ్ స్క్వేర్
- తెలుగువారికి తానా మార్గదర్శకాలు

తొర్రూరు, నమస్తే తెలంగాణ: ఉద్యోగాలతోనో, పైచదువులకో తెలుగువారు అమెరికాకు వెళ్లటం పరిపాటిగా మారింది. దాదాపు 13 లక్షల మంది తెలుగువారు అమెరికాలో ఉన్నారని అంచనా. అమెరికా సురక్షితమైన దేశమే అయినప్పటికీ.. అడపాదడపా తుపాకీ సంస్కృతి జడలు విప్పుతూ ఉంటుంది. కొన్ని దురదృష్టకర ఘటనల్లో పలువురు తెలుగువారు కూడా మృత్యువాతపడ్డారు. దీనికి తోడు ఇమ్మిగ్రేషన్ సమస్యలు కూడా ఇబ్బందులకు గురిచేస్తున్న ఉదంతాలు ఉన్నాయి. ఇన్సూరెన్స్ (బీమా) చేయించుకోకపోవడంతో ప్రమాదాల బారినపడినవారికి ఆర్థికపరమైన సమస్యలు వస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పూస సాయికృష్ణపై ఈ నెల 3న మిషిగాన్‌లో దుండగుల కాల్పుల నేపథ్యంలో అక్కడి భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మరోసారి చర్చ జరుగుతున్నది. సాయికృష్ణకు బీమా లేకపోవడంతో అతడి ప్రాణం నిలబెట్టేందుకు అవసరమైన చికిత్స కోసం స్నేహితులు విరాళాలు సేకరిస్తున్నారు. అయితే.. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే అమెరికాలో జీవితాన్ని సురక్షింగా సాగించవచ్చునని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులు చెప్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికాకు వెళ్లి వివిధ వృత్తుల్లో పనిచేస్తున్నవారిలో కొందరు అక్కడి చట్టాలపై అవగాహన ఉండటం లేదు. భద్రత లేని ప్రాంతాల్లో నివసిస్తుండటం, యూనివర్సిటీల్లో చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం తదితర కారణాలతో ఇబ్బందులు పడుతున్నారు. అమెరికాలో సురక్షిత జీవనం కోసం తానా అత్యవసర సహాయక బృందం (తానా టీం స్క్వేర్) కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ప్రమాదకర స్థలాలకు, పరిస్థితులకు దూరంగా ఉండాలని, చట్టబద్ధులై వ్యవహరించాలని, తగినంతగా ఆరోగ్య, వాహన, జీవిత బీమాలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

బీమాతోనే ధీమా..: వీసా కాలపరిమితి ఎంత తక్కువైనా అమెరికాలో ఉన్నన్ని రోజులు మంచి ఆరోగ్య బీమా కలిగి ఉం డటం ఎంతో అవసరం. అక్కడ వైద్యం చాలా ఖరీ దు. హెచ్-1, ఎల్-1 వీసాలతో వెళ్లే విద్యార్థులు ఇన్సూరెన్స్‌లో అశ్రద్ధ చూపుతున్నారు. టర్మ్‌లైఫ్ ఇ న్సూరెన్స్ ఆర్థికంగా చాలామందికి అందుబాటులో ఉండే ప్రీమియానికే లభిస్తున్నది. 35 ఏండ్లలోపు వయస్సుగలవారికి లక్ష డాలర్ల టర్మ్‌లైఫ్ ఇన్సూరెన్స్ అక్కడ ఒకటి రెండు సార్లు రెస్టారెంట్‌లో పెట్టే ఖర్చుతో సమానమని తానా ప్రతినిధులు చెప్తున్నారు. ఇలాంటి బీమా సౌకర్యం వారిని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల నుంచి కాపాడుతుందంటున్నారు.

ఘర్షణలకు దూరంగా ఉంటేనే ప్రాణరక్ష

అపరిచితులతో వాగ్వాదాలు, అభిప్రాయభేదాలు సాధారణం. అయితే.. అభ్యంతకరమైన సైగలు, అసభ్యకర తిట్లు వంటివి మానుకోవాలి. ఎవరైనా దుండగులు మొరటుగా బెదిరిస్తూ డబ్బులు, విలువైన వస్తువులు ఇవ్వాలని డిమాండ్‌చేస్తే ఏ మాత్రం ప్రతిఘటించకుండా ఉన్నవి ఇచ్చేయాలి. స్థానిక విద్యార్థులు, ప్రజలతో కలసిమెలిసి ఉండాలి. అప్పుడే పరాయివారు అన్న భావన అమెరికన్లలో తగ్గుతుంది. భారతీయులు కలుసుకున్న సందర్భంగా మాతృ భాషల్లో మాట్లాడుకోవడాన్ని చుట్టుపక్కలవారు అపార్థం చేసుకుని గొడవలు పడిన సందర్భాలున్నాయని తానా ప్రతినిధులు చెప్తున్నారు. బయటి ప్రదేశాల్లో ఇంగ్లిష్‌లోనే మాట్లాడుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

తానా మార్గదర్శకాలతో సురక్షిత జీవనం



ఎన్నో కలలతో అమెరికాకు వస్తున్న తెలుగువారందరి సురక్షిత జీవనానికి తానా మార్గదర్శక సూత్రాలను జారీచేసింది. సుమారు 600 నుంచి 1000 మంది తానా అత్యవసర సహాయక బృందం సభ్యులు ఆపదలో ఉన్న తెలుగువారిని ఆదుకుంటూ, సహాయం చేస్తున్నారు. అమెరికా పరిస్థితులపై అవగాహన ఉంటే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చు. సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయడం, పనికిరాని యూనివర్సిటీల్లో చదవడంతో కొందరు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత చదువుల కోసం పిల్లలను పంపే తల్లిదండ్రులు విధిగా రెండు సెమిస్టర్ల కోసం వారికి డబ్బు సమకూర్చాలి. చదువు కోసం వచ్చిన వారంతా పార్ట్‌టైం ఉద్యోగాలపై ఆధారపడితే, పరిస్థితులను ఆకళింపు చేసుకోలేని ప్రాంతాల్లో పనిచేస్తే ప్రమాదాలు తప్పవు. మద్యం తాగి వాహనాలు నడుపడం, సమయంతో సంబంధం లేకుండా సరదాలకోసం బార్లు, పబ్బులకు వెళ్లటం వంటి పనులకు దూరంగా ఉండాలి. అమెరికాలో తెలుగువారికి ఏ ప్రమాదం వచ్చినా 911కి కాల్ చేస్తే వెంటనే పోలీస్, ఫైర్, అంబులెన్స్ సిబ్బంది ఒకేసారి ఘటన ప్రదేశానికి చేరుకుంటారు.

- జయశేఖర్ తాళ్లూరి, తానా ప్రెసిడెంట్ ఎలెక్ట్

అమెరికాలో రెండేండ్ల వ్యవధిలో చనిపోయిన తెలంగాణవాసులు


14 సెప్టెంబర్ 2017: అమెరికా కాన్సస్‌లో సైకియాట్రిస్ట్‌గా పనిచేస్తున్న మిర్యాలగూడ వాసి డాక్టర్ అచ్యుత్‌రెడ్డి దారుణ హత్య.

28 జనవరి 2018: డల్లాస్‌లో సిద్దిపేట జిల్లా ప్రశాంత్‌నగర్‌కు చెందిన కృష్ణచైతన్య అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఓ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటూ అనుమానాస్పద స్థితిలో మృతి.

17 నవంబర్ 2018: అమెరికాలో వెంటార్న్ సిటీలో విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న మెదక్‌జిల్లాకు చెందిన సునీల్ ఎడ్ల తలపై తుపాకితో కాల్చిన ఆయన ఇంటికి ఎదురుగా ఉండే 16 ఏళ్ల బాలుడు.

నిలకడగా సాయికృష్ణ ఆరోగ్యం

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: అమెరికాలో దుండగుల కాల్పుల్లో తీవ్రం గా గాయపడిన సాయికృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు తెలుస్తున్నది. సాయికృష్ణకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలుచేపట్టాలని ఎంపీ సీతారాంనాయక్ విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్‌ను కోరారు. ఆమె సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు. సాయికృష్ణకు మంగళవారం సర్జరీ చేయనున్నట్టు ఆయన చెల్లెలు మౌనిక చెప్పారు. ఒకట్రెండురోజుల్లో తల్లిదండ్రులతో కలిసి తాను కూడా అమెరికాకు వెళ్తున్నట్టు చెప్పారు. సాయికృష్ణ ఘటనను దినపత్రికల్లో చదివిన పలువురు ఆయన కుటుంబసభ్యులకు మద్దతుగా నిలుస్తున్నారు. సోమవారం మహబూబాబాద్ పట్టణంలో ఉన్న సాయికృష్ణ తల్లిదండ్రులు పూస ఎల్లయ్య, శైలజను ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, సీతామహాలక్ష్మి దంపతులతోపాటు టీఆర్‌ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ ఫరీద్ కలిసి మనోధైర్యం చెప్పారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇలాఉండగా, సాయికృష్ణకు వైద్యం అందించేందుకు రెండున్నర లక్షల డాలర్లు అవసరం ఉండగా.. అతడి స్నేహితులు గో ఫండ్ మీ డాట్ కమ్ పేరుతో ఇప్పటివరకు 2,47,645 డాలర్లు పోగుచేశారు.



విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్‌తో మాట్లాడుతున్న ఎంపీ సీతారాంనాయక్

ఇద్దరు దొంగల అరెస్టు

రూ.20.80 లక్షల సొత్తు రికవరీ

ఆదిలాబాద్ అర్బన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.20.80 లక్షల సొత్తును రికవరీ చేశారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ సమావేశమందిరంలో సోమవారం ఆదిలాబాద్ ఎస్పీ విష్ణువారియర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లో సాధారణ తనిఖీలు చేస్తుండగా.. పాత నేరస్తుడు మహ్మద్ మోహీజ్‌తోపాటు మరోవ్యక్తి రాజేశ్వర్లు ఆటలో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. నిందితుల వద్ద రూ.19,20,000 విలువ చేసే 64.4 తులాల బంగారం, రూ.30 వేల విలువైన 60 తులాల వెండి, రూ.80 వేల విలువైన మూడు ఎల్‌ఈడీ టీవీలు, రూ.50 వేల విలువైన 3 కిలోల గంజాయిని పట్టుకొని సీజ్‌చేసినట్టు చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

పీటీ వారెంట్‌పై నగరానికి త్వరలోనే నౌహీరా!

- చిత్తూరునుంచి రప్పించేందుకు పోలీసుల సన్నాహాలు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నిబంధనలకు విరుద్ధంగా ప్రజలనుంచి డిపాజిట్లు సేకరించి దేశవ్యాప్తంగా భారీ కుంభకోణానికి పాల్పడ్డ నౌహీరా షేక్‌ను చిత్తూర్ నుంచి హైదరాబాద్‌కు పీటీ వారెంట్‌పై తీసుకొచ్చేందుకు సీసీఎస్ పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. అధిక లాభాల ఆశచూపి లక్షలాది మంది నుంచి హీరా గ్రూప్ సంస్థలు వేలకోట్ల రూపాయలు సేకరించాయి. వడ్డీల రూపంలో లాభాలను తిరిగి ఇవ్వకపోవడంతో హైదరాబాద్‌కు చెందిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హీరా గ్రూప్ సంస్థలపై కేసు నమోదయ్యింది. అక్టోబర్ నెలలో మొదటిసారిగా సంస్థల నిర్వాహకురాలు నౌహీరా షేక్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఆమె హైదరాబాద్‌లో బెయిల్ పొందినప్పటికే మహారాష్ట్రలో కేసులు ఉండటంతో అక్కడి పోలీసులు అమెను అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని ముంబై, పుణేలలోని పలు పోలీస్‌స్టేషన్లలో నౌహీరా షేక్‌పై కేసులున్నాయి. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ కేసులు నమోదు కావడంతో చిత్తూరు పోలీసులు మూడురోజుల కిందట పీటీ వారెంట్‌పై చిత్తూరుకు తరలించి, కోర్టులో హాజరుపరిచారు. హైదరాబాద్‌లో నౌహీరా పొందిన బెయిల్‌ను హైకోర్టు రద్దు చేయడంతో, నౌహీరా షేక్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేయనున్నారు. పీటీ వారెంట్‌పై ఆమెను చిత్తూర్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు కోర్టు అనుమతి కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. కోర్టు అనుమతితో రెండురోజుల్లో సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశాలున్నాయి. నౌహీరాపై సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోనూ కేసులు నమోదయ్యాయి.

కదిలిస్తే కన్నీరే!

- శోక సంద్రంలో ఆ నాలుగు గ్రామాలు
- మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి
- పుదుక్కొట్టైకి తెలంగాణ ప్రభుత్వ బృందం
- అంబులెన్స్‌లలో స్వస్థలాలకు మృతదేహాలు

మెదక్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణుఘోషలో మునిగి తేలిన ఆ ఇండ్లలో విషాదం అలుముకుంది. ఇరుముడి కట్టుకొని శబరిమల బయల్దేరిన వారు విగతజీవులవటం ఆ నాలుగు గ్రామాలను కలచివేస్తున్నది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని ఖాజీపేట, మంతూర్, చిన్నచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకొన్నాయి. తమిళనాడులోని పుదుకొట్టై సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. వారిలో తొమ్మిది మంది మెదక్ జిల్లా నర్సాపూర్ మండలవాసులే కావటం గమనార్హం. మృతుల వివరాలు తెలియడంతో బంధువులు స్వగ్రామాలకు చేరుకొని ఆ కుటుంబాలను ఓదార్చుతున్నారు. బిడ్డలను కోల్పోయిన తల్లులు, భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన బిడ్డలు దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తుండటం పలువురిని కంటతడి పెట్టిస్తున్నది. ఈ ప్రమాదంలో నర్సాపూర్ మండలం ఖాజీపేట గ్రామానికి చెందిన కర్రె నాగరాజు గౌడ్(36), జుర్రు మహేశ్ (28), బోయిని కుమార్ (22), రెడ్డిపల్లికి చెందిన అంబర్‌పేట్ కిషన్ (40), నక్క అంజనేయులు, చిన్నచింతకుంట గ్రామానికి చెందిన ప్రవీణ్‌గౌడ్(25), సురేశ్(23), మంతూర్ గ్రామానికి చెందిన అయ్యంగారి శ్యాంసుందర్‌గౌడ్ (23) , చీరాల శివప్రసాద్ ,సాయి (వంటమనిషి), బోయిన్‌పల్లికి చెందిన సురేశ్ మృతి చెందారు.

పుదుక్కొట్టై చేరుకున్న ప్రభుత్వ అధికారుల బృందం

ఈ సంఘటనపై సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ స్పందించారు. మృతదేహాలను తీసుకురావడానికి ప్రభుత్వం తరపున తమిళనాడుకు నర్సాపూర్ తహసీల్దార్ భిక్షపతి, సీఐ సైదులు, ఉమ్మడి జిల్లా టీఆర్‌ఎస్ అధ్యక్షుడు మురళీయాదవ్ బయలుదేరి వెళ్లారు. అక్కడి జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్సలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడి నుండి వెళ్ళిన బృందం సోమవారం ఉదయం తమిళనాడులోని ఆసుపత్రికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ ఖాజీపేట గ్రామానికి చెందిన కర్రె నరేశ్‌గౌడ్, దొంతి భూమయ్య, మస్కూరి రాజు, శ్రీశైలం, వెంకటేశ్వర్లను టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మురళీయాదవ్ పరామర్శించారు. 10 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయిందని, వాటిని స్వగృహాలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి మెదక్ జిల్లా టీఆర్‌ఎస్ అధ్యక్షుడు మురళీయాదవ్ 'నమస్తే తెలంగాణ' ప్రతినిధికి ఫోన్‌లో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మృతదేహాలను తీసుకొని ప్రత్యేక అంబులెన్సు బయల్దేరినట్టు మురళీయాదవ్ చెప్పారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న టీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు మురళీయాదవ్, నర్సాపూర్ తహసీల్దార్ భిక్షపతి, సీఐ సైదులు

కేసీఆర్ అన్నట్టు మీరు ఇడియట్సే

- మీ పదవులు ఊడేవరకు నిద్రపోను
- ఉత్తమ్, కుంతియాపై సర్వే సత్యనారాయణ ఫైర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కాంగ్రెస్ నేతలను ఇడియట్స్ చేసిన విమర్శలు సరైనవేనని.. ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీని, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని అఖండ విజయంతో ప్రజలు గెలిపించారని చెప్పారు. ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చూసే కేసీఆర్‌కు ఓట్లేశారని కాంగ్రెస్ బహిష్కృత నేత, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరే 100 బహిరంగసభల ప్రచారానికి తిరిగితే.. పీసీసీ అధ్యక్షుడుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్ని బహిరంగ సభలు పెట్టారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే దమ్ము ఈ నేతలకు లేదని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను నిండాముంచిన పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీరాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా తమ పదవులకు మర్యాదగా రాజీనామా చేయాలని.. లేనిపక్షంలో అవి ఊడేవరకు నిద్రపోనని సర్వే సత్యనారాయణ అన్నారు. సిగ్గు, శరం లేకుండా పార్టీ పదవుల్లో ఎలా కొనసాగుతారుని ప్రశ్నించారు. దారినపోయే దానయ్యకు పదవులిచ్చి వారితో తనలాంటి సీనియర్ నాయకులపై ఉసిగొల్పి గాంధీభవన్‌లో రౌడీయిజం చేస్తున్నారని విమర్శించారు. సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సీనియర్‌నని, తాను ఒక్క పిలుపునిస్తే తెలంగాణ మొత్తం తగులబడుతుందన్నారు. ఉత్తమ్, కుంతియా వందలాది మందితో జంబో కార్యవర్గాన్ని ఏర్పాటుచేసి.. రూ.10 లక్షలకు రాష్ట్రకార్యదర్శి, రూ.20 లక్షలకు ప్రధానకార్యదర్శి పోస్టును అమ్ముకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మల్లు భట్టి విక్రమార్కను ఓడించేందుకు శతవిధాలా ప్రయత్నించారని.. తాను, భట్టి గెలిస్తే సీఎం, సీఎల్పీ పదవులకు ఎక్కడ పోటీ వస్తారోననే భయంతో ఉత్తమ్ పెద్ద కుట్ర చేశారని ఆరోపించారు. పార్టీని ఘోరంగా ఓడించిన నేతలు పార్టీ రివ్యూలు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల్లో భార్యనే గెలిపించుకోలేనివాడు లీడర్ ఎలా అవుతాడని సర్వే ప్రశ్నించారు. అధిష్ఠానం ఇచ్చిన ఫండ్, ఇతరుల వద్ద వసూలు చేసిన నిధులన్నింటినీ ఉత్తమ్, కుంతియా జేబుల్లో దోపుకుని.. పార్టీ అభ్యర్థులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కుంతియా, ఉత్తమ్‌కుమార్‌ల లీలలు ఒక్కొక్కటి వెలుగులోకి తెస్తానని, వారి అవినీతిని బజారుకీడ్చి రచ్చ చేస్తానని శపథం చేశారు. ఏఐసీసీ సభ్యుడినైన తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అధికారం ఇక్కడి కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. తన సస్పెన్షన్‌ను పార్టీ హైకమాండ్ వద్దే తేల్చుకుంటానని, ఉత్తమ్, కుంతియా పదవులు ఊడబీకేవరకు ఉద్యమిస్తానని తెలిపారు.



గ్రామ స్వరాజ్యం

రెండో అనుబంధ జాబితా విడుదల చేయండి

ఈ నెల 1 వరకు నమోదైన ఓటర్లను పరిగణనలోకి తీసుకోవాలి: ఎస్ఈసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాను అనుసరిస్తూ ఈ నెల 1వ తేదీ వరకు నమోదైన ఓటర్లతో రెండో అనుబంధ జాబితాను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ సోమవారం సూచించారు. పంచాయతీ ఎన్నికల మొదటివిడుత నోటిఫికేషన్ సోమవారం విడుదలైందని చెప్పారు. నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడే తుది ఓటరు జాబితాను ప్రకటించాలని స్పష్టంచేశారు. అసెంబ్లీ ఓటరు జాబితాను అనుసరిస్తూ ఇప్పటికే మొదటి సప్లిమెంటరీ జాబితాను ప్రదర్శించామని, ఈ నెల 1 వరకు వచ్చిన కొత్త ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణతో పంచాయతీ ఎన్నికలకు రెండో ఓటరు జాబితాను విడుదల చేస్తున్నామన్నారు. రెండు, మూడు విడుతల్లో జరిగే పంచాయతీలకు ఇంకా సమయం ఉన్నదని, మొదటివిడుత జరిగే ఎన్నికలకు సోమవారమే రెండో అనుబంధ జాబితాను ప్రకటించాలని ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో నోటిఫికేషన్‌తో పాటు తుది జాబితా ఇవ్వలేదని, దీన్ని సీరియస్‌గా పరిగణిస్తామని హెచ్చరించారు.

సోపానం

సర్పంచ్ నుంచి మంత్రి దాకా.. అంచెలంచెలుగా ఎదిగిన లక్ష్మారెడ్డి



పల్లెనే పట్టుగొమ్మగా..

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చిన లక్ష్మారెడ్డి సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా మంత్రి స్థాయి వరకు ఎదిగారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచకు చెందిన లక్ష్మారెడ్డి స్థానికంగా పదోతరగతి పూర్తిచేశారు. వైద్య విద్య అభ్యసించి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న ఆయనకు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం వచ్చింది. లక్ష్మారెడ్డి సర్పంచ్‌గా గెలిస్తే గ్రామ సమస్యలన్నీ తీరుతాయని భావించిన స్థానికులు పోటీలో ఉండాలని ఒత్తిడి చేశారు. 1995లో మొదటిసారి పోటీచేసి సర్పంచ్‌గా విజయం సాధించారు. ఆ రోజుల్లో సర్పంచుల నుంచే మండల ఉపాధ్యక్షుడిని ఎన్నుకునేవారు. దీంతో ఆవంచ నుంచి గెలుపొందిన లక్ష్మారెడ్డికి తిమ్మాజిపేట మండల ఉపాధ్యక్ష పదవి వరించింది. తనదంటూ ప్రత్యేకత చాటుకునేలా పారిశుద్ధ్య నిర్వహణ, అంతర్గత రోడ్ల నిర్మాణం, నీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పించారు. గిరిజనులు ఆలయాల్లోకి ప్రవేశించేలా చేశా రు. జాతర వేడుకల్లోనూ దళితులను భాగస్వాములను చేశారు. తిమ్మాజిపేట సింగిల్‌విండో చైర్మన్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పని చేశారు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో జడ్చర్ల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైనా నిరాశ పడక పట్టుదలగా ముందుకు సాగారు. 2001లో టీఆర్ఎస్‌లో చేరి 2004 ఎన్నికల్లో జడ్చర్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2008లో కేసీఆర్ పిలుపుమేరకు తెలంగాణ కోసం తన పదవికి రాష్ట్రంలోనే మొట్టమొదట రాజీనామా చేసిన ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన లక్ష్మారెడ్డి సీఎం కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లోనూ జడ్చర్ల నుంచి విజయం సాధించారు.

> చిన్న వయస్సులోనే ఆవంచ సర్పంచ్‌గా పనిచేసిన అనుభవాన్ని మరువలేను. గ్రామ ప్రజలు, కుటుంబసభ్యుల ఒత్తిడితో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేసా. సర్పంచ్‌గా గెలిచి మండల ఉపాధ్యక్షునిగా ఎంపిక కావడంతో వెనుదిరగాల్సిన అవసరం లేకపోయింది. జడ్చర్ల నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు నిర్వహించా. నాడు సర్పంచ్‌గా పనిచేయడం నా ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడింది.
>
> - సీ లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్ జిల్లా



సర్పంచ్‌గా వీరస్వామి రికార్డు

42 ఏండ్లపాటు వరుసగా పదవిలో..

2001 నుంచి ఆయన అనుచరులకు అవకాశం

అభివృద్ధిలోనూ తనదైన ముద్ర

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఐదు, పదేండ్లు కాదు.. ఏకంగా 42 ఏండ్లపాటు సర్పంచ్‌గా పనిచేశారు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌కు చెందిన కెంద్యాల వీరస్వామి. తెలుగు రాష్ట్రాల్లో అత్యధికకాలం పనిచేసిన వారిలో ఈయన ఒకరు. 1931 నవంబర్ 28న కెంద్యాల శంకరప్ప, నర్సమ్మ దంపతులకు జన్మించిన వీరస్వామి.. మహబూబ్‌నగర్‌లోని గాంధీరోడ్ హైస్కూల్‌లో ఐదో తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదివారు. 14వ ఏట రజాకార్ల తూటాలకు తండ్రి శంకరప్ప బలవడంతో కుటుంబ బాధ్యతలను తనపై వేసుకొని గ్రామంలోని మరి కొందరు యువకులతో కలిసి ఆర్యసమాజ్ భావాలతో ముందుకు సాగారు. 1959లో మొదటిసారి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మరో తొమ్మిది మందిని వార్డు సభ్యులుగా ఏకగ్రీవం చేసుకొన్నారు. ఆ తర్వాత 1964, 1969, 1974, 1979ల్లో ఏకగ్రీవంగా, 1989, 1994లో జరిగిన ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2001 వరకు వరుసగా 42 ఏండ్లపాటు అమిస్తాపూర్ సర్పంచ్‌గా పనిచేసి గుర్తింపు పొందారు. ఇప్పటికీ గ్రామంలో వీరస్వామి మాటను జవదాటని వారు చాలామంది ఉన్నారు. 1959 నుంచి 1999 వరకు పోలీస్ స్టేషన్‌లో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. రాష్ట్ర, జాతీయ ముఖ్యులతోపాటు కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు గ్రామానికి వస్తే తప్ప పోలీసులు గ్రామానికి వచ్చేవారు కాదు. 1940లో నిర్మించిన ఆర్య సమాజ్‌లో రోజూ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు కొన్నేళ్లపాటు మద్య రహిత గ్రామంగా ముందుకు తీసుకెళ్లారు.

> అందరి సహకారం వల్లే నేను 42 ఏండ్ల పాటు సర్పంచ్‌గా పనిచేయగలిగాను. ఏ చిన్న సమస్య వచ్చినా అందరం కలిసి పరిష్కరించుకునే వాళ్లం. సుదీర్ఘ కాలం సర్పంచ్‌గా పనిచేసే అవకాశం నాకు దక్కినందుకు అదృష్టంగా భావిస్తున్నా. ఇప్పుడు నాకు 88 ఏండ్లు. ఒంటరిగా బయటకు వెళ్లలేను. అయినా గ్రామస్థులు వచ్చి నన్ను తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించుకొంటారు.
>
> - కెంద్యాల వీరస్వామి, మాజీ సర్పంచ్, అమిస్తాపూర్, భూత్పూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

గల్లా పెట్టెలు గలగల!

పంచాయతీల ఖజానాలో కాసుల వర్షం

ఎన్నికల నేపథ్యంలో పన్ను బకాయిలు చెల్లిస్తున్న అభ్యర్థులు

ఇప్పటివరకు రూ.12 కోట్లపైనే వసూలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రామ పంచాయతీల గల్లా పెట్టెలు కాసుల వర్షంతో గలగలలాడుతున్నాయి. కొన్నేండ్లుగా పేరుకుపోయిన బకాయి సొమ్ము మొత్తం ఖజానాకు చేరుతున్నది. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు నో డ్యూస్ సర్టిఫికెట్ సమర్పించాల్సి రావడంతో ఆస్తి, నల్లా పన్నులు రూపాయి బాకీలేకుండా చెల్లిస్తున్నారు. ఎక్కువ మంది ఎన్నికల బరిలో నిలిచేందుకు పోటీ పడుతుండటంతో పన్నులు కూడా అదేస్థాయిలో వసూలవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడుతలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలవడంతో పంచాయతీ బకాయిలు, విద్యుత్ బకాయిలన్నీ పోటీపడి చెల్లిస్తున్నారు.

నాడు బెదిరింపులు.. నేడు అడిగిమరీ చెల్లింపులు

స్థానిక సంస్థలకు ఎలాంటి రకాలైన పన్నులు బాకీ ఉన్నా వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. ఇదే నిబంధనల పంచాయతీలకు వరమైంది. ఇప్పటివరకు పంచాయతీ పన్నులు చెల్లించడంలో గ్రామ నాయకులు తమ పరపతి, పలుకుబడితో ఇంటి, నల్లా, ఆస్తి పన్నులు కట్టకుండా తప్పించుకు తిరిగేవారు. అడిగితే సిబ్బందినే బెదిరించేవారు. మమ్మల్నే పన్నులు చెల్లించమంటారా అంటూ సిబ్బందిపై చిందులేసేవారు. కానీ ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల నిబంధనలు ఇప్పుడు వారిని ఇరుకున పెడుతున్నాయి. ఏండ్లనుంచి బకాయి పడిన పన్నులన్నీ ఇప్పుడు చెల్లిస్తున్నారు. మేం కట్టాల్సిన పన్నులు ఎన్నిఉన్నాయంటూ గ్రామ కార్యదర్శులను అడిగిమరీ చెల్లిస్తున్నారు. ఈసారి పంచాయతీతోపాటు విద్యుత్‌శాఖ నుంచి కూడా నో డ్యూస్ సర్టిఫికెట్ సమర్పించాలని చెప్పున్నారు. దీంతో విద్యుత్ బిల్లులు సైతం పూర్తిగా వసూలవుతున్నాయి. కొంతమంది పాత మీటర్ల బిల్లులు కూడా పూర్తిగా చెల్లిస్తున్నారు.

రోజువారీ పన్నుల వసూళ్లు లక్షల్లో..

ఇక జనరల్ గ్రామ పంచాయతీలు, మేజర్ పంచాయతీల్లో రోజువారీ వసూళ్లు రూ.లక్షల్లో ఉంటున్నాయి. ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్లకు ఎక్కడాలేని డిమాండ్ ఉండటంతో పోటీ రసవత్తరంగా మారింది. మరోవైపు మైనింగ్ వంటివి ఉన్న గ్రామ పంచాయతీలకు డిమాండ్ మరింత పెరిగింది. ఎన్నికల పుణ్యమాని ఇప్పుడు నేతలే గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట బారులు తీరి పేరుకున్న బకాయిలన్నీ క్లియర్ చేస్తున్నారు.

పంచాయతీల ఖజానాకు కోట్లు

వారం రోజులనుంచి పంచాయతీలకు రాబడి మరింత పెరిగింది. సాధారణంగా మేజర్ పంచాయతీల్లో రోజుకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు, మధ్య తరహా పంచాయతీల్లో రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు, చిన్న పంచాయతీల్లో రూ.3 వేల నుంచి రూ.5 వేలవరకు పన్నులు వసూలయ్యేవి. కానీ ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో పంచాయతీల రోజువారీ రాబడి నాలుగింతలు పెరిగింది. ఈ వారం రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో రాబడి రూ.12 కోట్లకు చేరిందని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు చెప్తున్నారు. పంచాయతీల ఖజానాలో ఈ సొమ్ము జమచేస్తున్నారు. ప్రస్తుతం మొదటి విడుత నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఇంకా రెండు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో వచ్చే కొద్దిరోజుల్లో పన్నుల రాబడి భారీగా పెరుగుతుందని భావిస్తున్నారు. ఒక్క ఏడాదిలో వచ్చే ఆదాయం ఈ వారం రోజుల్లోనే నమోదు కానున్నది.

నామినేషన్లు మొదలు

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల్లో ఉన్నత విద్యావంతులు రంగంలోకి దిగుతున్నారు. ఇప్పటివరకు గ్రామాలను పట్టించుకోలేదని, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పంచాయతీరాజ్ చట్టంతో తమ గ్రామాలను తామే అభివృద్ధి చేసుకుందామంటూ విద్యావంతులు పల్లెబాట పట్టారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఇతర ప్రాంతాల్లో ప్రముఖ కంపెనీల్లో లక్షల రూపాయల్లో వేతనాలు తీసుకుంటున్నవారు సైతం పంచాయతీ బరిలోకి దిగుతున్నారు. దీంతో ఆయాప్రాంతాల్లో విద్యావంతులను చూసి ఏకగ్రీవంగా నిలుద్దామని గ్రామస్థాయిలో నేతలు కూడా మద్దతునిస్తున్నారు. ఆయాప్రాంతాల్లో ఏకగ్రీవ తీర్మానాలు కొనసాగుతున్నాయి. అయితే నోటిఫికేషన్ జారీచేసిన తర్వాతే ఏకగ్రీవాల తీర్మానాలను అంగీకరిస్తామని ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి ప్రకటించడంతో.. గతంలో ఏకగ్రీవంగా నిలిచిన గ్రామాలు ఇప్పుడు మరోసారి తీర్మానం చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఇచ్చే రూ. 10 లక్షల నజరానాతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కూడా ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఈ నిధులు గ్రామాభివృద్ధికి అవసరమవుతాయని గ్రామస్థులు అందరూ భావిస్తున్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లానుంచి కూడా ఎక్కువగా ఏకగ్రీవాలు నమోదవుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ నజరానాతోపాటు కేటీఆర్ ప్రత్యేకంగా రూ. 15 లక్షలు ఇస్తామని ప్రకటించిన విషయం విదితమే. తాజాగా, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని కేసీఆర్ తండా పాలకవర్గం ఏకగ్రీవమైంది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఊశన్నపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం దేవుని తండా, ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండా పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం శాంతిగూడెం, పదర మండలం జ్యోతినాయక తండా గ్రామ పంచాయతీల పాలకవర్గాలు ఏకగ్రీవమయ్యాయి. వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలం రాయగూడెం గ్రామ సర్పంచ్‌గా వాంకుడోతు రాజమణి, వనపర్తి జిల్లా ఖిలా ఘనపురం మండలం ఆముదం తండా పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సర్పంచ్‌లకు 3,030.. వార్డులకు 3,827

మొదటి విడుత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే 4,479 గ్రామాలలో సర్పంచ్ స్థానాలకు 3030 నామినేషన్లు దాఖలయ్యాయి. 39,822 వార్డుల్లో 3,827 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో సర్పంచ్ స్థానాలకు అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 284, సిద్దిపేట జిల్లాలో 257, సంగారెడ్డి జిల్లాల్లో 239 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో 25, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 28 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 492, సిద్దిపేటలో 306, నిజామాబాద్‌లో 279 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యల్పంగా ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 23 చొప్పున నామినేషన్లు రాగా, ఆసిఫాబాద్‌లో 26 నామినేషన్లు దాఖలయ్యాయి.



నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు క్రిస్టినా జడ్‌చోంగ్తూ

ఎన్నికల ఏర్పాట్లపై పరిశీలకుల ఆరా

నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటన

ఆర్మూర్, నమస్తే తెలంగాణ/కోయిలకొండ: పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు పరిశీలించారు. సోమవారం వారు నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో పర్యటించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిశీలకురాలు క్రిస్టినా జడ్‌చోంగ్తూ.. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయాన్ని, అంకాపూర్ గ్రామాన్ని సందర్శించారు. మొదట అంకాపూర్‌లోని పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆర్మూర్ డివిజన్‌లో ఈనెల 21న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని క్రిస్టినా జడ్‌చోంగ్తూ సూచించారు. కాగా మహబూబ్‌నగర్ జిల్లా పరిశీలకులు శశిధర్, కలెక్టర్ రొనాల్డ్‌రోస్ కోయిలకొండ మండలంలోని రాంపూర్ గ్రామంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల నిర్వహణను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎక్కువగా ఉన్న బూత్‌లలో పోలింగ్, ఓట్ల లెక్కింపుపై సూచనలు చేశారు. మండలంలో ఎన్నికల ఏర్పాట్లపై వారు సంతృప్తి వ్యక్తంచేశారు. వారి వెంట మహబూబ్‌నగర్ ఆర్డీవో శ్రీనివాస్ ఉన్నారు.



పోలీసులు పట్టుకున్న స్టీల్ బిందెలు

ఎన్నికల్లో పంచేందుకు స్టీల్ బిందెలు

వెల్గటూరు: జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలోని గుల్లకోటలో 265 స్టీల్ బిందెలను పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గుల్లకోటకు చెందిన అమరగొండ సత్యనారాయణ అతడి భార్య శోభను సర్పంచ్‌గా పోటీ చేయించేందుకు సిద్ధమయ్యాడు. గ్రామంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు స్టీల్ బిందెలు పంచుతుండగా గ్రామస్థుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లి 265 స్టీల్ బిందెలను పట్టుకున్నట్టు తెలిపారు. వాటి విలువ రూ.53 వేలు ఉంటుందని పేర్కొన్నారు. అమరగొండ సత్యనారాయణ, అతడి భార్య శోభ, పంగ రాజ్‌కుమార్, పొన్నం సత్తయ్యపై కేసునమోదు చేసినట్టు తెలిపారు.

పంచాయతీ ఎన్నికల సిబ్బందికి సెలవులు లేవు

సంక్రాంతి, గణతంత్ర దినోత్సవంనాడు పనిచేయాల్సిందే: ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సంక్రాంతి, గణతంత్ర దినోత్సవం సెలవులు వర్తించవని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి స్పష్టంచేశారు. ఎన్నికల కోడ్‌ను అమలు చేయడం, అత్యవసర సేవలు అందించాల్సిన పరిస్థితులు ఉండడంతో భోగి, సంక్రాంతి, కనుమ, గణతంత్ర దినోత్సవం రోజు కూడా పనిచేయాల్సిందేనన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందితోపాటు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్స్, సబ్‌కలెక్టర్లు అత్యవసర విధులతోపాటు జనవరి 15, 16 తేదీల్లో రెండోదశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన విజ్ఞప్తులను స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. మొదటిదశకు చెందిన రిటర్నింగ్ అధికారులు అత్యవసర విధులతోపాటు నామినేషన్, విత్‌డ్రా పత్రాలను పరిశీలించాల్సి ఉన్నదని చెప్పారు. కాబట్టి అందరూ సెలవుదినాల్లోనూ డ్యూటీలో ఉండాలని పేర్కొన్నారు.

‘భద్రాద్రి’లో గిరిజనులదే హవా

- **479 పంచాయతీలకు 454 రిజర్వ్‌డ్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామ పంచాయతీ రిజర్వేషన్‌లో గిరిజనులకే ఎక్కువ సంఖ్యలో సర్పంచ్, వార్డు మెంబర్ పదవులు దక్కనున్నాయి. జిల్లాలోని మొత్తం 479 పంచాయతీలకుగాను 454 పంచాయతీలు గిరిజనులకు కేటాయించారు. నాన్‌షెడ్యూల్డ్ ఏరియాలోని 25 స్థానాలకు తొమ్మిది కూడా వీరికే రిజర్వు అయ్యాయి. దాంతో మొత్తం 463 మంది సర్పంచ్‌లు, 4,046 మంది వార్డు మెంబర్లుగా ఎన్నిక కానున్నారు. ‘మా తండాలో మా రాజ్యం’ కల ఇక్కడ నూటికి నూరుపాళ్లు నెరవేరనున్నది. 479 పంచాయతీలకుగాను మహిళలు 232 సర్పంచ్, 2,027 మంది వార్డు మెంబర్లుగా ఎన్నిక కానున్నారు. సీఎం కేసీఆర్ చొరవ వల్లనే మారుమూల గిరిజన మహిళలు తమ ప్రాంతాలను తామే పాలించుకొనే అవకాశం కలిగింది.

అక్కడ రాజీనామా చేస్తేనే.. ఇక్కడ పోటీకి అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీచేయాలనుకొనే వారు.. తాము అనుభవిస్తున్న నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని సంబంధితశాఖల అధికారులు స్పష్టంచేస్తున్నారు. రాష్ట్రంలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో దాదాపు 1.61 లక్షల మందిని రైతు సమన్వయ సమితి సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. వీరిలో చాలా మంది త్వరలో జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఎలాంటి చట్టపరమైన చిక్కులు లేకుండా ఉండేందుకు వ్యవసాయశాఖ స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, సభ్యులు.. పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయడానికి ముం దు విధిగా తమ పదవులకు రాజీనామా చేయాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి సూచించారు. గ్రామస్థాయివారు మండల వ్యవసాయాధికారికి, మండలస్థాయివారు డివిజన్‌లోని వ్యవసాయశాఖ సహాయ అధికారికి, జిల్లా స్థాయివారు వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్‌కు రాజీనామా పత్రాలను అందజేయాలని వ్యవసాయశాఖ పేర్కొన్నది. అలాగే మార్కెట్ కమిటీ పాలకమండళ్ల సభ్యులు కూడా పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయడానికి ముందు తమ పదవులకు రాజీనామా చేయాల్సి ఉంటుంది.

ఆదేశాలు జారీచేసిన వ్యవసాయశాఖ

నమస్తే తెలంగాణ
ఆట
10
[కరీంనగర్]
మంగళవారం 8 జనవరి 2019
WWW.NTNEWS.COM

భారత క్రికెట్ చరిత్రలో మరుపురాని రోజు. ఆటను ప్రాణప్రదంగా భావించే అభిమానికి కలకాలం గుర్తుండిపోయే చిరస్మరణీయ దినం. కోట్లాది మంది అభిమానుల మది ఉప్పొంగిపోయే సందర్భం. తరాలు మారుతున్నా..నాయక గణం మారినా..ఆస్ట్రేలియా గడ్డపై అందని ద్రాక్షగా మారిన టెస్ట్ సిరీస్ విజయం అక్కున చేరిన క్షణం. దిగ్గజాలకు సాధ్యం కాని అనితర సాధ్యమైన రికార్డును కోహ్లీసేన 71 ఏండ్ల తర్వాత కొల్లగొట్టిన వైనం. అడిలైడ్‌లో అదిరిపోయే బోణీతో సుదీర్ఘ సమరాన్ని మొదలుపెట్టిన టీమ్‌ఇండియాకు పెర్త్‌లో అనుకోని పరాభవం. అయినా మడమతిప్పని నైజంతో మెల్‌బోర్న్‌లో మరుపురాని విజయంతో దెబ్బతిన్న బెబ్బులిలా విజృంభించిన సమయం. మాటకు మాట బదులిస్తూ తమదైన ఆటతీరుతో ఆసీస్‌పై అన్నింటా ఆధిపత్యం వహిస్తూ సిరీస్‌లో ఆధిక్యం కొనసాగించిన నేపథ్యం. కంగారూలకు సొంత ఇలాఖాలో చుక్కలు చూపెడుతూ తాము మనస్సు పెట్టి ఆడితే ప్రత్యర్థి ఎవరైనా తమ ముందు బలాదూరే అన్న రీతిలో కసిగా కొట్లాడిన నైజం. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆసీస్ జట్టుకు ముకుతాడు వేస్తూ సిడ్నీ టెస్ట్‌లో వీరవిహారం చేసిన టీమ్‌ఇండియాకు వరుణుడు విలన్‌లా మారిన పరిణామం. మొత్తంగా ప్రతిష్ఠాత్మక బోర్డర్, గవాస్కర్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడిన చిరస్మరణీయ దినం.


కొత్తచరిత్ర లిఖించారు

71 ఏండ్ల సుదీర్ఘ కల సాకారం ■ చరిత్ర సృష్టించిన కోహ్లీసేన
2-1తో ఆసీస్ గడ్డపై తొలి టెస్ట్ సిరీస్ సొంతం ■ డ్రాగా ముగిసిన సిడ్నీ టెస్ట్



ఆస్ట్రేలియాలో తొలిసారిగా టెస్ట్ సిరీస్ గెలిచిన కోహ్లీ జట్టుకు అభినందనలు. టీమ్ ఇండియా ఆల్‌రౌండ్ ప్రతిభ మనల్ని గర్వించేలా చేసింది. ఎల్లప్పుడూ ఇదే స్ఫూర్తిని కొనసాగించండి

- రామ్‌నాథ్ కోవింద్, భారత రాష్ట్రపతి



ఆస్ట్రేలియా గడ్డపై భారత్ కొత్త చరిత్ర సృష్టించింది. టీమ్ ఇండియా అత్యద్భుత పోరాటం వారిని విజయానికి అర్హులుగా మార్చింది. ఈ సిరీస్ మనకు మరిచిపోలేని మధురానుభూతులను బృంద పనితీరును పరిచయం చేసింది. చారిత్రక విజయం సాధించిన కోహ్లీ సేనకు శుభాకాంక్షలు

- నరేంద్రమోదీ, ప్రధానమంత్రి

నా కెరీర్‌లో ఇదే అతి పెద్ద విజయం. 2011 ప్రపంచకప్ సాధించిన సమయంలో నేను చాలా చిన్నవాడిని. నా సహచర సీనియర్లు ఎంతో భావోద్వేగానికి గురవటం చూశాను. కానీ నాకు పెద్దగా ఉద్వేగం కలగలేదు. ఆస్ట్రేలియాలో మూడు పర్యాయాలు పర్యటించిన నాకు ఇక్కడి కఠిన పరిస్థితులు తెలుసు. నేను ఆసీస్ గడ్డపైనే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాను. మార్పు ఇక్కడి నుంచే మొదలైంది. మా ఆటగాళ్లను చూసి గర్విస్తున్నా. విజయంలో భారత పేసర్లు కీలకపాత్ర పోషించారు. ఇక్కడే కాదు గతంలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సిరీస్‌ల్లోనూ వారు బాగా రాణించారు. ఈ విజయం యువజట్టుకు పునాది లాంటిది.

-విరాట్ కోహ్లీ, టీమ్ ఇండియా కెప్టెన్

1 ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి ఆసియా కెప్టెన్ విరాట్ కోహ్లీ.

1 ఒకే ఏడాది దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాపై టెస్ట్ మ్యాచ్‌లు గెలిచిన ఏకైక భారత కెప్టెన్ కోహ్లీ.

7 ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాతో ఆడిన 47 టెస్ట్‌ల్లో భారత్‌కు ఇది ఏడో విజయం.

21 నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో భారత స్పీడ్‌స్టర్ బుమ్రా తీసిన వికెట్లు.

50 ఆసీస్‌తో నాలుగు టెస్ట్‌ల్లో మొత్తం 70 వికెట్లు పడితే అందులో 50 వికెట్లు భారత పేసర్లు పడగొట్టారు.

71 కంగారూల ఇలాఖాలో 71 ఏండ్ల తర్వాత భారత్ టెస్ట్ సిరీస్ విజయాన్నందుకుంది. తొలిసారి 1947-48లో పర్యటించినప్పటి నుంచి భారత్ ఇన్నేండ్లకు గెలిచింది.


79 భారత్‌తో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ అత్యధిక స్కోరు (హ్యారిస్79).

విరుష్క విక్టరీ వాక్



	మ్యాచ్‌లు	వికెట్లు	ఇన్నింగ్స్ బెస్ట్ బౌలింగ్	మ్యాచ్ బెస్ట్ బౌలింగ్	సగటు	ఎకానమీ
బుమ్రా	4	21	6/33	9/86	17.00	2.27
షమీ	4	16	6/56	6/136	26.18	3.06
ఇషాంత్	3	11	4/41	5/86	23.81	2.54

	మ్యాచ్‌లు	ఇన్నింగ్స్	పరుగులు	అత్యధిక స్కోరు	సగటు
పుజార	4	7	521	193	74.72
రిషబ్ పంత్	4	7	350	159*	58.33
కోహ్లీ	4	7	282	123	40.28



స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 300 ఆలౌట్
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్(ఫాలోఆన్): ఖవాజ 4 నాటౌట్ హ్యారిస్ 2 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 0; **మొత్తం:** 4 ఓవర్లలో 6/0; బౌలింగ్: షమీ 2-1-4-0, బుమ్రా 2-1-2-0.

సిడ్నీ: క్రికెట్ బ్రతికున్నంత కాలం ప్రతి అభిమాని మదిలో చెరిగిపోని విజయమిది. గెలుపే గొప్ప అనుకున్న రోజుల నుంచి ఏకంగా సిరీస్‌ను దక్కించుకున్న వైనం ఎంతో ప్రత్యేకమైంది. బలబలాల పరంగా ఆస్ట్రేలియాకు వెయ్యిరెట్లు నయమన్న రీతిలో భారత్ ప్రదర్శించిన ఆత్మవిశ్వాసానికి తగిన ఫలితం దక్కింది. తాము మనస్సు పెట్టి ఆడితే ప్రత్యర్థి ఎవరైనా, వేదిక ఏదైనా తమ ముందు దిగదుడుపే అన్న రీతిలో టీమ్‌ఇండియా పోరాడింది. దీంతో ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తిరిగి మన వశమవ్వడంతో పాటు ఆస్ట్రేలియా గడ్డపై 71 ఏండ్ల తర్వాత 2-1తో టెస్ట్ సిరీస్ విజయం దక్కింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో లాలా అమర్‌నాథ్ నాయకత్వంలో 1947-48 నుంచి మొదలుపెడితే ఇప్పటివరకు ఆడిన సిరీస్‌ల్లో భారత్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. మొత్తంగా 12వ ప్రయత్నంలో భారత్ తమ స్వప్నాన్ని సాకారం చేసుకుంది. నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యం కనబరిచిన టీమ్‌ఇండియాకు ఆఖరిదైన సిడ్నీ టెస్ట్‌లో అనుకున్న ఫలితం దక్కలేదు. మొదటి మూడు రోజుల పూర్తి ఆధిపత్యంతో 31 ఏండ్ల తర్వాత సొంతగడ్డపై ఆస్ట్రేలియాను ఫాలోఆన్‌కు దింపిన కోహ్లీసేనకు వరుణుడు విలన్‌లా పరిణమించాడు. ఐదో రోజు(సోమవారం) విరామం లేని వర్షంతో మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. దీంతో ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. మూడు సెంచరీల సహాయంతో 521 పరుగులు చేసిన చతేశ్వర్ పుజారకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' తో పాటు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ ఈనెల 12న సిడ్నీలో మొదలవుతుంది.

అడిలైడ్‌లో అదిరిపోయే బోణీ:
నాలుగు టెస్ట్‌ల సమరంలో భారత్‌కు అడిలైడ్‌లో అదిరిపోయే బోణీ దక్కింది. 31 పరుగులతో విజయం సాధించి సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్‌ఇండియా..పుజార(123) సూపర్ సెంచరీతో తొలి ఇన్నింగ్స్‌లో 250 పరుగులు చేసింది. హాజిల్‌వుడ్ మూడు వికెట్లు దక్కగా స్టార్క్, కమ్మిన్స్, లియాన్‌కు రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత భారత బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో ఆసీస్ 235 పరుగులకు ఆలౌటైంది. ట్రావిస్ హెడ్(72) తప్పా అందరూ విఫలమయ్యారు. పుజార(71), రహానే(70) అర్ధసెంచరీలతో 307 పరుగులు చేసిన టీమ్‌ఇండియా..ఆసీస్‌కు 323 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. బుమ్రా, అశ్విన్, షమీ మూడేసి వికెట్ల ప్రదర్శనతో ఆసీస్ 291 పరుగులకు ఆలౌటైంది.

పెర్త్‌లో పరాజయం:
అడిలైడ్‌లో దక్కిన విజయంతో పెర్త్ బరిలోకి దిగిన భారత్ 146 పరుగులతో ఓటమిపాలైంది. అడిలైడ్ ఓటమికి ఆసీస్ పెర్త్‌లో ప్రతీకారం తీర్చుకున్నది. ప్రపంచంలోనే వేగవంతమైన పిచ్‌గా పేరుగాంచిన పెర్త్‌లో ఆసీస్ పేస్ బౌలింగ్ ధాటికి టీమ్‌ఇండియా బ్యాటింగ్ కుదేలైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లీ(123) మినహా టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయారు.

మెల్‌బోర్న్‌లో '150':
మెల్‌బోర్న్‌లో భారత్ తమ టెస్ట్ క్రికెట్ చరిత్రలో 150వ విజయాన్నందుకుంది. 137 పరుగులతో ఆసీస్‌పై గెలిచిన భారత్ సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. పుజార(106) సెంచరీకి తోడు కోహ్లీ(82), మయాంక్ అగర్వాల్(76), రోహిత్‌శర్మ(63 నాటౌట్) అర్ధసెంచరీలతో తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 443/7 డిక్లేర్ చేసింది. కమ్మిన్స్(3/72) మూడు వికెట్లు తీశాడు. బుమ్రా(6/33) సూపర్ ప్రదర్శనతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 151 పరుగులకు కుప్పకూలింది. భారత్ నిర్దేశించిన 399 పరుగుల లక్ష్య ఛేదనలో కంగారూలు..బుమ్రా(3/53), జడేజా (3/82) ధాటికి 261 పరుగులకు ఆలౌటయ్యారు. కమ్మిన్స్(63) మినహా అందరూ విఫలమయ్యారు.

'సిడ్నీ' వరుణుడి వశం:
ఆఖరి టెస్ట్‌ను ఎలాగైనా దక్కించుకోవాలన్న పట్టుదలతో బరిలోకి దిగిన భారత్‌కు సిడ్నీలో నిరాశే ఎదురైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్..పుజార(193), రిషబ్ పంత్(159 నాటౌట్) సూపర్ సెంచరీలతో 622/7 డిక్లేర్ చేసింది. లియాన్(4/178)కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత చైనామన్ కుల్దీప్ యాదవ్(5/99) ధాటికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ కోహ్లీ ఫాలోఆన్‌కు దించడంతో వరుణుడు అంతరాయంతో రెండో ఇన్నింగ్స్‌లో 6/0కు పరిమితమైంది. మొత్తంగా నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో భారత్ నంబర్‌వన్ హోదాకు తగ్గట్లు ఆడి తమకు తిరుగులేదని ఘనంగా చాటింది.

గెలుపు మంత్రమిదే!



నమస్తే తెలంగాణ, క్రీడా విభాగం

ఏడు దశాబ్దాలుగా ఆసీస్‌లో పర్యటిస్తున్నా.. 11 పర్యాయాలు టెస్ట్ సిరీస్‌లో తలపడినా.. కంగారూగడ్డపై టెస్ట్ సిరీస్ విజయం చిక్కలేదు..విదేశీగడ్డపై విజయాలు..ప్రపంచకప్ విజయాలు..టెస్ట్, వన్డే ర్యాంకింగ్స్‌ల్లో ప్రపంచ నంబర్‌వన్ హోదా దక్కినా.. వన్డే, టీ20 ప్రపంచకప్ చాంపియన్లుగా నిలిచినా.. గంగూలీ..ధోనీ లాంటి విజయసారథులు ప్రయత్నించినా.. కంగారూ గడ్డపై టెస్ట్ సిరీస్ విజయం మాత్రం అందకుండా ఊరిస్తూనే ఉంది..సచిన్ లాంటి మేటి ఆటగాడు.. భారత బ్యాటింగ్ గోడ ద్రవిడ్.. వెరీవెరీ స్పెషల్ లక్ష్మణ్ నుంచి పాతతరం ఆటగాళ్లు పటౌడీ.. అజిత్ వాడేకర్.. సునీల్ గవాస్కర్.. కపిల్ దేవ్ ఎంతో అతిరథ మహారథులకు సైతం అందని ద్రాక్షగా మిగిలింది..
టీమ్ ఇండియా టెస్ట్‌ల్లో ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచినా... సొంతగడ్డపై వరుసగా విజయాలు సాధించినా.. ఆసియా పిచ్‌లపై చెలరేగినా..2018 ఏడాదిలో వరుసగా దక్షిణాఫ్రికా..ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ ఓడింది.. ఫాస్ట్ పిచ్‌లపై మన బ్యాట్స్‌మెన్ సైతం తేలిపోయారు.. జట్టులో ఉద్దండులు కనిపిస్తున్నా ..కాస్త ఒత్తిడితోనే పన్నెండో ఆసీస్ పర్యటనకు కోహ్లీ సేన కోటి ఆశలతో బయలుదేరింది..ఒకవైపు స్మిత్, వార్నర్ లేకుండా బ్యాటింగ్‌లో కంగారూ జట్టు బలహీనంగా కనిపిస్తున్నా.. మరోవైపు హేజిల్‌వుడ్, కమ్మిన్స్, మిచెల్ స్టార్క్‌లాంటి స్టార్ పేసర్లకు టీమ్ ఇండియా బ్యాట్స్‌మెన్ ఎదురు నిలవగలరా అన్న సందేహం.. వెరసి ఎన్నో అనుమానాలు..మరెన్నో బలహీనతలతో కోహ్లీ సేన ఆసీస్‌లో అడుగుపెట్టింది..
మాటల యుద్ధంతో మొదలైన టెస్ట్ సిరీస్‌లో కోహ్లీ సేనదే ఆధిపత్యం..అడిలైడ్‌లో జరిగిన తొలిటెస్ట్‌లో భారత్ ఉత్కంఠ విజయంతో కోహ్లీ సేన చారిత్రక విజయంపై భరోసాను పెంచింది.. పెర్త్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో మాత్రం అనూహ్యంగా ఆస్ట్రేలియా జట్టు విజయంతో సిరీస్ మళ్లీ 1-1తో సమం కాగా.. మెల్‌బోర్న్‌లో అరంగేట్ర ఓపెనర్ మయాంక్ అగర్వాల్, పుజార, కోహ్లీ అద్భుత బ్యాటింగ్‌కు తోడుగా.. జస్ప్రీత్ బుమ్రా ,షమీ, ఇషాంత్ వేగానికి కంగారూలు కుప్ప కూలడంతో మళ్లీ 2-1 ఆధిక్యం దక్కింది.. పెరిగిన ఆత్మవిశ్వాసంతో చివరి టెస్ట్‌లోనూ బరిలోకి దిగిన భారత్‌కు మళ్లీ మయాంక్.. పుజార..రిషబ్..జడేజా చెలరేగడంతో సిడ్నీలో జరిగిన చివరిటెస్ట్‌లోనూ ఆధిపత్యం చాటింది. వర్షం కారణంగా ఆసీస్ ఓటమి తప్పించుకున్నా మ్యాచ్ డ్రాగా ముగియడంతో 2-1 తేడాతో భారత్ సిరీస్ విజేతగా నిలిచింది..
అసాధ్యం సుసాధ్యమైంది.. ఆస్ట్రేలియా గడ్డపై అందకుండా ఊరిస్తున్న టెస్ట్ సిరీస్ విజయం చేజిక్కింది.. మహామహులకు సాధ్యం కానిది..మేటి కెప్టెన్‌లంతా అందుకోలేనిది.. దిగ్గజ క్రికెటర్లకు దక్కనిది..కలలో కూడా ఊహించని చారిత్రక విజయం కోహ్లీ సేన చేతికందింది. పుజార, కోహ్లీ,పంత్, మయాంక్ బ్యాటింగ్‌లో పరుగుల వరద పారించగా.. ఇషాంత్,జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ పదునైన పేస్‌తో కంగారు గడ్డపై ఎన్నేండ్లుగానో ఊరిస్తున్న గెలుపు దక్కింది..

	టెస్ట్‌సిరీస్	సిరీస్ ఫలితం
5 టెస్ట్‌ల సిరీస్	(1947-48)	0-4 (భారత్ ఓటమి)
4 టెస్ట్‌ల సిరీస్	(1967-68)	0-4 (భారత్ ఓటమి)
4 టెస్ట్‌ల సిరీస్	(1977-78)	2-3 (భారత్ ఓటమి)
3 టెస్ట్‌ల సిరీస్	(1980-81)	1-1(సిరీస్ డ్రా)
3 టెస్ట్‌ల సిరీస్	(1985-86)	0-0(సిరీస్ డ్రా)
5 టెస్ట్‌ల సిరీస్	(1991-92)	0-4 (భారత్ ఓటమి)
3 టెస్ట్‌ల సిరీస్	(1999-00)	0-3 (భారత్ ఓటమి)
4 టెస్ట్‌ల సిరీస్	(2003-04)	1-1(సిరీస్ డ్రా)
4 టెస్ట్‌ల సిరీస్	(2007-08)	1-2(భారత్ ఓటమి)
4 టెస్ట్‌ల సిరీస్	(2011-12)	0-4 (భారత్ ఓటమి)
4 టెస్ట్‌ల సిరీస్	(2014-15)	0-2(భారత్ ఓటమి)
4 టెస్ట్‌ల సిరీస్	(2018-2019)	2-1(భారత్ విజయం)

మన పేసర్లు భళా..
స్పిన్నర్లే మ్యాచ్ విన్నర్లు.. భారత విజయాల్లో సింహభాగం స్పిన్నర్ల చలవతోనే కావడంతో ఈ నానుడి బాగా స్థిరపడింది. ఇప్పుడు మాత్రం ఆసీస్ గడ్డపై భారత పేసర్లు చరిత్రను తిరగరాశారు. ఇషాంత్, షమీ, బుమ్రాలతో కూడిన భారత పేస్ బౌలింగ్ ప్రపంచంలోనే అత్యుత్తమం అంటూ అందరూ కొనియాడుతున్నారు. కంగారూ గడ్డపై భారత్ తొలి సిరీస్ విజయం పేసర్ల చలవతోనే వచ్చిందని, ప్రపంచంలో అత్యంత పటిష్ఠమైన పేస్ బౌలింగ్ టీమ్ ఇండియాదేనని ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్ అన్నాడంటే జట్టు విజయంలో వీరి పాత్ర ఏంటో తెలుస్తుంది. అంతేకాదు భారత పేస్ బౌలింగ్ దిగ్గజాలతోపాటు మాజీ ఆటగాళ్లంతా పేసర్లను ఆకాశానికెత్తుతున్నారు. భారత్ విజయాలు సాధించిన అడిలైడ్, మెల్‌బోర్న్ మ్యాచ్‌లతోపాటు పెర్త్, సిడ్నీ టెస్ట్‌ల్లోనూ ఆసీస్ బ్యాటింగ్‌ను కుదురుకోకుండా చేసి కీలక సమయంలో వికెట్లను తీస్తూ బ్యాటింగ్ పతనాన్ని శాసించారు. విచిత్రమైన బౌలింగ్ యాక్షన్‌తో 150 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధిస్తూనే స్లో యార్కర్లతో బుమ్రా ఆకట్టుకోగా.. రివర్స్ స్వింగ్‌తో మహ్మద్ షమీ వికెట్ల పంట పండించాడు. మూడు టెస్ట్‌లాడిన ఇషాంత్ కూడా అద్భుత ప్రతిభ చూపెడుతూ ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను బౌన్సర్లతో బెంబేలెత్తించాడు. తొలిటెస్ట్ అనంతరం జట్టు ప్రధాన స్పిన్నర్ అశ్విన్ గాయంతో తప్పుకున్నా.. బౌలింగ్‌లో లోటు కనబడలేదంటే అది మన పేసర్ల ఘనతే.



కరిగిన ప్రారంభ లాభాలు

గరిష్ఠ స్థాయిల్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 155 - నిఫ్టీ 44 పాయింట్ల లాభం



సెన్సెక్స్ వరుసగా రెండో రోజున కూడా లాభాలతో ముగిసింది. అయితే మంచి లాభాలతో ప్రారంభం అయినప్పటికీ ఆ లాభాలను నిలబెట్టుకోలేకపోయింది. నిఫ్టీ 10,800 స్థాయికి ఎగువన నిలదొక్కుకోలేకపోయింది. ఆసియా మార్కెట్లుసహా ఎస్‌జీఎక్స్ నిఫ్టీ లాభాల్లో ట్రేడ్ అవడంతో మన మార్కెట్లు కూడా భారీ లాభాలతోనే ప్రారంభం అయ్యాయి. సెన్సెక్స్ దాదాపు మూడు వందల పాయింట్ల లాభంతోనూ, నిఫ్టీ వంద పాయింట్ల లాభంతో ఒక దశలో ట్రేడ్ అయ్యాయి. అయితే మధ్యాహ్నం తర్వాత రెండు రోజుల లాభాలను స్వీకరించడానికి ఇన్వెస్టర్లు మొగ్గు చూపడంతో సూచీలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకులు, మెటల్ షేర్లలో నష్టాలు సూచీలపై ప్రభావాన్ని చూపాయి. చివరికి సెన్సెక్స్ 155.06 పాయింట్ల లాభానికి పరిమితమై 35,850.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 44.40 పాయింట్ల లాభంతో 10,771.80 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలు లాభాల్లో ముగిసినా మార్కెట్ బ్రెడ్త్ మాత్రం నెగటివ్‌గా ఉంది. బీఎస్‌ఈలో 1,310 షేర్లు నష్టపోగా, 1,292 షేర్లు లాభాలతో ముగిశాయి. నిర్మాణంలో ఉన్న ఫ్లాట్లకు, ఇండ్లకు జీఎస్టీ రేటు తగ్గించనున్నారన్న వార్తలతో రియల్ ఎస్టేట్ షేర్లు వెలుగులో ఉన్నాయి. రిజర్వ్‌బ్యాంక్ రూ.40 వేల కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను ప్రభుత్వానికి చెల్లించనుందన్న వార్తలకుతోడు లిక్విడిటీ మెరుగుపడిందన్న సంకేతాలు కూడా మార్కెట్ సెంటిమెంట్ పెంచాయి. అమెరికా, చైనా ప్రతినిధులు వాణిజ్య యుద్ధానికి సంబంధించి చర్చలు ప్రారంభించడంతో కూడా కొంతవరకు సానుకూల వాతావరణం ఏర్పడింది. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌ను లాభాల్లో ముగిసేలా చేశాయి. రియల్టీ ఇండెక్స్ 1.34 శాతం, ఐటీ ఇండెక్స్ 1.03 శాతం, ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ 0.58 శాతం, ఎఫ్‌ఎంసీజీ 0.31 శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.40 శాతం చొప్పున లాభపడ్డాయి. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.12 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.09 శాతం లాభంతో ముగిశాయి. కానీ, ఫార్మా ఇండెక్స్ 0.63 శాతం, పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.51 శాతం, మెటల్ ఇండెక్స్ 0.15 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలోని యాక్సిస్ బ్యాంక్ 2.87 శాతం, ఇన్‌ఫ్రాటెల్ 2.72 శాతం, టాటా మోటార్స్ 2.52 శాతం, గ్రాసిం 1.97 శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా, ఇండియా బుల్స్ హౌజింగ్ ఫైనాన్స్ 4.92 శాతం నష్టపోతే, బజాజ్ ఆటో 3 శాతం, యెస్ బ్యాంక్ 1.63 శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.54 శాతం చొప్పున నష్టపోయాయి. ఎఫ్ఐఐలు రూ. 736.18 కోట్ల కొనుగోళ్లు జరుపగా, డీఐఐలు రూ. 141. 97 కోట్ల అమ్మకాలు జరిపారు. ఎన్ఎస్ఈలో ఏడు షేర్లు కొత్త 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేస్తే.. 58 షేర్లు 52 వారాల కనీస స్థాయిని నమోదు చేశాయి.

జీఎస్టీ రాబడిలో తెలంగాణ భేష్

సోమేష్ కుమార్‌తో టీఎన్జీవో సంఘం అధ్యక్షుడు కారెం రవీందర్ రెడ్డి భేటీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీఎస్టీ రాబడిలో రాష్ట్రం మంచి ఫలితాలు సాధిస్తున్నదని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి అన్నారు. దేశంలోనే అత్యధిక వృద్ధి రేటు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కీలకంగా పని చేస్తున్నారన్నారు. జీఎస్టీ కమిషనర్ సోమేష్ కుమార్‌తో టీఎన్జీవో నేతలు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తెలిపారు. జీఎస్టీ వసూళ్లలో మంచి ఫలితాలు సాధిస్తున్న జీఎస్టీ కమిషనర్ సోమేష్ కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, కొండల్ రెడ్డి, శ్రీకాంత్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.


ఖజానాకు ఆర్బీఐ నిధులు

కేంద్రానికి మధ్యంతర డివిడెండ్‌గా రూ.40 వేల కోట్లు? ■ త్వరలో నిర్ణయం తీసుకోనున్న గవర్నర్ దాస్

న్యూఢిల్లీ, జనవరి 7: కేంద్ర ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్‌పై నిర్ణయం తీసుకుంటామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) ప్రతినిధులతో సమావేశం అనంతరం ఆయన ఇక్కడ విలేఖరులతో మాట్లాడారు. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) ప్రతినిధులతోనూ మంగళవారం ముంబైలో సమావేశం కానున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే ప్రభుత్వానికిచ్చే మధ్యంతర డివిడెండ్‌పై సమీక్ష జరిగాక ఓ ప్రకటన చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో తుది నిర్ణయం ఆర్బీఐదేనన్న సంకేతాలను కూడా ఇచ్చారు. కాగా, కేంద్రానికి రూ.40,000 కోట్ల మధ్యంతర డివిడెండ్ ఇచ్చే వీలుందని, మార్చిలోగా చెల్లించే అవకాశాలూ ఉన్నాయని బ్యాంకింగ్ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) జీడీపీలో ద్రవ్యలోటును 3.3 శాతానికి కట్టడి చేయడంలో భాగంగా ఆర్బీఐ నుంచి మధ్యంతర డివిడెండ్‌ను కోరుతామని ఇప్పటికే కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గత నెల డిసెంబర్‌లో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వెల్లడించిన సంగతీ విదితమే. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కోతలు, సంక్షేమ పథకాలకు నిధులు, ప్రభుత్వ ఖర్చుల మధ్య ద్రవ్యలోటు లక్ష్యాలు దెబ్బతినే పరిస్థితులు ఉండటంతో మోదీ సర్కారు అప్రమత్తమవుతున్నది. ఇందులో భాగంగానే ఆర్బీఐ నుంచి వీలైనంత ఎక్కువగా రాబట్టుకోవాలని చూస్తున్నది. జూలై-జూన్ వ్యవధిని ఆర్థిక సంవత్సరంగా ఆర్బీఐ పరిగణిస్తుంది. గత ఆర్థిక సంవత్సరం (2017-18)లోనూ ఆర్బీఐ.. కేంద్రానికి రూ.10,000 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను ఇచ్చింది. మొత్తంగా రూ.50,000 కోట్ల డివిడెండ్‌ను సమర్పించింది. కాగా, బడ్జెట్ అంచనా ప్రకారం ఆర్బీఐ మిగులు నగదు నిల్వలు, జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి ఈ ఆర్థిక సంవత్సరం (2018-19) రూ.54,817.25 కోట్లను డివిడెండ్‌గా అందుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ ఇప్పటిదాకా రూ.40,000 కోట్లనే పొందింది. మొత్తానికి ఆర్బీఐ మిగులు నగదు నిల్వలపై కేంద్రంతో విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఊర్జిత్ పటేల్ స్థానంలో గవర్నర్‌గా వచ్చిన దాస్ ఏ నిర్ణయం తీసుకుంటారు? అన్నదానిపై సర్వత్రా ఇప్పుడు ఆసక్తి నెలకొన్నది. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందే మధ్యంతర డివిడెండ్‌పై ఆర్బీఐ నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి.

నగదు కొరత లేదు: దాస్

వ్యవస్థలో ప్రస్తుతం నగదు కొరత ఏదీ లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ద్రవ్య కొరత సమస్యలు ఉంటే తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మార్కెట్‌లో నగదు లభ్యత అంశాన్ని రోజూ గమనిస్తున్నామన్న ఆయన కొరత ఉందనిపిస్తే తగినంత మొత్తంలో నగదు నిల్వలను వ్యవస్థలోకి పంపుతామని హామీ ఇచ్చారు. అయితే పరిమితికి మించి నగదు లభ్యత ఉన్నా ఇబ్బందులు తప్పవన్న దాస్.. అన్ని కోణాల్లో సమీక్షించుకున్నాకే నిర్ణయాలు ఉంటాయని తేల్చి చెప్పారు. ఇప్పటికే బహిరంగ మార్కెట్ కార్యకలాపాల (ఓఎంవో) ద్వారా వ్యవస్థలోకి అదనంగా రూ.60,000 కోట్ల నిధులను పంపుతామని ఆర్బీఐ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎంఎస్ఎంఈల ఆర్థిక ఇబ్బందులకు ప్రాధాన్యత ఇస్తామన్న ఆయన ఎన్‌బీఎఫ్‌సీల సమస్యలపైనా చర్చించనున్నట్లు తెలిపారు. వ్యాపార, పారిశ్రామిక సంఘాలైన సీఐఐ, అసోచాం కూడా తాజా సమావేశాల్లో పాల్గొన్నాయి.



ఎన్‌పీఏలు తగ్గుతున్నాయ్



బ్యాంకింగ్ రంగాన్ని, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్న మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) తగ్గుముఖం పడుతున్నాయని దాస్ తెలిపారు. ఈ క్రమంలోనే ఎన్‌పీఏల సమస్యపై బ్యాంకుల పోరాటంపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలూ దోహదం చేశాయన్నారు. గతేడాది మార్చి ఆఖరు నాటికి రూ.9.62 లక్షల కోట్లుగా ఉన్న ఎన్‌పీఏలు ఇప్పటిదాకా రూ.23,000 కోట్లు తగ్గాయని గుర్తుచేశారు. నిరుడు సెప్టెంబర్‌లో 10.8 శాతంగా ఉన్న స్థూల ఎన్‌పీఏ నిష్పత్తి.. ఈ మార్చికల్లా 10.3 శాతానికి తగ్గవచ్చని అంచనా వేశారు. ఇక బ్యాంకింగ్ రంగంలో పాలనాపరమైన సంస్కరణల దిశగా కూడా అడుగులు వేస్తున్నట్లు దాస్ చెప్పారు.

వ్యవసాయ రుణాల రద్దుపై..

రాజకీయ ప్రయోజనాలు, ఎన్నికల దృష్ట్యా వ్యవసాయ రుణాల రద్దును అనివార్యంగా మార్చడం తగదని దాస్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్న ఆయన అనవసరంగా రుణాల రద్దుతో ఇబ్బందులేనని, దీనివల్ల రుణగ్రహీతల వైఖరిలో మార్పు రావచ్చని అన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించే స్థోమత ఉన్నా.. ప్రభుత్వం రద్దు చేస్తుందిలే అని చెల్లించరని వ్యాఖ్యానించారు. దీనివల్ల అటు బ్యాంకులకు, ఇటు ప్రభుత్వానికి ముఖ్యంగా ఖజానాపై భారం పడుతుందన్నారు. ఇటీవల జరిగిన ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రైతు రుణ మాఫీ ప్రకటనలు పెద్ద ఎత్తున వచ్చిన నేపథ్యంలో దాస్ ఈ మేరకు స్పందించారు.

అనిల్ అంబానీకి ధిక్కార నోటీసు

ఎరిక్సన్ బకాయిల కేసులో జారీ చేసిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ, జనవరి 7: రిలయన్స్ కమ్యూనికేషన్ లిమిటెడ్ (ఆర్‌కామ్) చైర్మన్ అనిల్ ధీరూభాయ్ అంబానీకి సుప్రీం కోర్టు సోమవారం కోర్టు ధిక్కార నోటీసును జారీ చేసింది. ఎరిక్సన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటీషన్ విచారణలో భాగంగా అనిల్ అంబానీతోపాటు మరికొందరికీ అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. ఆర్‌కామ్ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన నేపథ్యంలో సంస్థ ఆస్తులను అన్న ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియోకు అనిల్ అమ్ముకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆస్తులను విక్రయించుకుంటున్నా.. తమకు ఇవ్వాల్సిన రూ.550 కోట్ల బకాయిలను మాత్రం తీర్చడం లేదని ఎరిక్సన్ ఆరోపిస్తూ సుప్రీంను ఆశ్రయించిన సంగతీ విదితమే. గతేడాది ఆగస్టు 3 నాటి ఆదేశాలను బేఖాతరు చేసిన నేపథ్యంలో అక్టోబర్ 23న డిసెంబర్ 15లోగా మొత్తం బకాయిలను చెల్లించాలని ఆర్‌కామ్‌ను సుప్రీం ఆదేశించింది. ఇదే చివరి అవకాశంగా పేర్కొన్న సుప్రీం.. గడువులోగా చెల్లించనిపక్షంలో 12 శాతం వార్షిక వడ్డీరేటు పడుతుందని కూడా హెచ్చరించింది. అలాగే ఆర్‌కామ్ విఫలమైతే ఈ వ్యవహారంపై ధిక్కార పిటీషన్‌ను ఎరిక్సన్ దాఖలు చేసుకోవచ్చనీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ఆర్‌కామ్ చెల్లింపులు జరుపకపోవడంతో ధిక్కార చర్యలకు సుప్రీంను ఎరిక్సన్ కోరగా, అనిల్‌తోపాటు మరో ఇద్దరికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ అయ్యాయి. ఆర్ఎఫ్ నారీమన్, వినీత్ శరణ్‌లతో కూడిన ధర్మాసనం దీనిపై అనిల్ అంబానీ, మరికొందరి నుంచి నాలుగు వారాల్లో స్పందనను కోరింది. ఇదే సమయంలో ఈ కేసు విచారణను ఐదు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఆర్‌కామ్ తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహ్తగీలు వాదిస్తుండగా, స్వీడన్ కంపెనీ ఎరిక్సన్ తరపున మరో సీనియర్ న్యాయవాది దుశ్యంత్ దవే వాదనలు వినిపిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆర్‌కామ్ టెలికం నెట్‌వర్క్ నిర్వహణ కోసం 2014లో ఎరిక్సన్ ఇండియా ఏడేండ్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్నది.

జీడీపీ 7.2 శాతం : సీఎస్‌వో

న్యూఢిల్లీ, జనవరి 7: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ 7.2 శాతంగా నమోదు కావచ్చునని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం జీడీపీ 6.7 శాతంగా నమోదైంది. వ్యవసాయం, తయారీ రంగాల్లో నమోదవుతున్న వృద్ధి రేటును బట్టి ఈ ఏడాది వృద్ధి రేటును అంచనా వేస్తున్నట్టు తెలిపింది. అయితే రిజర్వ్ బ్యాంక్ అంచనా వేసిన 7.4 శాతం వృద్ధి రేటు కన్నా సీఎస్‌వో అంచనాలు తక్కువగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వాస్తవ జీవీఏ రేటు 6.5 శాతం నుంచి 7.1 శాతానికి పెరుగుతుందని అంచనా వేసిన సీఎస్‌వో.. వ్యవసాయం, అటవీ, ఫిషరీ రంగాల వృద్ధి 3.4 శాతం నుంచి 3.6 శాతానికి పెరుగుతున్నట్టు పేర్కొన్నది. అలాగే తయారీ రంగ వృద్ధి రేటు 5.7 శాతం నుంచి 8.3 శాతానికి, మైనింగ్, క్వారీ రంగాల వృద్ధి 2.9 శాతం నుంచి 0.8 శాతానికి క్షీణిస్తుందన్నది. తలసరి ఆదాయం 11.1 శాతం పెరుగుతుందన్నది.

ప్రత్యక్ష పన్నులు రూ. 8.74 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 7: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో మొత్తం ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 14.1 శాతం వృద్ధితో రూ. 8.74 లక్షల కోట్లు వసూలైనట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. రూ. 1.30 లక్షల కోట్ల రిఫండ్లను అందచేసినట్టు వెల్లడించింది. గత ఏడాదితో పోల్చితే రిఫండ్‌లు 17 శాతం పెరిగాయన్నది. రూ. 3.64 లక్షల కోట్లు అడ్వాన్స్ ట్యాక్స్ రూపేణా వసూలైనట్టు వివరించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 14.5 శాతం ఎక్కువ. రిఫండ్లు పోగా నికరంగా రూ. 7.43 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలయ్యాయని, ఇవి గత ఏడాది కన్నా 13.6 శాతం ఎక్కువని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో 64.7 లక్ష్యాన్ని చేరుకున్నట్టు తెలిపింది. పూర్తి సంవత్సరానికి మొత్తం రూ. 11.50 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నుల వసూళ్లను బడ్జెట్‌లో అంచనా వేశారు.

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ రాజీనామా



వాషింగ్టన్, జనవరి 7: ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ రాజీనామా చేశారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పదవి నుంచి తప్పుకుంటున్నట్టు ఆయన ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఆయన పదవీ కాలం 2022లో ముగియనుంది. అయితే మూడేండ్లు ముందుగానే రాజీనామా చేయడం వెనుక కారణాలు వెల్లడి కాలేదు. ప్రపంచ బ్యాంకు సీఈవో క్రిస్టాలినా జార్జియేవా బ్యాంకు తాత్కాలిక అధ్యక్షురాలిగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి బాధ్యతలను స్వీకరించనున్నారు.

నవయుగ గిన్నిస్ రికార్డు

పోలవరం ప్రాజెక్టులో 24 గంటల్లో 32,100 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు

పోలవరం, జనవరి 7: నిర్మాణ, మౌలిక రంగ దిగ్గజం నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఈసీఎల్) అరుదైన రికార్డును సృష్టించింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టులో కనీవినీ ఎరుగనిరీతిలో కాంక్రీట్ పనులు చేపట్టింది. డ్యాం నిర్మాణంలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల్లో మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 32,100 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తిచేసి ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ కాంక్రీట్ పనులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాయి. గిన్నిస్ అధికారుల సమక్షంలో జరిగిన ఈ పనుల్లో పదుల సంఖ్యలో భారీ కాంక్రీట్ మిక్సింగ్ ట్రక్కులు, వందలాది కార్మికులు పాల్గొన్నారు. నిజానికి పోలవరం వంటి సాగునీటి ప్రాజెక్టు కాంక్రీట్ పనులకు సాధారణంగా దాదాపు మూడేండ్ల సమయం పడుతుందని, అయితే రికార్డు స్థాయి పనులతో తాము దూసుకెళ్తున్నందున జూన్‌కల్లా పూర్తికానున్నాయని నవయుగ ఎండీ చింతా శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రాజెక్టు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ విఫలం కావడంతో నవయుగ చేతికి ప్రాజెక్టు వెళ్లింది. ఈ ప్రాజెక్టు మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 1,20,000 మిలియన్ క్యూబిక్ అడుగులు. ప్రపంచంలోనే మరెక్కడా లేనట్లుగా గరిష్ఠ స్థాయిలో 50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు ఈ ప్రాజెక్టు విడుదల చేయగలదు. ఇక ఈ బహుళార్థసాధక ప్రాజెక్టు నుంచి 2020 ఆఖరుకల్లా 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి కాగలదన్న అంచనాలున్నట్లు శ్రీధర్ ఈ సందర్భంగా తెలిపారు.

'రెరా' పరిధిలోకి ప్రభుత్వ విభాగాలు

తెలంగాణ నిర్మాణ సంఘాల విన్నపం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రియల్ ఎస్టేట్ రంగంతో సంబంధమున్న ప్రభుత్వ విభాగాల్ని 'రెరా' పరిధిలోకి తేవాలనీ, అందువల్ల రాష్ట్ర నిర్మాణ రంగంలో మరింత పారదర్శకత నెలకొంటుందని తెలంగాణ నిర్మాణ సంఘాలు కోరుతున్నాయి. ఇండ్ల నిర్మాణానికి అనుమతి ఇస్తున్న స్థానిక సంస్థలు, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్లు, అగ్నిమాపక నిరోధక శాఖ, పౌరవిమానయాన శాఖ వంటి ప్రభుత్వ విభాగాలన్నింటినీ 'రెరా' పరిధిలోకి తేవాలని అభ్యర్థిస్తున్నాయి. గతంతో పోల్చితే ఇండ్ల అనుమతులు రాష్ట్రంలో సులువుగానే లభిస్తున్నాయనీ, స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం పెరగాలంటే ఈ విభాగాల్ని 'రెరా' పరిధిలోకి తీసుకురావాలని కోరుతున్నాయి. జీహెచ్ఎంసీ వంటి కార్పొరేషన్లు, హెచ్ఎండీఏ వంటి పట్టణాభివృద్ధి సంస్థలు, డీటీసీపీ తదితర విభాగాల్ని కూడా రెరా పరిధిలోకి తేవాలని విన్నవిస్తున్నాయి. అయితే, ఇది కొత్త అభ్యర్థనేం కాదని.. రెరా ఆవిర్భావం నుంచి జాతీయ స్థాయిలో ఈ డిమాండ్ ప్రధానంగా వినిపిస్తుందని క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి తెలిపారు. నిర్మాణ సంస్థలను ప్రోత్సహించడానికి గతంలో ప్రోత్సాహకర నిర్ణయాల్ని తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు ముందుకేస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ తీసుకున్న వినూత్న నిర్ణయాల వల్ల దేశంలోనే రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతున్నదని ఆయన వివరించారు. ఇటీవల కాలంలో అగ్నిమాపక శాఖలో ఎన్‌వోసీలు ఆలస్యమవుతున్నాయనీ నిబంధనల్ని పాటించే సంస్థల ఫైళ్లకు వీలైనంత త్వరగా మోక్షం కల్పించాలని డెవలపర్లు కోరుతున్నారు.

మనమే భేష్..

ముంబై, బెంగళూరు, చెన్నై తదితర నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో నిర్మాణ రంగం మెరుగ్గా ఉందని ట్రెడా (తెలంగాణ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్) అధ్యక్షుడు రవీందర్‌రావు తెలిపారు. తెలంగాణ రియల్ మార్కెట్ నిపుణుల ప్రకారం.. వాణిజ్య సముదాయాలే కాకుండా నివాస గృహాల్లోనూ మెరుగైన పురోగతిని సాధిస్తున్నది. కాకపోతే, కొనుగోలుదారులకు నిర్మాణ సంస్థలు మరింత నాణ్యమైన సేవల్ని అందించాలంటే అనుమతులు, ఎన్‌వోసీలను మంజూరు చేసే సంస్థల్ని రెరా పరిధిలోకి తేవాలని కోరారు. అనుమతులు త్వరగా లభిస్తే.. తాము కొనుగోలుదారులకు వేగంగా ఇండ్లను అందించడానికి వీలు కలుగుతుందన్నారు. 2017 జనవరి 1 తర్వాత రాష్ట్రంలో ప్రారంభమైన ప్రాజెక్టుల్ని రాష్ట్ర ప్రభుత్వం 'రెరా' పరిధిలోకి తెచ్చింది. దీంతో నిర్మాణ సంస్థల్లోనే కాకుండా.. రియల్ ఎస్టేట్ ఏజెంట్లలోనూ జవాబుదారీతనం పెరిగింది. రెరా అనుమతి తీసుకున్న ఏజెంట్లే హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాలు, కొనుగోళ్లను జరుపుతున్నారు.

నేటి నుంచి కార్మిక సంఘాల సమ్మె

దేశవ్యాప్తంగా రెండు రోజులపాటు ఆందోళనలు.. పాల్గొననున్న ఆర్టీసీ కార్మిక సంఘాలు



న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 7: ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, ఏకపక్ష సంస్కరణలను నిరసిస్తూ మంగళవారం నుంచి దేశవ్యాప్తంగా రెండు రోజులపాటు సమ్మె చేస్తున్నామని సోమవారం జాతీయ కార్మిక సంఘాలు ప్రకటించాయి. 10 సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు (సీటీయూ) సమ్మెకు మద్దతిస్తున్నాయని, దాదాపు 20 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్ ఇక్కడ 10 సీటీయూలు సంయుక్తంగా నిర్వహించిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఇదిలావుంటే ఈ బంద్‌లో ఆర్టీసీ కార్మిక సంఘాలైన ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎస్‌డబ్ల్యూయూ కూడా పాల్గొంటున్నాయి. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు అన్ని ప్రభుత్వ శాఖల కార్మిక సంఘాల ఉద్యోగులు మంగళ, బుధవారాల్లో బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయా ట్రేడ్ యూనియన్లు ప్రకటించాయి. దేశ వ్యాప్తంగా ఆర్టీసీ విభాగానికి చెందిన 50 శాతం యూనియన్లు పాల్గొంటున్నట్లు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించాయి. నరేంద్ర మోదీ సర్కారు.. కార్మిక చట్టాలను మార్చుతూ వేధింపులకు గురి చేస్తున్నదని విమర్శించాయి. మోటార్ ట్రాన్స్‌పోర్టు బిల్లును కూడా రాజ్యసభలో ఎలాగైనా నెగ్గించుకోవాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించాయి. టూరిస్టు బస్సులకు స్టేజ్ క్యారేజ్‌గా అనుమతులివ్వడంతో ప్రభుత్వ రవాణా వ్యవస్థ అయిన ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యమవుతున్నదని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ మండిపడింది. బంద్‌లో పాల్గొనాలని ఆర్టీసీ తెలంగాణ జేఏసీ నేతలు కూడా పిలుపునిచ్చారు.

పనిచేయనున్న బ్యాంకులు?

మరోవైపు ఈ రెండు రోజులు బ్యాంకులు పనిచేసే అవకాశాలే కనిపిస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ కార్యకలాపాలు మంగళ, బుధవారాల్లో యథాతథంగా కొనసాగనున్నాయని ఓ బ్యాంకింగ్ యూనియన్ అధికారి చెప్పారు. 'జనవరి 8, 9 తేదీల్లో దేశంలోని అన్ని ఎస్‌బీఐ శాఖలు తెరిచే ఉంటాయి. మొత్తం తొమ్మిది బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాల్లో రెండు మాత్రమే ఈ సమ్మెకు మద్దతునిస్తున్నాయి. కాబట్టి ఎస్‌బీఐతోపాటు మరి కొన్ని బ్యాంకుల లావాదేవీలూ జరుగుతాయి' అని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పశ్చిమ బెంగాల్ కన్వీనర్ సిద్ధార్థ ఖాన్ సోమవారం కోల్‌కతాలో పీటీఐకి తెలిపారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సమేతంగా సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏపీలో పరిపాలన సక్రమంగా లేదని, సీఎం చంద్రబాబు పనిచేయడంమాని ప్రచారంతో కాలం గడిపేస్తున్నారని, ఏపీలో జరిగే ఎన్నికల్లో కేసీఆర్ ముఖ్యపాత్ర వహించనున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఫెడరల్ ఫ్రంట్ దేశంలోనే కీలకపాత్ర పోషించనుందని తలసాని చెప్పారు. - తిరుమల, నమస్తే తెలంగాణ

పది పట్టణాల మాస్టర్‌ప్లాన్లకు రూపకల్పన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అమృత్ పథకంలో భాగంగా పది పట్టణాలకు జీఐఎస్ ఆధారిత మాస్టర్‌ప్లాన్లను రూపొందించడానికి డీటీసీపీ కార్యాచరణను సిద్ధంచేసింది. మొదటి ప్యాకేజీలో ఆదిలాబాద్, రామగుండం, కరీంనగర్ వంటి పట్టణాల బృహత్ ప్రణాళికలను సిద్ధంచేయాలని నిర్ణయించింది. మున్సిపల్ పరిధిలోనే కాకుండా.. పట్టణాభివృద్ధి సంస్థలను అభివృద్ధి చేసేందుకు వీటిని మాస్టర్‌ప్లాన్ల పరిధిలోకి చేర్చింది. సిద్దిపేట, మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, నిజామాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ పట్టణాల్లోనూ మాస్టర్‌ప్లాన్లను సిద్ధంచేయనున్నది. కన్సల్టెంట్ల నియామకానికి ప్రీ-బిడ్ మీటింగ్ ఇటీవల జరిగినట్టు సమాచారం. త్వరలో వీటి మాస్టర్‌ప్లాన్లు సిద్ధమవుతాయని డీటీసీపీ భావిస్తున్నది.

సంస్కృతి ప్రతిబింబించేలా స్వీట్ ఫెస్టివల్

- ఈ నెల 13 నుంచి నిర్వహణ
- దేశంలోని అన్ని రాష్ర్టాల స్వీట్ల ప్రదర్శన
- కైట్ ఫెస్టివల్‌కూ ఏర్పాట్లు పూర్తి
- పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం



పతంగుల, స్వీట్ల పండుగ బ్రోచర్ విడుదల సందర్భంగా మాట్లాడుతున్న పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా మిఠాయిల పండుగ నిర్వహించనున్నామని పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ప్రతి యేడూ నిర్వహించినట్టుగానే ఈ నెల 13వ తేదీ నుంచి సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో మూడురోజులపాటు పతంగుల, మిఠాయిల పండుగ ప్రారంభమవుతుందన్నారు. సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం సచివాలయంలో ఆయన విడుదల చేసి మాట్లాడుతూ... గత ఏడాది పతంగుల పండుగకు 7 లక్షల మంది హాజరయ్యారని, ఈ ఏడాది 10 లక్షల మంది హాజరవుతారని భావిస్తున్నట్టు తెలిపారు. మిఠాయిల పండుగ సందర్భంగా దేశంలోని అన్నిరాష్ర్టాల్లోని ప్రత్యేకమైన మిఠాయిలను ఆయా రాష్ర్టాల ఆడపడుచులు ప్రదర్శిస్తారని, వెయ్యిరకాల స్వీట్లు స్టాళ్లల్లో అందుబాటులో ఉంటాయన్నారు. 19 దేశాల నుంచి 42 మంది అంతర్జాతీయ, 60 మంది జాతీయ పతంగుల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. డయాబెటిస్ వ్యాధి వారి కోసం కూడా ఇక్కడ మిఠాయిలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు.



కొండచిలువతో శరణ్‌మోసెస్

పాములతో చెలగాటం!

- ఇద్దరు యువకులు అరెస్ట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అక్రమంగా పాములను బంధించి వాటితో చెలగాటమాడుతున్న ఇద్దరు యువకులను అటవీశాఖ యాంటీ పోచింగ్ స్క్వాడ్ అరెస్ట్‌చేసింది. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ గ్రామంలోని వెంకటాద్రి టౌన్‌షిప్ నివాసి శరణ్‌మోసెస్ అనే వ్యక్తి కొండచిలువ, బ్రాంజ్‌బ్యాక్ స్నేక్ (చెడుగు)ను నెలరోజులుగా ఇంట్లో బంధించి పెంచుతున్నాడు. శరణ్ స్నేహితుడు వీ ప్రవీణ్‌తో కలిసి పాములతో ఆటలుఆడుతూ వీడియోలు తీసి వాట్సప్, ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేస్తున్నారు. ఆసక్తి గలవారు కొనుక్కోవచ్చని ఆన్‌లైన్‌లో ప్రకటన కూడా ఇచ్చారని అధికారులు చెప్పారు. సమాచారం అందుకున్న అటవీశాఖ యాంటీ పోచింగ్ స్క్వాడ్ వారిని అదుపులోకి తీసుకుని వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్-1972 కింద కేసులు నమోదు చేసింది. రెండు పాములకు విషం ఉండదు. కొండచిలువ వన్యప్రాణి సంరక్షణ చట్టం షెడ్యూల్-1లో, చెడుగు పాము షెడ్యూల్-4 పరిధిలోకి వస్తాయి. వీటిని పట్టుకోవడం నేరంగా పరిగణిస్తారు. నిందితులకు జైలుశిక్షతోపాటు జరిమానా విధించనున్నట్టు అధికారులు తెలిపారు.

ఉద్యోగుల కృషితోనే నంబర్‌వన్

టీఎన్జీవో డైరీ ఆవిష్కరణలో హోంమంత్రి మహమూద్‌అలీ



సోమవారం టీఎన్జీవో డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, హజ్‌కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర సాధనకు కృషి చేసినట్టుగానే రాష్ట్రాభివృద్ధిలో కూడా ఉద్యోగుల కృషి అభినందనీయమని, వారి కృషితోనే రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందని హోంమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. టీఎన్జీవోస్ హైదరాబాద్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎం హుస్సేనీ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో సంఘ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మహమూద్‌అలీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌లా తెలంగాణ ఉద్యోగులు కూడా నంబర్‌వన్ అని కొనియాడారు. మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఉద్యోగులందరికీ అన్నివిధాలా భరోసానిచ్చారని తెలిపారు. టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల కష్టాలను తీర్చే నాయకుడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్, హజ్ కమిటీ చైర్మన్ మషియుల్లా, టీఎన్జీవోస్ కేంద్ర కార్యదర్శి రేచల్, కేంద్ర కోశాధికారి శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సిటీ అధ్యక్షుడు ప్రతాప్, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర సాయంపై బహిరంగ చర్చకు సిద్ధం

- స్థలమెక్కడో మీరే చెప్పండి
- భారతీయ జూటా పార్టీగా మార్చుకోండి
- బీజేపీ నేతలకు టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె సవాల్



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్. చిత్రంలో ఎమ్మెల్సీఫారూఖ్ హుస్సేన్ కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : కేంద్ర ప్రభుత్వం రాష్ర్టానికి అదనంగా ఎలాంటి సహాయం చేయలేదని, దీనిపై బీజేపీ నాయకులతో ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధమని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సవాల్ విసిరారు. బీజేపీని.. భారతీయ జూటా పార్టీగా మార్చుకోవాలని సూచించారు. తెలంగాణభవన్‌లో సోమవారం మరో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ ఇష్టమొచ్చినట్టు మాట్లాడటాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. కేటీఆర్ ప్రశ్నించిన వాటికి సూటిగా సమాధానం చెప్పకుండా ఏదో ఒకటి మాట్లాడటం సరికాదన్నారు. దేశంలో వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్రమేదో చెప్పాలని ఆయన దత్తాత్రేయను ప్రశ్నించారు. కేంద్రం సహాయం చేస్తేనే రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పిన దత్తాత్రేయ, బీజేపీపాలిత రాష్ర్టాల్లో కరెంటు ఎందుకు ఇవ్వడంలేదో వివరణ ఇవ్వాలన్నారు. నీతిఅయోగ్ ప్రతిపాదించిన రూ.24 వేలకోట్లను ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్‌చేశారు. బయ్యారం ఉక్కుపరిశ్రమను ఏర్పాటుచేస్తామని చెప్పినా రాష్ట్రం స్పందించలేదనే దత్తాత్రేయ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు.

ఇంటర్ కాలేజీల గుర్తింపు ప్రక్రియ మొదలు

- నోటిఫికేషన్ జారీచేసిన ఇంటర్మీడియట్ బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీలకు 2019-20 విద్యాసంవత్సరానికి అనుబంధ గుర్తింపు (అఫిలియేషన్) ప్రక్రియను ఇంటర్మీడియట్ బోర్డు ప్రారంభించింది. ఇందుకోసం ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్ సోమవారం నోటిఫికేషన్ విడుదలచేశారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. అనుబంధ గుర్తింపు, అదనపు కోర్సుల ప్రారంభానికి దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 10 వ తేదీ నుంచి 31 వరకు గడువు విధించారు. రూ.10 వేల ఆలస్యరుసుంతో దరఖాస్తులు సమర్పించేందుకు మార్చి 20 వరకు అవకాశం కల్పించారు. అనుబంధ గుర్తింపు, అదనపు కోర్సుల ప్రారంభ అనుమతికి ఎఫ్‌డీఆర్‌తోపాటు భవనాలు, ఆటస్థలానికి సంబంధించి సేల్‌డీడ్, ఫైర్ సేఫ్టీ, శానిటరీ, స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనుబంధ గుర్తింపుతోపాటు బోర్డు అనుమతించిన కోర్సుల వివరాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలిసేలా కాలేజీలో ప్రదర్శించాలి. బోర్డుకు తెలియకుండా అదనపు కోర్సులు, సీట్లు పెంచుకొంటూ విద్యార్థులను తప్పుదోవపట్టించే ప్రైవేటు కళాశాలలపై కఠినచర్యలు తప్పవని, అవసరమైతే సదరు కాలేజీల గుర్తింపు రద్దుచేస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్ హెచ్చరించారు. ఈ నెల 10 నుంచి అందుబాటులో ఉండే www.acad.tsbie.telangana.gov.in, www.bie. telangana.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

ఎన్నికలకు సరిపడా నిధులివ్వండి

- సీఈవోను కోరిన తెలంగాణ తహసీల్దార్ల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన బడ్జెట్ సరిపోలేదని, ఎన్నికల వ్యయానికి సరిపోను నిధులు విడుదలచేయాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్‌కు విజ్ఞప్తిచేసింది. సోమవారం తెలంగాణ తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, అధ్యక్షుడు కే గౌతంకుమార్ ఆధ్వర్యంలో బృందం సీఈవో రజత్‌కుమార్‌ను కలిశారు. సరిపోను నిధులు విడుదల చేయనందున ఇంకా కొందరికి బిల్లులు చెల్లించాల్సి ఉందని, వారు ప్రతిరోజూ కార్యాలయానికి వస్తుండటంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. ఎన్నికల వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని నిధులు విడుదల చేయాలని కోరారు.

ఇకపై నాణ్యతలేని కాలేజీలుండవ్: పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రైవేటు విద్యావిధానాన్ని గాడిలో పెట్టడంతోపాటు నాణ్యమైన విద్యకే పెద్దపీట వేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా వృత్తివిద్యా కాలేజీల్లో నాణ్యమైన విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చే దిశగా చర్యలను కొనసాగిస్తున్నట్టు సోమవారం మీడియాకు వివరించారు. వచ్చే ఐదేండ్ల వరకు కొత్త కాలేజీలకు అనుమతించే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. ప్రభుత్వం తీసుకొన్న ప్రత్యేక చర్యలతో రాష్ట్రంలో నాణ్యమైన కాలేజీలు అందుబాటులోకి వచ్చాయని, విద్యా ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయని చెప్పారు. 2014-15 నుంచి ఇప్పటి వరకు 132 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడ్డాయని, స్వయంగా ఆయా కళాశాలల యాజమాన్యాలే జేఎన్టీయూహెచ్‌కు, ఉన్నత విద్యామండలికి దరఖాస్తు చేసుకొన్నారని పేర్కొన్నారు. అలాగే నాణ్యతలేని పలు ఫార్మసీ, మేనేజిమెంట్, కంప్యూటర్, డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయన్నారు. ప్రైవేటు డిగ్రీ కాలేజీల ప్రవేశాల్లో దోస్త్ విధానం ప్రవేశపెట్టిన తర్వాత విద్యా ప్రమాణాలు పెరిగాయని అభిప్రాయపడ్డారు.

చెన్నైకి తాగునీటిపై ఐదు రాష్ర్టాల భేటీ 9న

- ఏర్పాట్లుచేస్తున్న కృష్ణానదీ యాజమాన్య బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చెన్నై తాగునీటిపై తెలంగాణ, తమిళనాడు, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ర్టాల అధికారులతో ఈ నెల 9 న జలసౌధలోని కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏర్పాట్లుచేస్తున్నది. గత ఒప్పందం ప్రకారం ఉమ్మడి ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఐదు టీఎంసీల చొప్పున ఏడాదికి 15 టీఎంసీలను తాగునీటి కోసం తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా చెన్నై నగరానికి సరఫరా చేయాల్సి ఉంటుంది. తమిళనాడు ప్రభుత్వం ఒత్తిడిమేరకు కేంద్ర జలవనరులశాఖ ఈ అంశంపై తేల్చాలని బోర్డును ఆదేశించింది. ఈ మేరకు బోర్డు సమావేశానికి ఏర్పాట్లు చేసింది.



వరంగల్‌లోని నిట్‌లో నిర్వహిస్తున్న యూత్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న మిషన్ నేతాజీ ఫౌండర్ అనూజ్‌ధర్

నేతాజీ స్ఫూర్తిని కొనసాగించాలి

- మిషన్ నేతాజీ ఫౌండర్ అనూజ్‌ధర్
- నిట్‌లో ఉత్సాహంగా యూత్ ఫెస్ట్ ప్రారంభం

నిట్ క్యాంపస్ (వరంగల్): స్వాతంత్ర్య పోరాటంలో వీరోచిత పోరాటం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రముఖ రచయిత, జర్నలిస్ట్, మిషన్ నేతాజీ ఫౌండర్ అనూజ్‌ధర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (నిట్)లో ఆయన యూత్ ఫెస్ట్‌ను జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. అనంతరం తాను నేతాజీ సుభాష్ చంద్రబోస్‌పై చేసిన పరిశోధనను పవర్ పాయింట్ పరిశోధన ద్వారా వివరించారు. 2005 నుంచి తన స్నేహితులతో కలిసి సాగించిన పరిశోధనలో అనేక విషయాలు వెలుగుచూశాయని చెప్పారు. అంతకుముందు నిట్ డైరక్టర్ ఎన్వీ రమణారావు మాట్లాడుతూ.. సమాజహితానికి ఉపయోగపడేలా యువతకు ఆలోచించాలని పేర్కొన్నారు.

15 స్టాళ్లలో విభిన్న వంటకాలు

యూత్ ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులు ఈ- అడ్డా క్లబ్ పేరుతో 15 స్టాల్స్ ఏర్పాటుచేసి వంటకాలు తయారుచేశారు. ఉగ్గాని బజ్జీ, బొంగు చికెన్, బ్రెడ్ ఆమ్లెట్, పానీపూరి, బాయిల్డ్ ఎగ్, ఫ్రూట్ కబాబ్ తదితర వంటకాలను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచినట్టు క్లబ్ సెక్రటరీ శ్రేయారెడ్డి తెలిపారు. యూత్‌ఫెస్ట్‌లో అందుబాటులో ఉంచిన వివిధ రకాల వంటకాలను రుచిచూస్తూ విద్యార్థులు ఆస్వాదించారు.



సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు, సీఎండీలు రఘుమారెడ్డి, గోపాలరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తదితరులు

ఆర్థికలోటు భర్తీకి ఉద్యోగులు కృషిచేయాలి

- బీసీ విద్యుత్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణసభలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

తెలుగుయూనివర్సిటీ: విద్యుత్‌శాఖలో ఆర్థికలోటును భర్తీ చేసేందుకు ఉద్యోగులు ప్రణాళికతో ముందుకుసాగాలని ట్రాన్స్‌కో,జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణసభ హైదరాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ దేశంలోనే మిగులు విద్యుత్‌ను సాధించేస్థాయికి చేరడం తెలంగాణకే సాధ్యమైందన్నారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను సమర్థంగా నిర్వహించినపుడే సంస్థ పురోగమిస్తుందని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ 24 గంటల కరంట్ సరఫరా, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందని కొనియాడారు. కేంద్రం మెడలు వంచైనా బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ ఏ గోపాలరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వెంకన్న, కార్యనిర్వాహక అధ్యక్షుడు జీ బ్రహ్మేందర్‌రావు పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్‌రూల్స్ రూపొందించాలి

- కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన టీటీఎఫ్ రాష్ట్ర కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయులకు ఏకీకృతసర్వీస్‌రూల్స్, పదోన్నతులు కల్పించాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరామని టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రఘునందన్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంతో సోమవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను సత్కరించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రకమిటీ సభ్యులు పీ వెంకటేశ్, డీ రాజయ్య, సుమిత్రానంద్, జీ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

టీజీసీటీఏ సంఘం నూతన కార్యవర్గం

తెలంగాణ ప్రభుత్వ కాలేజ్ టీచర్స్ సంఘం (టీజీసీటీఏ) కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఈ బ్రిజేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కే నాగేందర్ ఎన్నికయ్యారు.

9 నుంచి ఈఎన్టీ, హెడ్ నెక్ సర్జరీ సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యరంగంలో శస్త్రచికిత్సలు, వైద్యవిధానాల్లో మార్పులపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయస్థాయి ఈఎన్టీ, హెడ్,నెక్ సర్జరీ సదస్సుకు హైదరాబాద్ వేదిక కానున్నది. ప్రతిష్ఠాత్మక ఓషనియా ఈఎన్టీ, హెడ్ అండ్ నెక్ సర్జరీ 14వ ఆసియా ఓషనియా ఓఆర్‌ఎల్- హెచ్‌ఎన్‌ఎస్-సదస్సును 9నుంచి 13 వరకు నిర్వహించనున్నట్టు సదస్సు కన్వీనర్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. సదస్సుకు సంబంధించిన వివరాలను కోఠి ప్రభుత్వ ఈఎన్టీ దవాఖానలో సోమవారం మీడియాకు వెల్లడించారు. 9 నుంచి మాదాపూర్ హైటెక్స్‌లో నిర్వహించే సదస్సుకు దేశ,విదేశాల వైద్యనిపుణులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్రామారెడ్డి, ట్రెజరర్ మనీష్ గుప్తా, ఏవోఐ అధ్యక్షుడు, ఈఎన్టీ సూపరింటెండెంట్ శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో విద్యారంగంలో సంక్షోభం

- ఫిబ్రవరి 18న పార్లమెంట్ ముట్టడి: ఏఐఎస్‌ఎఫ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, దీనిని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 18న పార్లమెంటు ముట్టడించనున్నామని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేశ్‌సింగ్, ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు.

బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచండి

- తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశంగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జనాభాలో 53 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశంగౌడ్ డిమాండ్‌చేశారు. 15 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆర్థిక ప్రాతిపదికన కాకుండా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఇది ఎన్నికల స్టంట్ అని ఆయన అన్నారు.

వెట్టి విముక్తికి ఆపరేషన్ స్మైల్ -V

- డీజీ గోవింద్‌సింగ్, ఐజీ స్వాతి లక్రా వెల్లడి



ఆపరేషన్ స్మైల్‌పై అధికారులకు సూచనలిస్తున్న సీఐడీ అదనపు డీజీ గోవింద్ సింగ్, మహిళ రక్షణ, శాంతిభద్రతల ఐజీ స్వాతిలక్రా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వెట్టిచాకిరీ, భిక్షాటన, మనుషుల అక్రమ రవాణాలో బాధితులుగా ఉన్న బాలబాలికలను రక్షించేందుకు ఏటా చేపట్టే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని సీఐడీ అదనపు డీజీ గోవింద్ సింగ్, మహిళ రక్షణ, శాంతి భద్రతల ఐజీ స్వాతి లక్రా సోమవారం డీజీపీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ స్మైల్-V లక్ష్యాలను విష్కరించారు. అపరేషన్ స్మైల్ నిబంధనలపై174 మంది సిబ్బందికి అవగాహన కల్పించారు. బాలబాలికలను కాపాడేందుకు చేపట్టే రెస్క్యూ ఆపరేషన్స్‌పై శిక్షణ ఇచ్చారు. చైల్డ్ లైన్, స్వచ్ఛందసంస్థలు, శిశుసంక్షేమశాఖ, కార్మిక, వైద్యశాఖ సిబ్బందితో సమన్వయం చేసుకొని అపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఫేషియల్ రికగ్నిషన్ టూల్(దర్పన్) సాఫ్ట్‌వేర్‌ను అందజేశారు. అపరేషన్ స్మైల్-V నెలరోజులపాటు కొనసాగుతుందని చెప్పారు. 2015 నుంచి ప్రారంభమైన ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా దాదాపు 22 వేల మంది బాలబాలికను వ్యవస్థీకృత వెట్టిచాకిరీ నుంచి కాపాడి తల్లిదండ్రుల వద్దకు చేర్చామని గోవింద్‌సింగ్, స్వాతిలక్రా తెలిపారు.

అత్తమామల వేధింపులతో అల్లుడి ఆత్మహత్య



చంద్రశేఖర్ (ఫైల్)

గౌతంనగర్, నమస్తే తెలంగాణ: అత్తమామల సూటిపోటి మాటలకు కలతచెంది ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నవీపేట లక్ష్మీ కిసాన్‌ఫారం ప్రాంతానికి చెందిన బీ చంద్రశేఖర్ (27)కు, వనస్థలిపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సౌజన్యతో 2018 మార్చిలో వివాహం జరిగింది. ఇద్దరూ బేగంపేటలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ సాయిరాం థియేటర్ సమీప బ్యాంక్‌కాలనీలో ఉంటున్నారు. సౌజన్య రెండునెలల కిందట పుట్టింటికివెళ్లిపోగా చంద్రశేఖర్ ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 5న తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ఆన్‌లైన్‌లో రైల్‌టికెట్లను బుక్‌చేశానని, 7న ఉదయం వరకు రావాలని కోరాడు. సోమవారం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా సీలింగ్‌ఫ్యాన్‌కు చంద్రశేఖర్ ఉరివేసుకుని కనిపించాడు. తండ్రి రాంబాబు మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. అత్తమామలు వేధించి పరువు తీస్తున్నారని, అందుకే చనిపోతున్నానని, వారిని కఠినంగాశిక్షించాలని రాసిఉన్న సూసైడ్ నోట్‌ను చంద్రశేఖర్ జేబులో పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

జగన్‌పై హత్యాయత్నం కేసులో ఎన్‌ఐఏ దర్యాప్తు ప్రారంభం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఏపీలోని విశాఖపట్నం విమానాశ్రయంలో వైఎస్ జగన్‌పై కోడికత్తితో దాడిచేసిన కేసు దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎన్ఐఏ డీఐజీ ప్రవీణ్ నేతృత్వంలోని బృందం సోమవారం విశాఖపట్నం చేరుకున్నది. స్థానిక పోలీసులను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను ఆరా తీసింది. అనంతరం ఎన్ఐఏ బృందం ఎయిర్‌పోర్టులోని సీన్ ఆఫ్ అఫెన్స్‌ను పరిశీలించింది. ఈ కేసును ఎన్ఐఏకు బదిలీచేయడంపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తున్నది.


మహనీయుల మార్గం అనుసరణీయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆధునిక కాలంలో కోరికలు పెరిగి మానసిక సమస్యలు ఎక్కువవుతున్నాయని, దీంతో మనలో దాగిఉన్న శక్తిని వినియోగించుకోలేకపోతున్నామని హైదరాబాద్ రామకృష్ణమఠంలోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్ డైరెక్టర్ స్వామి శితికాంతానంద అన్నారు. ఫలితంగా యాచించే మనస్తత్వం పెరుగుతున్నదని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, వివేకానంద వంటి మహనీయుల మార్గం అనుసరణీయమని చెప్పారు. సోమవారం వ్యవసాయ వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

ఏపీలో శాంతిభద్రతలపై దృష్టి పెట్టండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీలో శాంతిభద్రతల పరిస్థితి అధ్వానంగా ఉన్నదని, ఈ విషయంలో తక్షణం జోక్యంచేసుకోవాలని ఆ రాష్ట్ర బీజేపీ నేతలు వీ దినేశ్‌రెడ్డి, సుధీశ్ రాంభొట్ల సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణపై దాడి జరుగడం శాంతిభద్రతల తీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 8 జనవరి 2019   WWW. NTNEWS.COM   /nt.zindagi



కొత్త వెలుగుజిలుగుల ఆర్ట్‌వేద



గాజు గ్లాసు, కొవ్వొత్తి, పెయింట్ బ్రెష్‌తో మీరేం చేస్తారు? మంచి బొమ్మ గీస్తారేమో..! ఈమె మాత్రం వాటితో అద్భుతాలు సృష్టిస్తుంది. మనం ఇంతకుముందు ఎప్పుడూ చూడని వింతలను ఆవిష్కరిస్తుంది. నిరాశ నిండిన జీవితాల్లో కొత్త వెలుగుజిలుగులు తెస్తుంది. ఏంటీ? నమ్మశక్యంగా లేదా? అయితే.. తన వృత్తికి, ప్రవృత్తికి ఏ మాత్రం సంబంధం లేని ఈ 'స్టెయిన్‌లెస్ ఆర్టిస్ట్' చెప్పే మాటలు వింటే.. మీరే నమ్మేస్తారు.

రెండు రంగులను కలిపితే ఏ రంగు వస్తుందో పెయింటర్‌గా తెలుసుకుంది. చిరు వెలుగులో ఏ రంగులు మరింత ప్రకాశవంతంగా మెరుస్తాయో ప్రయోగాలు చేసింది. ఎలాంటి రంగులు చూస్తే మనసు పులకరిస్తుందో ఓ సైకాలజిస్ట్‌గా అధ్యయనం చేసింది. మనకు అందుబాటులో ఉండే వస్తువులతో ఎలాటి అద్భుతాలు చెయ్యొచ్చో ఆరా తీసింది. ఇలా ప్రతి వస్తువునూ తీక్షణంగా పరిశీలించి.. ఏదో ఒక ప్రయోగం చేస్తూనే ఉంది. తీరిక దొరికినప్పుడల్లా కొంగొత్త ఆలోచనలు చేస్తూ.. విదేశాలకే పరిమితమైన 'స్టెయిన్‌లెస్ ఆర్ట్'ను మన ముందుకు తీసుకొచ్చింది. అమెజాన్ వంటి ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్స్‌లలో తన కొత్త ఆర్ట్‌ను విక్రయిస్తూ నలుగురిలో ప్రత్యేకంగా నిలిచింది. ఆ విశేషాలేంటో.. సైకాలజిస్ట్ కం ఆర్టిస్ట్ రవళీశర్మ మాటల్లోనే..

'స్టెయిన్‌లెస్ ఆర్ట్' దీని గురించి మనం ఇప్పుడిప్పుడే మాట్లాడుకుంటున్నాం. ఇది ఒకప్పుడు విదేశాల్లో చాలా ఫేమస్ ఆర్ట్. గాజుకు ఆర్ట్ వేసి, దానిపై లైటింగ్ వేస్తే.. ఎలాంటి అద్భుతాలు ఆవిష్కృతమవుతాయో ఈ ఆర్ట్‌లో గమనించవచ్చు. వినడానికి కొత్తగా ఉన్న ఈ విధానాన్ని పారిస్, రోమ్ లో అలంకరణకు ఎక్కువగా వాడుతుంటారు. దానిని మన వాళ్లకు పరిచయం చేసేందుకు నేను ప్రయత్నిస్తున్నా. అదికూడా కేవలం తక్కువ ఖర్చుకే. సింగిల్ కలర్ లైటింగ్ అంటే ఏదో రంగు వేస్తే వస్తుందిలే అనుకుంటాం. కానీ అది అలా కాదు. గ్లాస్ మీద ఎలాంటి డిజైన్ అయితే ఉంటుందో దానికి రెట్టింపు ఆకర్షణ రావాలి. అందుకు సంబంధించి మంచి రంగులు రావాలి. అవి చిరు వెలుగులో ఎలా మెరుస్తాయో అవగాహన ఉండాలి. ఇందుకు నేను ఎన్నో ప్రయోగాలు చేయాల్సి వచ్చింది. మొదట డాట్స్ వర్క్ చేశా. గ్లాస్‌పై నచ్చిన రంగుని వేసేదాన్ని. అది బాగోలేకపోతే వేరే రంగు వేసేదాన్ని. తర్వాత మార్కర్‌తో ప్రయత్నించా. ఇలా తీరిక దొరికినప్పుడల్లా రకరకాల ప్రయోగాలు చేస్తూనే ఉండేదాన్ని. మొదట్లో ఒక్కో ఆర్ట్ వేయడానికి కనీసం వారం రోజులు పట్టేది. గ్లాస్ పెయింటింగ్‌పై అవగాహన వస్తున్న కొద్దీ.. సమయం తక్కువయ్యేది. ఇప్పుడు ఎలాంటి డిజైన్ అయినా కేవలం రెండు గంటల్లోనే పూర్తి చేస్తున్నా.


మొదట మార్కెట్లో దొరికే స్టెయిన్‌లెస్ గ్లాస్‌లు కొని వాటి మీద ప్రయోగాలు మొదలు పెట్టా. మనసులో ఒక డిజైన్ అనుకొని చేస్తే.. మరో ప్రతిబింబం వచ్చేది. అనుకున్న రూపం వచ్చే వరకూ పట్టువదలకుండా చేస్తూనే ఉండేదాన్ని. ఎంత ప్రయత్నం చేసినా తుది రూపం రాకపోతే.. చివరిగా ఇంటర్నెట్ సాయం తీసుకునేదాన్ని. పెయింటింగ్ చూడ్డానికి మామూలుగానే ఉన్నా.. అందులో కొవ్వొత్తిని వెలిగిస్తే.. ఆ పెయింటింగ్ ప్రతిబింబం మాత్రం అద్భుతంగా వస్తుంది. ఎంత పెద్ద సక్సెస్ అయినా ఓటములతోనే మొదలవుతుందంటారు. ఇలా ఎన్నో విఫల ప్రయోగాల ఫలితంగా ఇలా రాటుదేలాను. ఇప్పుడు ఫలానా పెయింటింగ్ వేయాలని నిర్ణయించుకుంటే.. కేవలం రెండు గంటల్లోనే పూర్తి చేసేంత అనుభవం వచ్చింది. నా ఈ అభిరుచికి కారణం.. చిన్నప్పటి నుంచి నేను చేస్తున్న ప్రయోగాలే.

మాది ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా. విద్యాభ్యాసం అంతా అక్కడే. నాన్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్నతాధికారిగా పదవీ విరమణ పొందారు. అమ్మ గృహిణి. ఇద్దరు అన్నయ్యల్లో ఒకరు పైలెట్, మరొకరు రీసెర్చర్. నాకు చిన్నప్పటి నుంచి సైకాలజిస్ట్ అవ్వాలని కోరిక. ఇంట్లో అందరూ చదువుకున్నవారే అవ్వడంతో నాకు మరింత సహకారం అందింది. 'సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఫర్ ఉమెన్'లో గ్రాడ్యుయేషన్, పాండిచ్చేరి యూనివర్సిటీలో సైకాలజీ చేశా. కొన్నాళ్లు చైల్డ్ సైకాలజీ, స్టూడెంట్ కౌన్సెలర్‌గా పనిచేశా. 2017 మార్చిలో వైజాగ్‌కు చెందిన జగన్నాథ్ శర్మతో పెళ్లి చేశారు. ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మనసు కూడా చాలా సాఫ్ట్. భర్త, అత్తమామలు నా వృత్తికి చాలా సహకారం అందించే వాళ్లు. నా భర్త ఉద్యోగరీత్యా మేం ఇప్పుడు హైదరాబాద్‌లోనే స్థిరపడ్డాం. ఇక్కడ కూడా స్టూడెంట్ సైకాలజీ కౌన్సెలర్‌గా విధులు నిర్వర్తిస్తూనే.. తీరిక సమయాల్లో స్టెయిన్‌లెస్ ఆర్ట్‌ను కొనసాగిస్తున్నా.

పెళ్లయిన తర్వాత మా కుటుంబం మొత్తం పారిస్, రోమ్ ట్రిప్‌కి వెళ్లాం. అక్కడే ఈ ఆర్ట్ నా కంటపడింది. చిన్న గ్లాస్ బౌల్ మీదున్న డిజైన్.. మొత్తం గదినే అందంగా మార్చింది. అప్పుడే నేనూ ఈ ఆర్ట్‌ను మనకు పరిచయం చెయ్యాలనుకున్నా. ఇంటికి రాగానే ఆర్ట్ మొదలుపెట్టా. నా ఇష్టాన్ని గౌరవించి ఇంట్లోవాళ్లందరూ సహకరించారు. ఇలా నా పెయింటింగ్స్ చూసి కుటుంబ సభ్యులు, బంధువులు బాగా ప్రోత్సహించారు. ఇంటికి వచ్చిన అతిథులకు నా ఆర్ట్‌ను గుర్తుగా ఇచ్చేదాన్ని. వాళ్లంతా సంతోషంగా ఫీలవడంతో.. వాటిని అమ్మాలనే నిర్ణయం తీసుకున్నా. నా ఆర్ట్ గురించి పలువురికి చెప్పేదాన్ని. ఈ క్రమంలో ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌ను నా ఆర్ట్‌ను విక్రయించేందుకు వేదికగా చేసుకున్న. అమేజాన్‌లో 'Artveda in Amazon' అని సెర్చ్ చేసి, నా ఆర్ట్‌ను కొనుగోలు చెయవచ్చు. ప్రస్తుతం వీటి ధరలు రూ.299 నుంచి ప్రారంభం అవుతాయి. 'గిఫ్ట్ ఆర్టికల్ కలెక్షన్స్' పేరుతో వైజాగ్, హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో స్టోర్స్ నిర్వహిస్తున్నా. నా భర్త సాఫ్ట్‌వేర్ కాబట్టి ఆయన సాయంతో ఆన్‌లైన్ వ్యవహారాలన్నీ నేనే స్వయంగా చూసుకుంటున్నాను. ఆర్ట్స్‌ని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు 'ఆర్ట్‌వేద' పేరుతో వెబ్‌సైట్ క్రియేట్ చేశాం. ఈ వెబ్‌సైట్ నుంచి కూడా ఆర్డర్స్ చెయ్యవచ్చు. హోం డెలివరీ సర్వీస్, నచ్చకపోతే తిరిగి ఇచ్చే వెసులుబాటు కూడా ఉంది. మున్ముందు మరిన్ని వెరైటీస్‌తో ఆర్ట్స్‌ని డెవలప్ చేయాలనుకుంటున్నా.

స్టెయిన్‌లెస్ ఆర్ట్ అంటే?

ఇది గాజు వస్తువులపై చేసే పెయింటింగ్. చూడ్డానికి ఈ పెయింటింగ్ మామూలుగానే ఉన్నా. లైట్లు ఆఫ్ చేసి, కొవ్వొత్తి వెలుతురులో చూస్తే.. చాలా అందంగా కనిపిస్తాయి. ఉదాహరణకు మనకు నచ్చిన పెయింటింగ్ వేసిన గాజు గ్లాసులో.. దానికి సమానమైన కొవ్వొత్తిని ఉంచాలి. తర్వాత లైట్లు ఆఫ్ చేసి కొవ్వొత్తిని పెట్టి వెలిగిస్తే.. వచ్చే ప్రతిబింబం కొత్త సృష్టిలా ఉంటుంది. ఇందుకు కలర్ కాంబినేషన్ చాలా ముఖ్యమైంది. వీటిని నచ్చిన వారికి గిఫ్ట్‌గా ఇస్తే.. ఫిదా అవుతారు. పండగలకు ఈ లైటింగ్ పీక్స్ ఉంటుంది. వీటిని విదేశాల్లో బాగా ఉపయోగిస్తున్నారు. కావాలంటే మీరూ ప్రయత్నించొచ్చు. మరింకెందుకు మీకు కావాలనుకుంటే అమెజాన్‌లోకి వెళ్లండి.



... వనజ వనిపెంట
బి. సంజయ్ చారి

పెండ్లిరోజు కానుక!



వారికి పెండ్లయి నాలుగో ఏడాది కావొస్తుంది. ప్రతి పెండ్లిరోజుకీ ఏదో ఒక మంచి పని చేస్తూనే ఉన్నారీ దంపతులు. అయితే ఈసారి కలకాలం గుర్తుండిపోయి, నలుగురికి ఉపయోగపడే పనిచెయ్యాలనుకున్నారు. ఇంతకీ వారి పెండ్లిరోజు కానుక ఏంటో తెలుసా?

పానీపట్‌కు చెందిన ఈ దంపతులు యోగేష్ గుప్తా, మాయా గుప్తా. ప్రతియేటా తన పెండ్లి రోజు ఏదో ఒక మంచిపని చేసే ఈ దంపతులు.. ఈసారి పేద పిల్లల కోసం ప్రాథమిక పాఠశాలను నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం నిధులు సమకూర్చుకొని పానీపట్‌లోని సంజయ్‌చౌక్ దగ్గర్లో ఓ పాఠశాలను నిర్మించారు. ఇందులో పేద పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఎవరి దగ్గరా విరాళాలు సేకరించకుండా వారే సొంతంగా నిధులు సమకూర్చుకొని ఈ పాఠశాలను గతేడాది డిసెంబర్ 2న ప్రారంభించారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలకు వెళ్తూ.. చదువుల్లో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేకంగా తరగతులు చెబుతారు. ముఖ్యంగా ఇంగ్లిష్ గ్రామర్, మ్యాథమెటిక్స్‌లో క్లాసులు చెబుతారు. అంతేకాకుండా పెయిటింగ్, డ్రాయింగ్, రంగోలి, స్పోర్ట్స్‌ల్లో అవగాహన కల్పిస్తున్నారు. వీరికి తోడుగా మాయా చెల్లెలు నైనా గుప్తా, యోగేష్ స్నేహితులు నిత్యం వస్తూ పిల్లలకు పలు సబ్జెక్టుల్లో పాఠాలు బోధిస్తుంటారు. వీరు చేస్తున్న మంచి పనికి కొందరు వలంటీర్స్‌గా వచ్చి పిల్లలకు మంచి విషయాలు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 25మంది విద్యార్థినీ విద్యార్థులున్నారు. స్వామి వివేకానంద మాటలు స్ఫూర్తిగా తీసుకొని, నలుగురి బాగుకోసం పాటుపడుతున్నట్లు చెబుతున్నారు ఈ గుప్తా దంపతులు.

గ్లామరస్‌గా ఉండాలంటే!



డెకరేషన్ అంటే ఇంట్లో మూడు చోట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఒకటి బెడ్‌రూమ్, రెండు వంటగది, మూడు బాత్‌రూమ్. ముఖ్యంగా బాత్‌రూమ్ కూడా శుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండాలంటే ఈ కింది చిట్కాలు ఫాలో అవ్వండి.

- బాత్‌రూమ్ ఎప్పుడూ తడిగా ఉంటుంది. నీటిని పీల్చుకోవడానికి బాత్‌రూమ్‌లో మ్యాట్ ప్రధానమైంది. మ్యాట్ జారిపోకూడదు. నీటిని పీల్చేలా ఉండాలి. ఇది పాదాల శుభ్రతకు ఉపయోగపడుతుంది.
- బాత్‌రూమ్‌లో ఎప్పుడూ ఒక శుభ్రమైన టవల్ ఉండాలి. దీన్ని టవల్ రాడ్‌పై ఉంచాలి. తెల్లటి టవల్ కంటే రంగులున్న కలర్ అయితే ఇంకాస్త బాగుంటుంది. రాడ్‌పై వేసేటప్పుడు చక్కగా మడతపెట్టాలి.
- అద్దం తప్పనిసరి ఉండాలి. షేవింగ్, ముఖం కడుగాలన్నా అద్దం ఉండాల్సిందే. మంచి డిజైన్లతో కూడిన అద్దాలు మార్కెట్‌లో దొరుకుతాయి. దీన్ని వాష్ బేసిన్, షవర్ కింద పెడితే ఉపయోగకరంగా ఉంటుంది.
- టూత్‌బ్రష్, రూమ్ ఫ్రెషనర్, టూత్‌పేస్ట్, షేవింగ్ కిట్, సబ్బులు పెట్టుకోవడానికి విడివిడిగా ఉంచుకోవాలి. ఇవన్నీ అడ్డురాకుండా ఒక మూలలో అమర్చుకునేలా చూసుకోవాలి.
- బాత్‌రూమ్‌లో ఉన్నప్పుడు ముఖ్యమైన కాల్స్‌ని మిస్ అవ్వకుండా ఉండాలంటే అక్కడే ఒక టెలిఫోన్ కనెక్షన్ పెట్టుకోండి. మంచి డిజైన్ ఉండే వాటర్ ప్రూఫ్ హ్యాంగింగ్ టెలిఫోన్ గోడకు వేలాడదీస్తే ఉపయోగకరం.

సిరిముగ్గు



ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
బంజారాహిల్స్, రోడ్ నం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

22 చుక్కలు
10 వరుసలు
10 వచ్చేవరకు

కె. దీప,
పటాన్‌చెరు,
హైదరాబాద్



బడిపిల్లల కోసం అన్నీ తానై..



కేరళలోని అంబూరి గ్రామానికి చెందిన ఉషా కుమారి దక్షిణ కేరళలోని అగస్త్య పాఠశాలలో ఉపాధ్యాయురాలు. ఆ పాఠశాలలో ఉషా సుమారు 16 యేండ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నది. ప్రస్తుతం ఆ పాఠశాల ఉషాతోనే నడుస్తున్నది.

1990లో కేరళ ప్రభుత్వం ఎడ్యుకేషన్ ఇన్షియేటివ్ ప్రోగ్రాం చేపట్టింది. ఆ కార్యక్రమంలో 1997లో స్వచ్ఛందంగా చేరింది. బడీడు పిల్లల జాబితా సేకరించి, వారిని బడిలో చేర్పించడం ఉషా పని. ఉషా ఉంటున్న ప్రదేశం పూర్తిగా అటవీ ప్రాంతం కావటంతో పాఠశాల భవనాలు సరిగ్గా ఉండేవి కావు. విద్యార్థులు బడిలో చేరకపోయేవారు. దీంతో ఉషా బాగా ఆలోచించి తానే విద్యార్థులను చేరదీసి చెట్ల కిందనో, గుడిసెల కిందనో పాఠాలు బోధించటం ప్రారంభించింది. ఈ క్రమంలో 2002లో మొదటిసారి పాఠశాల భవనం మంజూరు అయింది. ఈ భవనంలో 1 నుంచి 4వ తరగతి వరకూ ఉషా అన్నీ తానై పాఠశాలను నిర్వహించేది. ఉదయం 7 గంటకు ఇంటి నుంచి బయలుదేరిన ఉషా మధ్యలో వాగును, కొండలను దాటి పాఠశాలకు వస్తున్నది. వాతావరణం బాగోలేనప్పుడు ఇంటికి వెళ్లకుండా స్థానికులతోనే ఉంటుంది. విద్యార్థుల భోజనం కోసం అవసరమైతే తన సొంత ఖర్చులతో వంటచేసి పెడుతుంది. ఉషా క్వాలిఫైడ్ టీచర్ కాకపోవడంతో ఆమె ఉద్యోగం ఉంటుందో లేదో అని ఏం చింతించడం లేదు. 'పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం అందాలి, రవాణా సౌకర్యం మెరుగుపడాలి అంతే తప్ప నాకు ఉద్యోగం ముఖ్యం కాదు' అంటోంది ఉషా.

మెరిసే కురులు.. మీ సొంతం




ఈ రోజుల్లో ప్రతిఒక్కరికి జుట్టు అధికంగా రాలిపోతుంది. ఏం చేసినా.. ఎటువంటి ఫలితాలు కనిపించలేదని బాధపడుతున్నారా.. అయితే ఈ కింది చిట్కాలను పాటిస్తే పట్టుకుచ్చులా మెరిసే కురులు మీ సొంతమవుతాయి.

- తెల్ల వెంట్రుకలు ఉంటే వాటికి రంగువేస్తుంటారు. రంగు వేసి వదిలేస్తే సరిపోదు వాటికి తగ్గకొన్ని పనులు చేయాలి. జట్టుకు రంగు ఆరిపోగానే తలస్నానం చేయాలి. ఆ తరువాత బీట్‌రూట్, క్యారెట్ రసాలను కండీషనర్‌లా తలకు పట్టిస్తే చాలు.
- పెసరపప్పు పిండి, మెంతిపిండిని బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని తలకు రాసి ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి. 50 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే కురులు అందంగా మెరిసిపోతాయి.
- కరివేపాకును బాగా ఎండబెట్టి పొడిని బాటిల్‌లో నిల్వ ఉంచాలి. మజ్జిగలో ఈ పొడిని కలిపి తలకు పట్టించాలి. 30 నిమిషాల తరువాత తలస్నానం చేయాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే జుట్టు పట్టుకుచ్చులా పెరుగుతుంది.
- మధ్యాహ్నం, రాత్రి భోజనం తరువాత ఒక అరటిపండు తినడం అలవాటుగా మార్చుకోవాలి. అరటిలోని పోషకాలు జుట్టు సమస్యలను దూరం చేస్తాయి.
- కొబ్బరినూనెలో తమలపాకు రసం కలుపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు రాసి కొంతసేపు మర్దన చేయాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తే రక్తప్రసరణ జరిగి కుదుళ్లు దృఢపడుతాయి.
- వాల్‌నట్స్‌ని దంచి మెత్తగా చేసి నీళ్లలో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. 60 నిమిషాల తరువాత తలస్నానం చస్తే జుట్టు ముదురు ఎరుపు రంగుగా మారుతుంది.

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[హైదరాబాద్]
మంగళవారం 8 జనవరి 2019

అవయవాలలో మూత్రపిండాలు ప్రధానమైనవి.
ఇటీవలి కాలంలో కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు ఎక్కువవుతున్నాయి.
కిడ్నీలు చెడిపోతే శరీరంలో రక్తశుద్ధి ప్రక్రియ కుంటుపడుతుంది.
దీనివల్ల రక్తం కలుషితం అయి.. మనిషి మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది.
కాబట్టి మూత్రపిండాలను ఎలా కాపాడుకోవాలి? కిడ్నీ ఫెయిల్యూర్‌కి చికిత్స ఏంటి?
కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సక్సెస్ అవుతుందా వంటి విషయాలు తెలుసుకుందాం!

కొత్త జీవితాన్నిచ్చే.. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్!



మూత్రపిండాలు శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేస్తాయి. మలిన పదార్థాలను మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. నీటి సమతుల్యతను కాపాడతాయి. రక్తపోటును నియంత్రిస్తాయి. ఎర్ర రక్త కణాల తయారీలో ముఖ్యపాత్ర వహిస్తాయి. ఎముకల పటిష్ఠతను కాపాడుతాయి. అలాంటి మూత్రపిండాలు చెడిపోతే పరిష్కారం ఏంటి? కిడ్నీ మార్పిడి ఒక్కటే శాశ్వత పరిష్కారం. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహణకు అత్యాధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది.

ఎలా పాడవుతుంది?

ప్రధానంగా మధుమేహం. సుమారు 40-50% కిడ్నీ ఫెయిల్యూర్స్‌కి షుగర్ వ్యాధే కారణం అవుతుంది. మరో ప్రధాన సమస్య హైబీపీ. మూత్రపిండాలు చెడిపోయిన వారికి మూత్రంలో ప్రొటీన్ ఎక్కువగా పోయి కాళ్లు, ముఖం వాస్తాయి. మూత్రం నురగగా వస్తుంది. ఇన్ఫెక్షన్లు సోకుతాయి. రాళ్లు చేరుతాయి. వీటివల్ల కిడ్నీలు పాడవుతాయి. వంశ పారంపర్యమైన జబ్బులు కూడా కొన్నిసార్లు కారణం అవొచ్చు.

లక్షణాలు

మూత్రపిండాల సమస్యలో ఐదు దశలు ఉంటాయి. మొదటి, రెండవ దశల్లో అసలు వ్యాధి లక్షణాలు కనిపించవు. మూడవ దశలో ఆకలి మందగించడం, నీరసం, మొహం వాచినట్లు ఉండడం, కాళ్లల్లో వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నాలుగు, ఐదు దశల్లో కండ్ల చుట్టూ వాపు, మూత్రం తగ్గిపోవడం, ఫిట్స్, నడుంనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే కిడ్నీలకు జబ్బు వచ్చిన తర్వాతనే ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఐదవ దశ వచ్చే సరికి కిడ్నీ పనితీరు బాగా తగ్గిపోతుంది. అయితే చాలామంది ఈ దశకు చేరుకున్న తర్వాతనే వైద్యులను సంప్రదించడం వల్ల వ్యాధి తీవ్రత ఇంకా పెరుగుతున్నది. ఎప్పుడైతే ఐదో దశకు వచ్చిందంటే దానిని సాధారణ స్థితికి తీసుకురావడం చాలా కష్టం.

పరీక్షలు

వ్యాధి తీవ్రతరం అయ్యేవరకు లక్షణాలు కనిపించవు. కాబట్టి వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా మూత్ర పరీక్ష, సీరమ్ క్రియాటిన్ పరీక్షలు చేయించుకోవాలి. వీటిలో అసాధారణ లక్షణాలేవైనా కనిపిస్తే మరింత లోతుగా తెలుసుకునేందుకు జీఎఫ్ఆర్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షల ద్వారా కిడ్నీ పనితీరును తెలుసుకోవచ్చు. మధుమేహం, బీపీని నియంత్రణలో ఉంచుకుంటూ తప్పనిసరిగా ఏడాదికి ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి. ఆకలి మందగించడం, నీరసం, మొహం వాచినట్లు ఉండడం, కాళ్లల్లో వాపు, రాత్రిళ్లు ఎక్కువసార్లు మూత్రం రావడం, లేదా చాలా తక్కువగా రావడం, మూత్రంలో నురగ వచ్చినట్లు అనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యుల సమక్షంలో మూత్ర పరీక్ష చేయించుకోవాలి.

చికిత్స

దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలు కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారితీస్తాయి. ఈ స్థితిలో ఉన్న రోగులకు డయాలసిస్ లేదా మూత్రపిండాల మార్పిడి చేయాల్సి ఉంటుంది. అయితే కిడ్నీ మార్పిడికి దాత అవసరమవుతారు. దాంతో ఎక్కువ శాతం రోగులు డయాలసిస్ పైనే ఆధారపడుతుంటారు. కొన్ని సందర్భాల్లో అవసరం లేకపోయినా క్రియాటిన్‌ను బట్టి డయాలసిస్ చేయిస్తుంటారు. అన్ని సందర్భాలలో డయాలసిస్ అవసరం ఉండకపోవచ్చు. అనవసరంగా డయాలసిస్ చేయించుకోవడం వల్ల ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కిడ్నీ పనితీరు, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి డయాలసిస్ అవసరమా? కాదా? అనేది ఆధారపడి ఉంటుంది. ఎక్కువసార్లు డయాలసిస్ చేసుకోకుండా ఉండేందుకు ఇంక్రిమెంటల్ డయాలసిస్ విధానం అందుబాటులోకి వచ్చింది.

స్వాప్ రీనల్

రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చెయ్యాలనుకున్నా బ్లడ్ గ్రూపులు కుదరకపోవడం వల్ల అది సాధ్యపడనపుడు అదే సమస్యతో బాధపడుతున్న మరొకరి రక్తసంబంధీకుల్లో బ్లడ్ గ్రూపులు మ్యాచ్ అయినప్పుడు పరస్పరం కిడ్నీలు దానం చేసుకొని మార్పిడి చేయించుకునే ప్రక్రియను స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీ వారి బంధువుకు.. వారి కిడ్నీని వీరి బంధువుకు అమరుస్తారు. ఇద్దరికీ ఒకేసారి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరుగుతుంది.

కిడ్నీ మార్పిడి ఎప్పుడు?

కిడ్నీ 100% పాడైనపుడు మాత్రమే అవయవ మార్పిడి ద్వారా రోగిని రక్షిస్తారు. లైవ్ డోనార్ (బతికున్న వారి నుంచి కిడ్నీని సేకరించడం), కెడావర్ డోనార్ (చనిపోయిన వ్యక్తి నుంచి కిడ్నీని సేకరించడం) పద్ధతుల్లో కిడ్నీని సేకరిస్తారు. లైవ్ డోనార్‌లో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని దానం చేయాలి. వీరి బ్లడ్ గ్రూపు కిడ్నీ మార్పిడి చేయించుకునే వ్యక్తి బ్లడ్ గ్రూపుతో మ్యాచ్ అవ్వాలి. దాతకు అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, మెదడు జబ్బులు, కాలేయ వ్యాధులైన హెపటైటిస్-బి, సి ఉండకూడదు. ఒక కిడ్నీ దానం చేయడం వల్ల ఎలాంటి నష్టం లేదని నిర్ధారించిన తర్వాతనే కిడ్నీ మార్పిడి చేస్తారు. రక్త సంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలువకపోతే స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఏబీఓ ఇన్‌కంపాటబుల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా మార్పిడి చేయాల్సి ఉంటుంది.

అపోహలు వీడండి..



కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలో తర్వాతి జీవితం ఎలా ఉంటుందో అని దాతలో, స్వీకర్తలో ఎన్నో అపోహలు, భయాలు ఉండటం సహజం. అయితే ఆపరేషన్ జరిగిన తర్వాత కొన్నిరోజుల పాటు మాత్రం వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ సరైన జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యరకమైన వ్యక్తికి జీవక్రియలు నిర్వహించడానికి ఒక కిడ్నీ సరిపోతుంది. కాబట్టి ఆరోగ్యంగా ఉన్నవారు కిడ్నీ దానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవు. కృత్రిమ కిడ్నీ ద్వారా యంత్రం సహాయంతో రక్తాన్ని శుద్ధి చేస్తారు. వారానికి మూడుసార్లు రోజు విడిచి రోజు డయాలసిస్ చేయించుకోవాలి. ఈ సమయంలో మితాహారం తీసుకోవాలి. డయాలసిస్ చేయించుకునేటప్పుడు బీపీ ఒక్కసారిగా పెరుగుతుంది. కాబట్టి ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు.

డయాలసిస్‌లో రకాలు

కిడ్నీ పనితీరు గణనీయంగా తగ్గిపోతే శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియ కుంటుపడిపోతుంది. దానిని తిరిగి యథావిధిగా పనిచేసే విధంగా చేయడం సాధ్యపడదు. దాంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేయవలసి వస్తుంది. ఈ స్థితిలో ఉన్న రోగులకు డయాలసిస్ లేదా కిడ్నీ ట్రాన్స్ప్లాంటేషన్ కానీ చెయ్యాల్సి ఉంటుంది. కిడ్నీమార్పిడికి దాత అవసరమవుతారు. కాబట్టి ఎక్కువమంది డయాలసిస్ పైనే ఆధారపడాల్సి వస్తుంది. తీవ్రమైన కిడ్నీ సమస్యలు ఉన్నవారికి డయాలసిస్ ప్రక్రియ ద్వారా శరీరంలోని మలినాలను, అదనంగా ఉన్న నీటిని బయటకు పంపించవచ్చు. డయాలసిస్ రెండు రకాలు. ఒకటి హీమో డయాలసిస్, రెండవది ఇంట్లోనే చేసుకునే పెరిటోనియల్ డయాలసిస్.

తక్కువ కోత


దాత నుంచి కిడ్నీని సేకరించేందుకు ఇదివరకు పెద్ద కోత పెట్టి కిడ్నీని సేకరించేవారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక ల్యాప్రోస్కోపిక్ డోనార్ నెఫ్రెక్టమీ విధానంలో తక్కువ కోతతో సురక్షితంగా కిడ్నీని సేకరించవచ్చు. సంప్రదాయ పద్ధతులలో దాత నుంచి కిడ్నీని సేకరించేందుకు కోత పెద్దగా ఉండటంతో రక్తస్రావం జరగడంతో పాటు, గాయం మానేందుకు కొన్ని రోజుల సమయం పట్టేది. ల్యాప్రోస్కోపిక్ డోనార్ నెఫ్రెక్టమీ విధానంలో కోత తక్కుగా ఉంటుంది కాబట్టి రక్తస్రావం తక్కువగా ఉంటుంది, గాయం త్వరగా మానుతుంది. త్వరగా కోలుకోవచ్చు కూడా.

డాక్టర్ ఎం. దిలీప్ బాబు
సీనియర్ నెఫ్రాలజిస్ట్
& కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్



ప్రెగ్నెన్సీ సమయంలో.. ఫోలిక్‌యాసిడ్ ఎందుకంటే?

మీకు తెలుసా



ప్రెగ్నెన్సీతో ఉన్న మహిళలు డాక్టర్ చెప్పారని తరుచూ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడుతుంటారు. కానీ అవి ఎందుకోసం అని అడిగితే.. ఏమో అంటుంటారు. వేసుకోవడమొక్కటే కాదు.. వాటి ప్రయోజనమేంటో కూడా తెలిస్తే బావుంటుంది కదా.

ఇది నీటిలో కరిగే విటమిన్, బీ కాంప్లెక్స్ విటమిన్‌కు చెందింది. పిండాభివృద్ధికి, ఎముకల పెరుగుదలకు, శిశువు ఎముకల పెరుగుదలకు ఉపయోగపడుతుంది. అందుకే గర్భిణీ స్త్రీలు ఫోలిక్‌యాసిడ్ టాబ్లెట్లు వేసుకోవాలని డాక్టర్లు సూచిస్తుంటారు. మరీ ముఖ్యంగా తొమ్మిదో నెలలో తప్పనిసరి. ప్రసవ సమయంలో వచ్చే ఇబ్బందులను తగ్గించే గుణం వీటికి ఉంటుంది. వెన్నెముక నిర్మాణంలో లోపాలను తొలగించి ప్రసవాన్ని సులభతరం చేస్తుంది. డీఎన్ఏ అభివృద్ధికి, కణాల నిర్మాణానికి దోహదకారిగా పనిచేస్తుంది. ఫోలిక్ యాసిడ్ లోపం ఉన్నట్లయితే గర్భిణికి అనీమియా వ్యాధి వస్తుంది. తరచూ అలసట వచ్చినట్లు ఫీలవుతుంటారు. చిరాకు పడుతుంటారు. తలనొప్పి, జీర్ణ సమస్యలు ఏర్పడి పిండం అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. ప్రసవ సమయంలో ఎక్కువ స్రావం జరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సహజంగా లభించే పచ్చని ఆకు కూరలు తినాలి. వీటిలో ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. చికెన్, లివర్, గుడ్లు, ఆస్పరాగస్ వంటివాటిలో కూడా ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది కాబట్టి గర్భిణీ స్త్రీలు వీటిని తరచుగా తీసుకోవడం మంచిది.

ఐరన్ దొరికేదెక్కడ?

- పురుషులకు 8 గ్రాములు, స్త్రీలకు 18 గ్రాముల ఐరన్ అవసరం.
- 10 గ్రాముల జీడిపప్పు 0.3 గ్రాముల ఐరన్‌ను ఇస్తుంది.
- పైన్‌గింజలు ఒక ఔన్స్‌కి 3 గ్రాముల ఐరన్ ఇస్తాయి.
- 14 గ్రాముల హాజెల్ నట్స్‌లో 0.7 ఐరన్ ఉంటుంది.
- రెండు చెంచాల వేరుశనగలలో 0.6 గ్రాముల ఐరన్ ఉంటుంది.
- 28 గ్రాముల పిస్తాలో 1.1 గ్రాముల ఐరన్ లభిస్తుంది.
- 10 గ్రాముల ఎండబెట్టిన బాదంలో 0.5 గ్రాముల ఐరన్ దొరుకుతుంది.

నిద్రలేని టీనేజ్ అమ్మాయిలు!

అధ్యయనం



సోషల్‌మీడియాలో ఏం జరుగుతుందో ఏమోగానీ.. టైంపాస్ కోసం దానిని ఆశ్రయించే టీనేజ్ అమ్మాయిలకు కొత్త సమస్యలు వస్తున్నాయట. అబ్బాయిల కంటే 38% అధికంగా అమ్మాయిలు సోషల్‌మీడియాను వాడుతున్నారట. ఈ విపరీత ధోరణి వల్లే వాళ్లకు లేనిపోని సమస్యలు కలుగుతున్నాయని చెప్తున్నారు నిపుణులు.

టీనేజ్ అమ్మాయిలు సరిగా నిద్రపోవడం లేదట. వారిలో ఏదో భయం వెంటాడుతుందట. శారీరక ఎదుగుదల కూడా లోపిస్తుందట. ఇవన్నీ ఏదో అందాజా కొద్దీ చెప్తున్నవి కావు. లండన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమయాలజీ అండ్ హెల్త్‌కేర్ పరిశోధకులు అధ్యయనం చేసి చెప్తున్న మాటలు. 11000 మంది 14 ఏళ్ల వయసున్న టీనేజర్స్‌పై ఈ అధ్యయనం చేశారు. సోషల్‌మీడియా కారణంగా 40% టీనేజ్ అమ్మాయిలు తీవ్ర నిరాశ నిస్పృహలకు, డిప్రెషన్‌కు గురవుతున్నారని వారు తెలిపారు. అమ్మాయిలు సోషల్‌మీడియాకు అడిక్ట్ కావడం వల్లనే ఇలాంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. వీరితో పోలిస్తే అబ్బాయిలు కేవలం 25% మాత్రమే సోషల్‌మీడియా దుష్ప్రభావాలకు గురవుతున్నారు. అస్తమానం స్మార్ట్‌ఫోన్ ముందరేసుకొని సామాజిక మాధ్యాల్లో మునిగిపోవడం వల్ల 40% అమ్మాయిలు అసలు సరిగా నిద్రపోవడం లేదు. 38% మంది ఎప్పుడు చూసినా సోషల్‌మీడియాలో సైన్‌చేసే ఉంటున్నారు. ఏం జరుగుతుంది? ఎవరేం కామెంట్ చేస్తున్నారు? అనే ఆందోళన వారిలో ఎక్కువవుతుంది. దీనికి తోడు సోషల్‌మీడియా హరాస్‌మెంట్ పెరిగిపోయి అమ్మాయిలు తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్లిపోతున్నారట.

సెంటు వాడుతున్నారా?

ఒక్క నిమిషం ఆగండి. సెంట్ లేదా పెర్ఫ్యూమ్ మీకు గుప్పుమనే సుగంధాన్ని ఇస్తుండొచ్చు. కానీ అంతకుమించి అనారోగ్యాన్ని కలుగజేస్తుందనే విషయం తెలుసుకోండి. సెంట్, పెర్ఫ్యూమ్స్‌లో రసాయనిక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి హానికరం అని హెచ్చరిస్తున్నారు నిపుణులు.



హెచ్చరిక

రసాయనిక సమ్మేళనాలతో తయారైన సెంట్, పెర్ఫ్యూమ్‌లు నేరుగా చర్మాన్ని తాకడం వల్ల చర్మం ఎర్రగా మారుతుంది. కొందరికి గాయాల మాదిరిగా అవుతుంటాయి. మరికొందరిలో ఇన్‌ఫ్లమేషన్ వంటి చర్మ రుగ్మతలు వస్తాయి. డిప్రెషన్‌కు కూడా దారితీసే ప్రమాదం ఉంది. ప్రాథమికంగా విపరీతమైన తుమ్ములు వస్తుంటాయి. కొన్నిసార్లు కండ్ల వెంట నీరు కారుతూ అలర్జీగా అనిపిస్తుంటుంది. ఇలాంటి సమస్యలు ప్రతి 10 మందిలో ఒకరికి ఉంటున్నట్లు పరిశోధకులు చెప్తున్నారు. సెంట్ల వల్లనే 55% అమెరికన్లు అలర్జీలతో బాధపడుతున్నారట. 'టెక్సాస్ మెడిసిన్ ప్రాక్టీస్' 'ఎన్విరాన్‌మెంటల్ వర్కింగ్ గ్రూప్' సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. పర్ఫ్యూమ్స్ వాడుతున్న వారిలో 2% మంది విష ప్రభావాలను ఎదుర్కొంటున్నారని వారు తెలియజేశారు. వీటివల్ల డెర్మటైటిస్, తామర వంటి ప్రమాదకర చర్మ వ్యాధులకు దారితీస్తున్నాయట. లేబుల్స్ లేని పర్ఫ్యూమ్‌లను వాడి ప్రమాదాన్ని కొని తెచ్చుకోవద్దని వారు సూచించారు.

సుడోకు

డైలీ సుడోకు 30 సమాధానం

1	6	9	8	7	2	4	5	3
2	7	4	3	1	5	6	8	9
3	8	5	4	6	9	1	7	2
4	1	7	9	3	8	2	6	5
8	9	6	5	2	7	3	1	4
5	3	2	1	4	6	7	9	8
9	2	1	6	8	4	5	3	7
6	4	8	7	5	3	9	2	1
7	5	3	2	9	1	8	4	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

డైలీ సుడోకు -31

8	1	4						6
2								1
				4	5	7		
9							1	
	3			9				
7	4	6		1				9
	2			5	3		6	
	6	7	8					4
4							8	

సమాధానం రేపటి సంచికలో

పిల్లల్లో వచ్చే క్యాన్సర్లు- రకాలు- లక్షణాలు

ప్రపంచంలో ఎంతటి విధ్వంసం జరిగినా, భయంకర ఉత్పాతం వచ్చినా తల్లిదండ్రి ఒడిలో ఉంటే తమకేమీ కాదనుకునే అమాయకత్వం పిల్లలది. కానీ క్యాన్సర్‌కు అలాంటి మొహమాటాలేవీ ఉండవు. శత్రువులను దునుమాడే అరివీర భయంకరుడైన ప్రపంచ విజేత కొడుకుకు క్యాన్సర్ వచ్చినా అంతటి వీరుడూ దానిముందు నిస్సహాయుడే. కానీ ఒక శుభవార్త. చాలా రకాల పిల్లల క్యాన్సర్లు ఇప్పుడు చికిత్స ముందు లొంగిపోతుండటం విశేషం.

సలహా



పెద్దవారిలో వచ్చే అన్ని రకాల క్యాన్సర్లూ పిల్లల్లోనూ వచ్చే ప్రమాదం ఉంది. అయితే ప్రధానంగా వాళ్లలో రక్తసంబంధిత క్యాన్సర్లు (లుకేమియా), మెదడు కణుతులు (బ్రెయిన్ ట్యూమర్స్), లిఫోమా, సాఫ్ట్ టిష్యూ సార్కోమా వంటివి ఎక్కువ. పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌లు సాధారణంగా ఎలాంటి లక్షణాలూ చూపకపోవచ్చు. అకస్మాత్తుగా జ్వరంతో బయటపడవచ్చు. పరిపరి విధాలుగా ప్లాన్ చేసుకొని ఒకరినో, ఇద్దరినో కన్న తల్లిదండ్రులకు తమ చిన్నారికి క్యాన్సర్ అని తెలిస్తే వాళ్లకు అది అశనిపాతంగా పరిణమిస్తుంది. తీవ్రమైన వేదనకూ, కుంగుబాటుకూ లోనవుతారు. కొంతలో కొంత ఉపశమనం ఏంటంటే పిల్లల క్యాన్సర్లు చాలావరకు పూర్తిగా నయం చేయదగినవే.

రేడియేషన్..

మన దేశంలో ప్రతీ ఏడాది దాదాపు 45000 మంది పిల్లలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. వీళ్లలో 70% మందికి వ్యాధి పూర్తిగా నయమవుతుంది. అయితే 30% మందిలో వారి జీవితకాలంలో అది ఎప్పుడో ఒకప్పుడు తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. చిన్నప్పుడు 20 'గ్రే'ల కంటే ఎక్కువగా రేడియేషన్‌కు గురైనా క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. 'గ్రే' అంటే శరీరం గ్రహించిన రేడియేషన్ అని అర్థం. మామోగ్రామ్ వంటి పరీక్షలు మరీ చిన్నవయసులో చేయించుకోవడం కూడా అంత మంచిది కాదు. 30ఏళ్లు పైబడ్డాక డాక్టర్ సలహా మేరకు చేయించుకుంటేనే మంచిది. చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లు చాలావరకు కీమో, రేడియేషన్‌కు స్పందిస్తాయి. పిల్లలు రేడియేషన్ తీసుకునేటప్పుడు ఒంటరిగా ఉండటానికి భయపడి చికిత్సకు సహకరించకపోతే కొన్ని సందర్భాల్లో వారికి మత్తు ఇస్తారు. 12 ఏళ్లు పైబడ్డాక అమ్మాయికి గానీ, అబ్బాయికి గానీ క్యాన్సర్ చికిత్స వల్ల పునరుత్పత్తి వ్యవస్థ మీద ప్రభావం పడుతుందనుకుంటే అలాంటప్పుడు ముందుగానే వారి నుంచి అండాలను, వీర్యకణాలను సేకరించి భద్రపరుస్తుంటారు.

లుకేమియా..

పిల్లల్లో సాధారణంగా కనిపించే క్యాన్సర్ లుకేమియా, మనల్ని ఇన్ఫెక్షన్స్ నుంచి కాపాడే తెల్లరక్త కణాలు అపరిమితంగా పెరిగిపోవడమే లుకేమియా. ఇలా అధికంగా పెరిగిన తెల్ల రక్తకణాలు ఎర్ర రక్తకణాలను అడ్డుకొని రక్తాన్ని సరిగా సరఫరా కానివ్వవు. ఇలాగా ఒక్కసారిగా జరగడం కానీ లేదా దీర్ఘకాలికంగా గానీ జరగవచ్చు. చాలావరకు నయం చేయగలిగే ఈ చికిత్సలో కీమో, రేడియో థెరపీలు ఉంటాయి. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, స్టెమ్ లెస్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియలు ఈ క్యాన్సర్‌కు బాగా పనిచేస్తాయి. మొదటి బిడ్డకు రక్తసంబంధిత క్యాన్సర్ ఉంటే రెండో బిడ్డ విషయంలో కూడా జాగ్రత్త పడాలి.

లుకేమియా లక్షణాలు..

పిల్లలు పాలిపోయినట్లుగా ఉండటం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, నీరసం, అలసట ఎక్కువగా ఉండటం, త్వరగా చర్మం కమిలిపోవడం, మచ్చలు మచ్చలుగా ఉండటం, తీవ్రమైన రక్తస్రావం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే లుకేమియాగా అనుమానించాల్సి ఉంటుంది. రక్త పరీక్షలు, తుంటి లేదా ఇతర పెద్ద ఎముకల నుంచి తీసిన మూలగ (బోన్‌మ్యారో)ను పరీక్షించడం ద్వారా ఈ క్యాన్సర్‌ను కనుక్కోవచ్చు.

మెదడు కణితి..

పెద్దవాళ్లలో కంటే పిల్లల్లో బ్రెయిన్ ట్యూమర్స్ ఎక్కువని చెప్పొచ్చు. పొద్దున్నే లేవగానే తీవ్రమైన తలనొప్పి, వికారం, వాంతులు, ప్రవర్తించే తీరుమారడం, ఆందోళన, ఫిట్స్, చూపు/మాట మందగించడం వంటి లక్షణాలను మెదడు కణితిగా అనుమానించాల్సి ఉంటుంది. అది క్యాన్సర్ కణితి అయినా, కాకపోయినా రెండూ ప్రమాదకరమే. మెదడులో కణితి వచ్చిన ప్రదేశాన్ని బట్టి సర్జరీతో దాన్ని తొలగించడమో లేక ఇతర చికిత్స ప్రక్రియలు అనుసరించడం మంచిదా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకొని చికిత్సను నిర్ణయిస్తారు. ఒక్కోసారి మెదడు కణితిని రేడియో సర్జరీతో తొలగిస్తారు.


లింఫ్ నాళ క్యాన్సర్..

రోగ నిరోధక వ్యవస్థలో ప్రధానపాత్ర పోషించే లింఫ్ నాళాలకు సంబంధించిన క్యాన్సర్‌లో హాడ్జ్‌కిన్స్, ఆనాన్ హాడ్జ్‌కిన్స్ అనే రకాలుంటాయి. మెడ, చంకల్లో, గజ్జల్లో లింఫ్ నాళాలు వాయడం, జ్వరం, చలి, ఆకలి తగ్గడం, రాత్రిళ్లు చెమటలు పట్టడం, దగ్గు, ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉండటం వంటి లక్షణాలతో లింఫోమాలు బయటపడుతుంటాయి. ఇతర టిష్యూలను కలిపే సాఫ్ట్ టిష్యూలలో వచ్చే క్యాన్సర్‌ను సాఫ్ట్ టిష్యూ సార్కోమా అంటారు. ఎముకలను, కండరాలను కలిపే ఈ సాఫ్ట్ టిష్యూ క్యాన్సర్ లక్షణాలు.. వచ్చిన ప్రదేశం మీద ఆధారపడి ఉంటాయి. ఈ టిష్యూలకు సాగే గుణం ఉండటం వల్ల తొలిదశలో లక్షణాలు బయటపడవు. సాఫ్ట్ టిష్యూలలో వచ్చే క్యాన్సర్‌కు ప్రధానంగా సర్జరీ, అవసరాన్ని బట్టి దానికంటే ముందు లేదా తర్వాత రేడియో, కీమో థెరపీలుంటాయి. అండాలలో, టెస్టిస్‌లో వచ్చే జెర్మ్‌సెల్ ట్యూమర్స్ కూడా పిల్లల్లో ఎక్కువ.

చికిత్స..

రెండేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో అడ్రినల్ గ్రంథిలో, మెడ, ఛాతీ, పొట్ట, పెల్విస్‌లలో వచ్చే కణితులు (న్యూరో) బ్లాస్టోమాలు, ఎముకలు, టిష్యూలలో వచ్చే ఈవింగ్ సర్కోమా, మూత్రపిండాల్లో వచ్చే నెఫ్రోబ్లాస్టోమా వంటివి పిల్లల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లు. పిల్లల్లో పూర్తిగా నయం చేయగలిగిన ఈ క్యాన్సర్స్ పెద్దవాళ్లలో కనిపిస్తే మాత్రం అంతే తేలిగ్గా నయం కాకపోవచ్చు. పిల్లల్లో అరుదుగా కనిపించే మిగతా క్యాన్సర్స్ అదుపులోకి రావడం కష్టం కావచ్చు. లేదా ఎంతగా ప్రయత్నించినా చికిత్సకు లొంగకపోవచ్చు. పుట్టుకతో వచ్చే లోపాలు, జన్యు సంబంధమైన కారణాలు పిల్లల్లో క్యాన్సర్స్‌కు దారితీయవచ్చు. కాబట్టి ముందు పుట్టిన బిడ్డకు క్యాన్సర్ ఉంటే రెండో బిడ్డ విషయంలో జాగ్రత్తగా ఉండటం, లక్షణాలు గుర్తించి సరైన చికిత్స అందించడం, పోషకాహార లోపాలు లేకుండా జాగ్రత్తగా చూసుకోవడం, చికిత్స తర్వాత కూడా డాక్టర్ సలహా మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.

డా. సీహెచ్ మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్
ఒమేగా హాస్పిటల్స్
హైదరాబాద్: 9848011421
కర్నూల్: 08518 273001
గుంటూర్: 08632 223300



నమస్తే తెలంగాణ
శాస్త్ర
[హైదరాబాద్]
మంగళవారం 8 జనవరి 2019

ఎలాగంటే?



నిద్ర మనుషులకే కాదు, దాదాపు అన్ని రకాల ప్రాణుల (క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు)కూ తప్పనిసరి. మంచి నిద్ర వల్ల దేహంలోని మెదడు సహా అన్ని అవయవాలూ పూర్తి విశ్రాంతిని పొందుతాయి. నిద్రతో మన శారీరక, మానసిక అలసటను తీర్చుకొని తిరిగి శక్తిని పుంజుకొంటాం. ముఖ్యంగా మస్తిష్కంలోని వ్యర్థాలు (అనవసర ఆలోచనలు) తొలగిపోతాయి. అభ్యాస, జ్ఞాపకశక్తులు మరింత బాగా పెరగడానికి ఇది ఉపయోగపడుతుంది. గుండె, మెదడు, జీర్ణక్రియ, కేంద్ర నాడీ వ్యవస్థ వంటి అంతర అవయవ చర్యలన్నీ నిద్రించే వేళ కూడా యథావిధిగా పని చేస్తూనే, కొంత నెమ్మదిస్తాయని శాస్త్రజ్ఞులు అంటారు. మెదడులోని సంబంధిత కేంద్రం ప్రేరేపితమైనపుడు నిద్ర వస్తుంది. నిద్రించే సమయంలో మెదడు మేల్కొని ఉన్నప్పటి కంటే కొంత తక్కువ శక్తిని వినియోగించుకుంటుందని వారు అంటారు. కండరాలైతే చలనరహితంగా ఉంటాయి.

ఎవరేమన్నారు?



అసాధ్యం వంటి విశ్వంలో అసాధారణ జీవులు మానవులు!

- రే బ్రాడ్‌బురీ

సుచరిత



అనూహ్య ఉష్ణసామర్థ్యాన్ని ప్రదర్శించే డీజిల్ ఇంజిన్ సంచలన చరిత్ర ఎంతో సుదీర్ఘం. ఇదే సమయంలో గత కొన్నేళ్లుగా దీనివల్ల వాతావరణంలోకి వచ్చి చేరుతున్న కాలుష్యకారక వాయువులు కలిగిస్తున్న పర్యావరణ నష్టమూ తక్కువదేమీ కాదు. ఒకవైపు ప్రతికూలత, మరోవైపు అనుకూలతల నడుమ ఈ అద్భుత యంత్రం అభివృద్ధి మాత్రం ఆగకుండా కొనసాగుతూనే ఉంది. 'తక్కువ శక్తి వినియోగంతో ఎక్కువ సామర్థ్యాన్ని పొందే' లక్ష్యంతోనే ఈ ఇంజిన్లను ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తున్నారు. ఒకనాటి స్టీమ్ ఇంజిన్ స్థానంలో వచ్చిన డీజిల్ ఇంజిన్ ప్రాథమిక స్థాయిలో అసాధారణ చరిత్రనే సృష్టించింది. భారీ ట్రక్కులను లాగడానికి ఇది తప్ప మరో ప్రత్యామ్నాయం ఇప్పటికీ లేదు. క్రీ.శ. 1885లో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో రుడోల్ఫ్ డీజిల్ సృష్టించిన నమూనాతో వీటి యుగం ప్రారంభమైంది. 1960, 70లలో టర్బో డీజిల్ ఇంజిన్లు రోడ్లను ఏలాయి. ఇప్పటికి వీటి తయారీలో భారీ మార్పులే వచ్చాయి. ఉద్గారాల స్థాయిని తగ్గిస్తూ సామర్థ్యాన్ని పెంచుతూ ఆధునీకృతమవుతున్న డీజిల్ ఇంజిన్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే ఉన్నప్పటికినీ దీనికి దీటైన ప్రత్యామ్నాయం వచ్చే వరకు 'నువ్వే దిక్కు' అనక తప్పని పరిస్థితే మరి.

ఆధునిక పోకడ

గాలితో నడిచే కారు

ఈజిప్టులోని ఇంజినీరింగ్ విద్యార్థులు గాలితో నడిచే కారు నమూనాను తయారుచేశారు. సంపీడన ప్రాణవాయువుతో నడిచే ఈ రకమైన వాహనాలతో కాలుష్యం నివారణవడమే కాక, ఇంధన ఖర్చు కూడా కలిసి వస్తుందని వారంటున్నారు.



ఒకే వ్యక్తి కూర్చుని ప్రయాణించడానికి అనువైన, కేవలం గాలితో మాత్రమే నడిచే కొత్త రకం కారును ఈజిప్టుకు చెందిన హెల్వన్ (Helwan) విశ్వవిద్యాలయానికి చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమ ప్రాజెక్టులో భాగంగా రూపొందించారు. చిన్న రేసింగ్ కారులాంటి ఈ వాహనాన్ని సంపీడన ప్రాణవాయువు (compressed oxygen) తో నడిపించారు. దీనిలో ఒక వ్యక్తి ప్రస్తుతానికి గంటకు 40 కి.మీ. వేగంతో ప్రయాణించ వచ్చునని, సుమారు 30 కి.మీ. మైలేజీకి ముందు తిరిగి ఇంధనాన్ని నింపుకోవాల్సి ఉంటుందని వారు తెలిపారు. సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధిలో భాగంగా దీనిని రూపొందించినట్లు వారు చెప్పారు.

ఈ కారును తయారు చేయడానికి సుమారు 18,000 ఈజిప్టియన్ పౌండ్లు (1,008.40 అమెరికన్ డాలర్లు) వ్యయం కాగలదని పై విద్యార్థులు వెల్లడించారు. కావలసిన మేర నిధులు సమకూర్చుకొని పెద్ద మొత్తంలో ఈ వాహనాల తయారీకి శ్రీకారం చుట్టగలమని కూడా వారు అంటున్నారు. గంటకు సుమారు 100 కి.మీ. వేగంతో, మరో 100 కి.మీ. మైలేజీకి ముందే గాలిని తిరిగి నింపుకోవాల్సిన రీతిలో దీని సాంకేతికతను మరింతగా మెరుగు పరుస్తామని వారు చెబుతున్నారు.

భూవిజ్ఞాన శాస్త్రం

కొత్త థాలియమ్ ఆవిష్కరణ

అతి పురాతన కాలానికి చెందిన అగ్నిపర్వత ప్రదేశంలోని భూగర్భ ప్రాంతంలో భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు ఒక కొత్త రకం థాలియమ్ ఖనిజాన్ని కనుగొన్నారు. దీనిద్వారా భూగర్భ ఖనిజాల వెలికితీతకు సంబంధించి కొత్త విషయాలు తెలిసే అవకాశాలు ఉండగలవని వారు భావిస్తున్నారు.




ఆస్ట్రేలియాకు చెందిన మెల్బోర్న్ నగరంలోని మోనాష్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నటాలియమలికైట్ (Nataliyamalikite) పేర్న పిలిచే కొత్త థాలియమ్ ఖనిజాన్ని ఒక అగ్నిపర్వత ప్రాంతంలో కనుగొన్నారు. స్ఫటిక వ్యవస్థలకు చెందిన ఆర్థోర్హాంబిక్ రూపంలోని థాలియమ్ ఐయోడైడ్ (TlI) గా వారు దీనిని గుర్తించారు. ఇది తీవ్ర విషతుల్య లక్షణంతో పేరెన్నికగన్న ఒక భార లోహం. రష్యాలోని సుదూర తూర్పు ప్రాంతానికి చెందిన కాంచట్క పెనిన్సులా (Kamchatka Peninsula) ద్వీపకల్పంలో ఇది వెలుగులోకి వచ్చింది. అతిప్రాచీనమైన 'ట్రియాసిక్' (సుమారు 251–199 మిలియన్ సంవత్సరాల కిందటి) శకకాలంలో ఇది ఏర్పడి ఉంటుందని వారు భావిస్తున్నారు. కాంచట్క అవాచ (Avacha) అగ్నిపర్వతానికి చెందిన 'స్యూడో క్యూబిక్ నానోక్రిస్టల్స్' వల్ల ఈ ఖనిజం ఏర్పడి ఉంటుందని, భూమ్మీది అత్యంత శక్తివంతమైన అగ్నిపర్వతాలలో ఇదొకటని పై పరిశోధకుల బృందం నాయకుడు ప్రొ॥ బ్రగ్గర్ తెలిపారు. ఈ పరిశోధనా పత్రం 'అమెరికన్ మినరాలిజిస్ట్' జర్నల్‌లో ప్రచురితమైంది.

కాలసర్ప చక్రబంధం

ఖగోళ శాస్త్రవేత్తలకు సుదీర్ఘకాలంగా అంతుబట్టకుండా ఉన్న అతిపెద్ద విశ్వరహస్యాలలో 'కాలసర్ప భావన' ఒకటి. ఇప్పుడిప్పుడే మళ్లీ తెరమీదికి వస్తున్న ఈ సిద్ధాంతాన్ని స్థిరంగా బలపరుస్తున్న అంశాలు అత్యంత ఆసక్తికరంగానే కాక వాస్తవికంగానూ ఉన్నాయి. న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్, డివిజన్ ఆఫ్ ఫిజిక్స్ రిటైర్డ్ ప్రొఫెసర్, హెడ్ ఎ.వి.మొహరిర్ ఇటీవలి తన వ్యాసంలో వెల్లడించిన కీలక చర్చనీయాంశాలలో ఇదొకటి.

సృష్టి రహస్యాలు



కవులు కాలాన్ని సర్పంతో ఎందుకు పోల్చారో చెప్పడానికి నిరూపణలు అక్కర్లేదు. సృష్టిలోని ప్రతీ వస్తువూ ఎప్పుడో ఒకప్పుడు కాలగర్భంలో కలిసి పోవాల్సిందే. అది ఎంతటి వస్తువైనా సరే. పరమాణువుల నుంచి బ్రహ్మాండం వరకూ ప్రతీ ఒక్కటీ కాలసర్పం కడుపులోకి చేరవలసిందే. చాలా చిత్రంగా అలా చేరిన పదార్థమంతా ఆవృత (cyclic) విధానంలో మళ్లీ మళ్లీ పుడుతూ, మళ్లీ మళ్లీ అంతరిస్తూ ఉండాల్సిందే. ఇదే 'కాలసర్ప సిద్ధాంతం'.

సమస్త చరాచర సృష్టీ కాలసర్ప చక్రబంధంలోకి వస్తుందని కొందరు ఖగోళ శాస్త్రజ్ఞులు ఘంటాపథంగా చెబుతున్నారు. సృష్టితోపాటు పుట్టి, పెరుగుతూ వున్న కాలం (time) తన మనుగడ కోసమైతేనేం, 'ఆకలి' తీర్చుకోవడాకో అయితేనేం తనను పుట్టించిన పదార్థాన్నే మొత్తంగా కబళించేస్తూ, తిరిగి ఉద్భవింపజేస్తున్నదన్నది ఇందులోని సూత్రీకరణ. దీనిలోని నిజానిజాలను వారు విశ్లేషించిన వారికి ఆసక్తికరమైన విషయాలెన్నో బోధపడ్డాయి. న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్, డివిజన్ ఆఫ్ ఫిజిక్స్ రిటైర్డ్ ప్రొఫెసర్, హెడ్ ఎ.వి.మొహరిర్ ఇటీవల 'యూనివర్సిటీ న్యూస్' మేగజైన్‌లో ప్రచురించిన వ్యాసంలో దీనిని ఉటంకిస్తూ అనేక మూలాధారాలను వెల్లడించారు.

ఈ సందర్భంలోనే ప్రాచీన ఈజిప్టియన్ ప్రతిమాశాస్త్రం (Iconongraphy) లోని ఆరోబోరస్ లేదా యూరోబోరస్ (Ouroboros or uroborus) చిహ్నం ప్రస్తావనకు వచ్చింది. ఇందులో 'తన తోకను తాను తినేసే భీకరసర్పం (డ్రాగన్)' ఉంటుంది. దీనిని సృష్టి అంతటికీ వర్తింపజేస్తూ 'కాలసర్ప భావన'ను పై శాస్త్రవేత్తలు తెరపైకి తెచ్చారు. ఇది ప్రాచీన గ్రీకుల నుండి ఆధునిక శాస్త్రవేత్తల వరకూ వచ్చింది. 'తన తోకను తానే తినేసే సర్పాలు నిజంగా ఉంటాయా?' అన్న చర్చాక్రమంలో 'అసలు ప్రకృతిలో తన అవయవాలను తానే తినేసే (autocannibalism) జంతువులూ కొన్ని లేకపోలేదన్న' అంశం ఒకటి వెలుగుచూసింది. దీనినే మొత్తం జగత్తు కాలానికి వర్తింపజేస్తూ 'కాలసర్ప' సిద్ధాంతాన్ని వారు ప్రతిపాదిస్తున్నారు. ఈ క్రమంలోనే 'ఆరోబోరస్ జగత్తు'ను సమర్థించే పలు అంశాలను వారు వెల్లడించారు.

భూమిమీది మూలకాలు, వాతావరణం, ప్రకృతి వంటివి మాత్రమే ఆవృత లక్షణాలు గలవిగా అనుకుంటే మనం పొరపడినట్లేనని పై శాస్త్రజ్ఞులు అంటున్నారు. ఈ ఆవృత వ్యవస్థ కేవలం మన భూమివద్దే ఆగిపోలేదని, మొత్తం జగత్తంతా వ్యాపించిందన్నది వారి వాదన. సృష్టి ఆవిర్భావ సమయంలో పుట్టిన మూల (ప్రాథమిక) పదార్థాలన్నీ కాలం తీరిన తర్వాత అంతరిస్తూ చర్విత చరణంగా మళ్లీ పునరుద్భవిస్తూ ఉన్నాయని వారు అంటున్నారు. ఈ పదార్థాలన్నీ వివిధ రూపాలను సంతరించుకొంటూ చిట్టచివరకు మొత్తంగా విడివడి పోయి తమ పూర్వస్థితికే వస్తున్నాయనీ వారు చెబుతున్నారు. విశ్వావిర్భావం నాటి ప్రాథమిక (మౌలిక) పదార్థాలు, మూలకాల పరిస్థితి మొత్తం ఇంతేనన్నది వారి అభిప్రాయం.

భూమి, చంద్రుని భ్రమణాలు, సూర్యుని చుట్టూ వాటి పరిభ్రమణాలు, ఋతువులు, పూలు, పండ్లు, ధాన్యాలు, పంటలతోకూడిన అన్ని రకాల వృక్ష ఉత్పత్తి, జంతుజాల పునరుత్పత్తి, రాత్రి పగళ్ల దివాసంబంధాలు, జీవుల సృష్టి స్థితి లయ (biological rhythm), ఉష్ణోగ్రతలు ఇలాంటివన్నీ సర్వసాధారణ ఆవృత వ్యవస్థకు లోబడే ఉంటున్నాయన్నది ఇక్కడ గమనార్హం. భూమ్యయస్కాంతత్వంలోని ఆవృత మార్పులవల్ల ఉత్పన్నమయ్యే సంకేతాలతోసహా కాంతి ఋణావేశం, ఉష్ణ అస్థిరత, పరమాణు ప్రేరేపణలన్నీ పైన పేర్కొన్న 'ఆవృత సాధారణ దృగ్విషయం' కిందికే వస్తాయని పై ఖగోళ శాస్త్రవేత్తలు అంటున్నారు. భూమ్మీది ఈ రకమైన స్థితిగతులే ఇతర గ్రహాలు, నక్షత్ర మండలాలు, విశ్వాలన్నింటా ఉన్నాయన్నది వారి సైద్ధాంతిక భావన.


మనిషి 'విశ్వ ప్రతిధ్వనికారి' (Cosmic Resonator) అని, ఋతు సంబంధ ఆవృతాలతోనే కాకుండా సూర్యుడు, భూమి, చంద్రునితో సైతం మనుగడకు కావలసిన సామరస్య గుణాల్ని కలిగి ఉంటాడన్న సంగతిని ప్రసిద్ధ రచయిత విలియమ్ ఎఫ్ ప్యాటర్సన్ (1891–1980) తన పుస్తకం 'మ్యాన్, వెదర్ అండ్ సన్'లో 1947లోనే వ్యక్తపరిచినట్టు ఎ.వి. మొహరిర్ తన వ్యాసంలో పేర్కొన్నారు. భూమి మీది అన్ని రకాల జీవజాతుల మనుగడకు సూర్యుడు అత్యావశ్యకమైన శక్తిని అందిస్తున్న సంగతి మనకందరికీ తెలిసిందే. అలాగే, వాతావరణ మనుగడకు చంద్రుడూ అవసరం. మనం ఉన్న ఈ పరిస్థితే సరిగ్గా విశ్వమంతా వ్యాపించి ఉందన్నది స్పష్టమవుతున్నట్టు ఆయన చెప్పారు.

'పదార్థ నియంత్రణ వ్యవస్థ' ఇక్కడితో ఆగిపోకుండా జీవ శరీరాలలోనూ వ్యాపించింది. మనిషి శరీర సుప్తావస్థలోని నియమితకాలిక లయ, సంయోగ ప్రవర్తన, శరీర ఉష్ణోగ్రత, రక్త నిర్మాణం, దాని పరిమాణం, చిక్కదనం, పీడనం వంటి వాటితో సహా పలు రకాల శరీర, ప్రవర్తనా విధానాలన్నీ భౌగోళికం, విశ్వ కదలికల (terrestrail and cosmic disturbances) తోనే ప్రేరేపితమవుతాయని పై శాస్త్రజ్ఞులు అంటున్నారు. దీనితోపాటు పైవన్నీ మనిషి శరీరంలోని హైపోథాలమస్ (మెదడులోని థాలమస్ కింది భాగం), పైనియల్ (మెదడులోని శంఖాకారపు నిర్మాణం), పీయూషగ్రంథి, తదితర గ్రంథుల ద్వారా సదృశ్యకంగా ప్రేరేపితమవుతాయన్న విషయాన్నీ వారు ఈ సందర్భంగా ఉటంకించారు. వీటన్నింటితోపాటు మొత్తంగా మానవ శరీర ధర్మాలు, ఆలోచనలు, చర్యలన్నింటిపైనా మనిషి మెదడు భారీ నియంత్రణ (మాస్టర్ కంట్రోల్)ను కలిగి ఉండడమూ ఇక్కడ గమనార్హమని వారంటున్నారు.

ఈ నేపథ్యంలో మనిషి భూమిపై ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన, సామరస్య పూర్వక జీవనాన్నే కనుక కోరుకుంటుంటే అతను ప్రకృతి సూత్రాలను అవగాహన పరచుకొని, వాటి పరిధిలోనే కొనసాగుతూ, అందుకు అనుగుణంగానే వ్యవహరిస్తూ ఉండాల్సి ఉంటుందని పై శాస్త్రవేత్తలు వివరించారు. తెలిసైనా, తెలియకైనా, ఏ రకమైన నిర్లక్ష్యమైనా, పెడధోరణినైనా, స్వేచ్ఛాపోకడనైనా వాటికి వ్యతిరేకంగా ప్రదర్శిస్తే పర్యవసానం దారుణ విపత్తులకో, ప్రళయానికో పరిణమించవచ్చునని కూడా వారు హెచ్చరిస్తున్నారు.

మస్తిష్క వ్యవస్థ మరో పెద్ద రహస్యం

మన మస్తిష్కంలోని నాడీకణాలదైతే మరో అనూహ్య విస్తరణాత్మక వ్యవస్థ. ఇందులోని నాడీకణాల నడుమగల వందలాది బిలియన్ల అంతర సంబంధాలు శరీర ప్రసారాలను ఉత్తేజ పరచడం, హార్మోన్ సంబంధ సమాచారాల్ని వివిధ అయవాలకు చేరవేయడం వంటి ప్రక్రియలను జరుపుతాయి. ఇవన్నీ ప్రాకృతిక నియంత్రణతో, స్థిర ఉష్ణోగ్రత వద్దే జరుగుతుండడం ఇక్కడ ఆసక్తికరమైన పరిణామం. మెదడు ఉష్ణోగ్రతలో సంభవించే మార్పులు అనిశ్చితమైన, అనూహ్య ప్రతిస్పందనలకు దారితీస్తాయి. ఇలాంటి ప్రత్యక్ష ప్రవర్తనలన్నీ ఒక్క మనిషిలోనే కాదు, జంతువులు, కీటకాలలో సైతం సంభవిస్తాయని శాస్త్రజ్ఞులు అంటున్నారు. ఆఖరకు మొక్కలుకూడా తమ పరిసర పర్యావరణాల నుంచే ఉత్తేజితమవుతూ, శరీర, జీవరసాయన సంబంధ ప్రేరణల మాదిరిగానే ప్రతిస్పందిస్తాయని వారు అంటున్నారు. ఇక్కడే అసాధారణ మిస్టరీ ఒకటుంది. మనతోపాటు అనేక క్షీరదాలు, పక్షులు ఏకీకృతమైన స్థిర ఉష్ణోగ్రత (సుమారు 37.5 డిగ్రీల సెల్సియస్)ను వివధ రకాల వాతావరణాల నడుమ (అది అర్కిటిక్‌లో అయినా, ఆఫ్రికా సహారా ఎడారిలో అయినా సరే) ఎలా నిర్వహించుకో గలుగుతున్నాయన్నదే అంతుబట్టని విషయమని వారు అంటున్నారు.



దోర్బల బాలశేఖరశర్మ

పనితనం



కెమెరా ఒక దృశ్య సంబంధమైన పరికరం. తొలుత స్టిల్ కెమెరాతో ఫొటోలు చిత్రీకరించి ఫిల్మ్‌లో ప్రాసెస్ చేసుకొని ప్రింట్ వేసేవారు. డిజిటల్ యుగం ఆరంభమైనాక చాలావరకు ఫొటోగ్రఫీ ఇందులోకి మారింది. సెల్ కెమెరాలతోపాటు డిజిటల్ కెమెరాలూ వచ్చాయి. కెమెరా పనితనం మానవ నేత్రాన్ని పోలి ఉంటుంది. దాదాపు అన్ని రకాల కెమెరాలూ ఒకే విధమైన ప్రాథమిక రూపకల్పనతోనే ఉంటాయి. కనిపించే కాంతి పరావర్తనం ఆధారంగానే ఇది పనిచేస్తుంది. స్టిల్ కెమెరా ఒక వస్తువుకు సంబంధించిన చిత్రాలను ఫొటోగ్రఫిక్ ఫిల్మ్ లేదా ఎలక్ట్రానిక్ సెన్సర్లపై చిత్రీకరిస్తుంది. ఇందులోని కాన్వెక్స్ (కుంభాకార) కటకం, ఇతర లెన్సుల ద్వారా ఛాయాచిత్ర చిత్రీకరణ జరుగుతుంది. కాగా, తొలి శాశ్వత ఛాయాచిత్రాన్ని క్రీ.శ. 1825లో ఫ్రాన్స్‌కు చెందిన జోసెఫ్ నైసెఫోర్ నీప్స్ (Joseph Nicephore Niepce) చిత్రీకరించారు.

కొత్త రెక్కల రాక్షసబల్లి

పురాజీవ శాస్త్రం

మధ్య జురాసిక్ శకానికి చెందిన కొత్త రెక్కల రాక్షసబల్లి శిలాజ అవశేషాలను ఇంగ్లాండ్‌లోని లుప్తజంతు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వీటి రెక్కల వైశాల్యమే 6.5 అడుగుల మేర ఉండినట్టు వారు చెబుతున్నారు.



'క్లోబియోడాన్ రోచీ' (Klobiodon rochei) గా పిలిచే టెరోసార్స్ (pterosaurs) జాతి రాక్షసబల్లి శిలాజ అవశేషాలను ఇంగ్లాండ్‌కు చెందిన హ్యాంప్‌షైర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ పోర్ట్స్‌మౌత్ పరిశోధకులు ఇటీవల కనుగొన్నారు. ఇది పెద్ద రెక్కల సరీసృపమని, సుమారు 167 మిలియన్ సంవత్సరాల కిందట (మధ్య జురాసిక్ శకం) ఇవి నివసించి ఉంటాయని వారు భావిస్తున్నారు. సుమారు 6.5 అడుగుల (2 మీటర్లు) రెక్కల వైశాల్యంతో ఉన్న ఈ రాక్షసబల్లి శిలాజ అవశేషాలను ఆక్స్‌ఫర్డ్‌షైర్‌కు చెందిన స్టోన్స్‌ఫీల్డ్‌లోని టేంటన్ లైమ్‌స్టోన్ (సున్నపు రాయి) నిర్మాణాలలో కనుగొన్నట్లు వారు తెలిపారు. దీని కింది దవడ మాత్రమే వెలుగులోకి వచ్చిందని, సుమారు 1 అంగుళం (.2.6 సెం.మీ.) సైజు కోరల వంటి దంతాలు దీనికి ఉండి ఉంటాయని వారు తెలిపారు. చూడటానికి ఒక రకమై సముద్రపు కొంగను పోలి ఉండే ఈ టెరోసార్ రెక్కల రాక్షసబల్లి అవశేషాల ఆవిష్కరణ తాలూకు పరిశోధనా పత్రం 'ఆక్టా పాలియోంటొలాజికా పొలానికా' (Acta Palaeontologica Polonica) జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైంది.

రచనలకు ఆహ్వానం!

వివిధ విజ్ఞాన శాస్త్రీయ విశ్లేషణలతో కూడిన వ్యాసాలను మీరూ ఈ పేజీకి రాయవచ్చు. సృజన, కొత్తదనాలకు ప్రాధాన్యం. మా చిరునామా: ఎడిటర్, శాస్త్ర, నమస్తే తెలంగాణ, తెలుగు దినపత్రిక, బంజారాహిల్స్, రోడ్ నంబర్: 10, హైదరాబాద్-34.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

ఇండియన్ నేవీలో ఆఫీసర్లు

ఇండియన్ నేవీ జనరల్ సర్వీస్/ హైడ్రోక్యాడర్‌లో ఖాళీగా ఉన్న ఎస్ఎస్‌సీ ఆఫీసర్, ఎన్ఏఐసీలో పీసీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుషుల నుంచి ఇండియన్ నేవల్ అకాడమీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- మొత్తం ఖాళీలు: 102
- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ (జనరల్ సర్వీస్ లేదా హైడ్రోగ్రఫీ క్యాడర్)-30 ఖాళీలు
- **అర్హత:** బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ (ఎన్ఏఐసీ)-12 ఖాళీలు
- **అర్హత:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్/టెలి కమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్, మైక్రో ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంట్రోల్, ఇండస్ట్రియల్, ప్రొడక్షన్, ఏరోస్పేస్, మెటలర్జికల్, కెమికల్, మెటీరియల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్/ఐటీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- టెక్నికల్ బ్రాంచ్ (ఇంజినీరింగ్ జనరల్ సర్వీస్)-28 ఖాళీలు
- **అర్హత:** మెకానికల్, మెరైన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రొడక్షన్, ఏరోనాటికల్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ & మేనేజ్‌మెంట్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, మెటలర్జీ, మెకట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- టెక్నికల్ బ్రాంచ్ (ఎలక్ట్రికల్ జనరల్ సర్వీస్)-32 ఖాళీలు
- **అర్హత:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్, పవర్/ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 1995 జనవరి 2 నుంచి 2000 జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.
- **గమనిక:** ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్షన్ క్యాడర్ (ఎన్ఏఐసీ) పోస్టులను మాత్రమే పర్మినెంట్ కమిషన్ కింద, మిగతావి షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేస్తారు.
- **శారీరక ప్రమాణాలు:** 157 సెం.మీ.ఎత్తు ఉండాలి. సంస్థ నిబంధనల ప్రకారం నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలతోపాటు మంచి కంటిచూపు, ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ద్వారా. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలను రెండు దశల్లో చేపడుతుంది. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు బెంగళూరు, భోపాల్, విశాఖపట్నం,కోయంబత్తూరులలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- ఇంటర్వ్యూల్లో మొదటి స్టేజీలో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్‌సెప్షన్, డిస్కషన్ టెస్ట్ ఇంటర్వ్యూలను మొదటిరోజు నిర్వహిస్తారు. తర్వాత రెండోదశలో వీరికి సైకలాజికల్ టెస్ట్, గ్రూప్ టెస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూలను మొత్తం మూడు నుంచి ఐదు రోజులపాటు నిర్వహిస్తారు.
- **శిక్షణ:** నేవల్ ఓరియెంటేషన్ కోర్సును కేరళ-ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణను ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులు ప్రారంభం:** జనవరి 12
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 19
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

'వెటర్నరీ'లో ఫ్యాకల్టీలు

హైదారాబాద్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (పీవీఎన్ఆర్‌టీవీయూ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల (కాంట్రాక్టు ప్రాతిపదికన) భర్తీకి ప్రకటన విడుదల చేసింది.



- మొత్తం ఖాళీలు: 36 (వెటర్నరీ సైన్స్-30, ఫిషరీస్-6)
- **పోస్టు పేరు:** ప్రొఫెసర్
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ (ఎంవీఎస్సీ, ఎంఎఫ్ఎస్సీ) లేదా పీహెచ్‌డీ. సంబంధిత రిసెర్చ్/టీచింగ్ రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు
- **పేస్కేల్:** రూ.37,800, ఎంవీఎస్సీ, ఎంఎఫ్ఎస్సీతోపాటు నెట్/స్లెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి రూ.43,470/-
- **ఎంపిక:** వర్సిటీ నింబంధనల ప్రకారం/ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చిరునామా:** పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030
- **ఇంటర్వ్యూ తేది:** జనవరి 11
- **వెబ్‌సైట్:** www.tsvu.nic.in

హెచ్‌సీయూలో


హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఖాళీగా ఉన్న క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.



- **పోస్టు పేరు:** క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్
- **మొత్తం ఖాళీలు:** 3
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రీతో పాటు మూడేండ్ల అనుభవం లేదా మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ లేదా ఆప్టోమెట్రీ విజన్ సైన్స్‌లో ఐఎంఎస్సీ, ఎమ్మెస్సీ (ఫిజిక్స్)తోపాటు ఏడాది అనుభవం ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 25,000/-
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 9
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

సిద్ధాలో ఖాళీలు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధ ఖాళీగా ఉన్న కింది పోస్టుల (కాంట్రాక్టు) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- మొత్తం ఖాళీలు-7
- **విభాగాలవారీగా ఖాళీలు:** ప్రొఫెసర్-1, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్-3, ఎమర్జెన్సీ మెడికల్ ఆఫీసర్-2, హౌస్ ఆఫీసర్-1
- **అర్హత:** బీఎస్ఎంఎస్/బీఐఎం/ పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ. ప్రొఫెసర్‌కు బోధన/రిసెర్చ్ రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 10
- **వెబ్‌సైట్:** www.nischennai.org

ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్)లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

AIESL
AIR INDIA ENGINEERING SERVICES LIMITED

- **పోస్టు:** సీనియర్ ఎగ్జిక్యూటివ్ (ఫైనాన్స్)-1, ఎగ్జిక్యూటివ్ (ఫైనాన్స్)-4, ఎగ్జిక్యూటివ్ (హెచ్ఆర్)-1
- **అర్హత:** సీఏ/ఐసీడబ్ల్యూఏ లేదా ఎంబీఏ (ఫైనాన్స్/హెచ్ఆర్)తోపాటు అనుభవం.
- **పోస్టు:** ఎగ్జిక్యూటివ్ (ఈఎఫ్‌డీ)-2, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎంఎండీ)-1 ఖాళీ.
- **అర్హత:** సంబంధిత బ్రాంచీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఇంటర్వ్యూల ద్వారా
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** www.airindia.in చూడవచ్చు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
మంగళవారం 8 జనవరి 2019

దేశభక్తి నా శక్తి


వివేక్ ఒబెరాయ్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీవితం వెండితెరపై ఆవిష్కృతం కానుంది. 'పీఎం నరేంద్రమోదీ' అనే టైటిల్‌తో 23 భారతీయ భాషల్లో రూపొందనున్న ఈ చిత్రంలో మోదీ పాత్రను బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ పోషించబోతున్నారు. ఒమంగ్‌కుమార్ దర్శకత్వం వహించనున్నారు. ఫస్ట్‌లుక్‌ను సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విడుదలచేశారు. ఇందులో వివేక్ ఒబెరాయ్ అచ్చు మోదీ రూపురేఖలతో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌ను అభిమానులతో పంచుకున్న వివేక్ ఒబెరాయ్ 'అద్భుతమైన ప్రయాణానికి అందరి ఆశీస్సులు కావాలి' అని పేర్కొన్నారు. దేశభక్తే నా శక్తి అనే క్యాప్షన్‌ను పోస్టర్‌లో జోడించారు. మోదీ జీవితంలోని కీలక ఘట్టాలను ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

సంక్రాంతికి సంపూర్ణ వినోదం


హర్షిత్, దిల్‌రాజు, తమన్నా, మెహరీన్, వెంకటేష్, వరుణ్‌తేజ్, అనిల్, శిరీష్

'ఇంట్లో ఇల్లాలు-వంటింట్లో ప్రియురాలు, మల్లీశ్వరి, నువ్వునాకు నచ్చావ్ తర్వాత పూర్తిస్థాయి కామెడీ కథాంశంతో నేను చేసిన సినిమా ఇది. సంక్రాంతికి సంపూర్ణమైన కుటుంబ కథా చిత్రంగా నిలుస్తుంది' అని అన్నారు వెంకటేష్. వరుణ్‌తేజ్‌తో కలిసి ఆయన నటించిన మల్టీస్టారర్ చిత్రం 'ఎఫ్-2 ' 'ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' ఉపశీర్షిక. దిల్‌రాజు సమర్పణలో శిరీష్, లక్ష్మణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకుడు. తమన్నా, మెహరీన్ కథానాయికలు. ఈ నెల 12న ఈ చిత్రం విడుదల కానుంది. ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో చిత్ర బృందం విడుదలచేసింది. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో మొత్తం చేయాల్సిన కామెడీని ఈ ఒక్క సినిమాలోనే చేయించారు దర్శకుడు అనిల్ రావిపూడి. వెంకటేష్ కామెడీని పండించడంలో దిట్ట. ఆయన శైలికి సరితూగేలా వినోదాన్ని పలికించడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. వెంకటేష్ ఇచ్చిన ప్రోత్సాహం వల్ల ఈ చిత్రంలో కామెడీ అద్భుతంగా చేయగలిగాను' అని పేర్కొన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ 'అనిల్ రావిపూడితో మా బ్యానర్‌లో మూడో సినిమా ఇది. ఇగో, విభేదాలు లేకుండా మా ప్రయాణం మొత్తం సరదాగా సాగిపోతుంది. సినిమాలో ప్రతి పాత్ర వినోదభరితంగా ఉంటుంది. సంక్రాంతికి ప్రేక్షకుల్ని నవ్విస్తూనే పెద్ద విజయాన్ని అందుకుంటుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. రెండు గంటల ఇరవై ఆరు నిమిషాల పాటు కుటుంబమంతా హాయిగా నవ్వుకునే సినిమా ఇదని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. ఈ కార్యక్రమంలో తమన్నా, మెహరీన్, శిరీష్, హర్షిత్, సమీర్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

> "మూడు పెద్ద సినిమాలకు థియేటర్లను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక నిర్మాతలు, పంపిణీదారులు సతమతమవుతున్నారు. ఇలాంటి తరుణంలో తమిళ అనువాద సినిమాను సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు ఒక నిర్మాత నిర్ణయించారు. తెలుగు సినిమాలకు కాకుండా ఇతర భాషల చిత్రాలకు థియేటర్లు కేటాయించే పరిస్థితి ప్రస్తుతం లేదు. ఇవి ఆలోచించకుండా నోరు జారి పిచ్చి పిచ్చిగా మాట్లాడారు. అలాంటి మాటలు మేము మాట్లాడగలం. కానీ నాకో వ్యక్తిత్వం ఉంది. పంపిణీదారుడిగా ఏడాది కాలంలో చాలా డబ్బులు కోల్పోయాను. అయినా సినిమాల పట్ల ఉన్న ఇష్టం, ప్రేమతో నిర్మాత, పంపిణీదారుడిగా కొనసాగుతున్నాను"
>
> **- దిల్‌రాజు**

రజనీ అభిమానులకు పండగే!


అశోక్

'కేసీఆర్ డైనమిక్ లీడర్. ప్రజల అభిమానంతో రెండోసారి తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. థియేటర్ల మాఫియాను అరికట్టి నిర్మాతలకు ఓ మంచి పరిష్కారాన్ని చూపించాలని ఆయన్ని కోరుతున్నాం' అని అన్నారు నిర్మాత అశోక్ వల్లభనేని. రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తమిళ చిత్రం 'పేట్ట'. కార్తిక్ సుబ్బరాజు దర్శకుడు. ఈ చిత్రాన్ని 'పేట' పేరుతో నిర్మాత అశోక్ వల్లభనేని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. విజయ్ సేతుపతి, శశికుమార్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, సిమ్రన్, త్రిష కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. నిర్మాత అశోక్ వల్లభనేని మాట్లాడుతూ 'థియేటర్ల కేటాయింపులో ఎంతో మంది ఇబ్బందులు పెడుతున్నారు. వందలాది థియేటర్లలో తమ సినిమాలను విడుదలచేస్తున్నారు. మంచి సినిమాలకు థియేటర్లు ఇవ్వడం లేదు. ప్రస్తుతం సామాన్యుడికి సినిమానే ప్రధాన వినోద సాధనంగా ఉంది. అయితే థియేటర్ల మాఫియా కారణంగా ప్రేక్షకులకు నచ్చిన సినిమాలు చూడలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు దీనిపై చొరవ తీసుకోవాలి. ప్రత్యామ్నాయాల్ని చూపించాలి. మిగతా సినిమాలతో పోలిస్తే నా చిత్రానికి కేటాయించిన థియేటర్ల సంఖ్యను చెప్పాలంటే సిగ్గుచేటుగా ఉంది. థియేటర్లు, బిజినెస్ లెక్కల గురించి పట్టించుకోకుండా రిస్క్ తీసుకొని సొంతంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నాను' అన్నారు. 'సినిమా కళకు కుల, మత, ప్రాంతీయ భేదాలు ఉండవని రజనీకాంత్ నిరూపించారు. చరిత్రను సృష్టించారు. సినిమా బాగుంటే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు ' అని ప్రసన్నకుమార్ చెప్పారు. దర్శకుడు కార్తిక్ సుబ్బరాజు మాట్లాడుతూ 'మా అందరికి కలల సినిమా ఇది. కుటుంబ బంధాలతో ముడిపడి శక్తివంతంగా సాగుతుంది. రజనీకాంత్ అభిమానులకు పండుగలా ఉంటుంది' అని తెలిపారు. రజనీకాంత్ అభిమానుల్ని అలరించేలా కార్తిక్ సుబ్బరాజు జనరంజకంగా ఈ సినిమాను తెరకెక్కించారని సంగీత దర్శకుడు అనిరుధ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అంబికాకృష్ణ, రామజోగయ్యశాస్త్రి, బాబీసింహా, మేఘా ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.